బుధవారం
11•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 256
• పేజీలు : 12 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




epaper.ntnews.com

# అటు ఎండలు.. ఇటు వానలు

- పలు జిల్లాల్లో 38 డిగ్రీలు పైనే
- అక్కడక్కడ తేలికపాటి వానలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు ఎండలు దంచికొడుతుండగా.. మరోవైపు వానలు కురుస్తున్నాయి. మంగళవారం కొన్ని జిల్లాల్లో 38 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లా సోన్, సారంగాపూర్, పెద్దకొడపగల్, కామారెడ్డి జిల్లా మెనూరులో 38.1, హైదరాబాద్ ఆసిఫ్‌నగర్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో 36.3 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

### నేటి నుంచి పొడి వాతావరణం

మరాఠ్వాడ దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వద్ద ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. మరోవైపు ఇంటీరియర్ కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు 0.9 కిలోమీటర్ల వద్ద ఉపరితల ద్రోణి కొనసాగుతున్నది. ఫలితంగా పలు ప్రాంతాల్లో మంగళవారం తేలికపాటి వానలు కురిశాయి. మేడ్చల్, రంగారెడ్డి, వనపర్తి, నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, వికారాబాద్, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, కామారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, మంచిర్యాల, సిద్దిపేట, నారాయణపేట్ జిల్లాల్లోని పలుప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. కుమ్రంభీం-ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరులో అత్యధికంగా 52.5 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్టు స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ తెలిపింది. బుధవారం నుంచి రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.



టెస్కాబ్ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన కొండూరి రవీందర్‌రావు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం.

# నేడు మార్క్‌ఫెడ్ పాలకమండలి ఎన్నిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మార్క్‌ఫెడ్ పాలకవర్గానికి బుధవారం ఎన్నికలు జరుగనున్నాయి. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలకు నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం ఒంటిగంట వరకు నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకు ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలైనపక్షంలో ఎన్నిక చేపడుతారు. మొత్తం 7 డైరెక్టర్ పోస్టులకుగాను ఆరుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన ఒక డైరెక్టర్ పదవిపై త్వరలో నిర్ణయం తీసుకొంటామని సహకారశాఖ ఎన్నికల అథారిటీ అధికారులు ప్రకటించారు. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా నిజామాబాద్ జిల్లా అంకాపూర్ పీఏసీఎస్ చైర్మన్ ఎం గంగారెడ్డిని టీఆర్ఎస్ అధిష్ఠానం ఖరారు చేసింది. వైస్‌చైర్మన్ అభ్యర్థి ఎవరనేది ఇంకా స్పష్టంకాలేదు.




# తలసిరిలో మనం ఘనం

## 26 జిల్లాల్లో జాతీయ సగటు కంటే అధికం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

స్వరాష్ట్రంలో తెలంగాణ సంపద అనూహ్యంగా పెరుగుతున్నది. ఆర్థికమాంద్యంలోనూ ఆ జోరు కొనసాగుతున్నది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ)తోపాటు తలసరి ఆదాయం కూడా పెరిగింది. రాష్ట్రంలోని 26 జిల్లాల తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే అధికంగా ఉండటం గమనార్హం. తెలంగాణలో జిల్లాల పునర్విభజన తర్వాత 10 జిల్లాలు 33 జిల్లాలకు పెరిగాయి. దీంతో జిల్లాలో అధికారుల పర్యవేక్షణ పెరిగింది. సీఎం కేసీఆర్ తీసుకొన్న విధాన నిర్ణయాలు, పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నేరుగా ప్రజలకు చేరుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో సాగునీటి లభ్యతను గణనీయంగా పెరిగి బీళ్లన్నీ సాగులోకి రావడం, రైతుబంధు పథకం అమలుతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో సేద్యం చేస్తున్నారు. దీంతో వ్యవసాయరంగం మరింత ఊపందుకొన్నది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన టీఎస్ఐపాస్ చట్టం పారిశ్రామికరంగానికి గొప్ప టానిక్‌లా పనిచేస్తుండటంతో హైదరాబాద్‌కు పరిశ్రమలు భారీగా తరలి వస్తున్నాయి. ప్రత్యేకించి సాఫ్ట్‌వేర్ రంగానికి హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌లా మారడంతో పాటు మెడికల్ హబ్‌గా రూపుదిద్దుకొన్నది. ఇదేవిధంగా తెలంగాణలో పలు ఇతర రంగాలు ప్రగతిపథంలో పరుగులు తీస్తుండటంతో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే ఎక్కువగా నమోదయ్యింది. రంగారెడ్డి జిల్లా టాప్ 2018-19లో జాతీయ తలసరి ఆదాయం రూ.1,26,521గా ఉండగా.. తెలంగాణ తలసరి ఆదాయం రూ.2,04,488గా నమోదైంది. జిల్లాలవారీగా పరిశీలిస్తే రంగారెడ్డి జిల్లా రూ.5,78,978 తలసరి ఆదాయంతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా.. మంచిర్యాల జిల్లా రూ.1,27,703 తలసరి ఆదాయంతో 26వ స్థానంలో నిలిచింది. కేవలం వరంగల్ అర్బన్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, వనపర్తి, నాగర్‌కర్నూల్, జగిత్యాల, నారాయణపేట జిల్లాలు మాత్రమే జాతీయ సగటు కంటే స్వల్పంగా వెనుకబడి ఉన్నాయి.



జిల్లాలవారీగా తలసరి ఆదాయం (రూపాయల్లో)

| జిల్లా పేరు | తలసరి ఆదాయం | జిల్లా పేరు | తలసరి ఆదాయం |
|---|---|---|---|
| రంగారెడ్డి | 5,78,978 | జయశంకర్ భూపాలపల్లి | 1,44,266 |
| హైదరాబాద్ | 3,57,287 | వికారాబాద్ | 1,43,994 |
| మేడ్చల్ మల్కాజిగిరి | 2,21,025 | ఖమ్మం | 1,43,362 |
| మహబూబ్‌నగర్ | 1,94,229 | సూర్యాపేట | 1,37,005 |
| మెదక్ | 1,85,351 | మహబూబాబాద్ | 1,34,935 |
| యాదాద్రి భువనగిరి | 1,74,876 | జోగుళాంబ గద్వాల | 1,33,755 |
| సంగారెడ్డి | 1,72,020 | నిజామాబాద్ | 1,32,030 |
| సిద్దిపేట | 1,70,992 | వరంగల్ రూరల్ | 1,31,652 |
| ములుగు | 1,69,211 | జనగామ | 1,30,141 |
| కరీంనగర్ | 1,65,898 | మంచిర్యాల | 1,27,703 |
| పెద్దపల్లి | 1,62,887 | వరంగల్ అర్బన్ | 1,24,601 |
| భద్రాద్రి కొత్తగూడెం | 1,58,066 | రాజన్న సిరిసిల్ల | 1,24,252 |
| ఆదిలాబాద్ | 1,56,940 | కామారెడ్డి | 1,22,404 |
| నిర్మల్ | 1,50,134 | వనపర్తి | 1,17,844 |
| నల్లగొండ | 1,46,774 | నాగర్‌కర్నూల్ | 1,17,614 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 1,44,930 | జగిత్యాల | 1,11,717 |
| | | నారాయణపేట | 98,220 |

### తెలంగాణ ఆర్థిక ప్రగతి అద్భుతం

**ఒకప్పుడు** తెలంగాణ తలసరి ఆదాయం బీహార్ కంటే తక్కువ. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. తెలంగాణ దేశంలోనే సంపన్న రాష్టంగా మారింది. ప్రజల తలసరి ఆదాయం భారీగా పెరిగింది. ఈ మాటలు అన్నది ఎవరోకాదు. ప్రఖ్యాత ఆర్థిక నిపుణుడు మోహన్‌గురుస్వామి స్వయంగా అన్న మాటలివి. రాష్ట్ర విభజన తర్వాత, ప్రజల జీవనప్రమాణాలు గణనీయంగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. గతంలో అత్యంత పేద ప్రాంతాలుగా ఉన్న కరీంనగర్ లాంటి జిల్లాల్లో ఇప్పుడు తలసరి ఆదాయం బాగా పెరిగిందని, తెలంగాణ తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే దాదాపు 25 శాతం అధికంగా ఉండటం విశేషమని ఆయన ట్వీట్ చేశారు. ఈ అద్భుత ప్రగతికి తెలంగాణ మురిసిపోయి సీఎం కేసీఆర్‌కు కిరీటం తొడిగినా ఆశ్చర్యం లేదని మోహన్‌గురుస్వామి పేర్కొన్నారు.



మోహన్ గురుస్వామి, ప్రముఖ ఆర్థికవేత్త

# అప్పులు తక్కువే

## మరోసారి ఆర్థిక క్రమశిక్షణను చాటుకొన్న రాష్ట్రం

## తాజా బడ్జెట్‌లో రుణాలు 20.74 శాతానికి పరిమితం

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సంపద గణనీయంగా పెరుగుతున్నప్పటికీ అప్పుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం మరోసారి ఆచితూచి వ్యవహరించింది. ఆర్థిక క్రమశిక్షణ గీతదాటకుండా కేవలం అత్యవసరాలకు, భవిష్యత్ తరాల కోసం మరింత సంపదను సృష్టించేందుకే రుణాలను తీసుకొంటున్నది. రాష్ట్ర మొత్తం సంపద (జీఎస్డీపీ)లో అధికారికంగా 25 శాతం వరకు రుణాలు తీసుకునే అవకాశమున్నప్పటికీ టీఆర్ఎస్ ప్రభుత్వం దానిని 2020-21 బడ్జెట్‌లో కేవలం 20.74 శాతానికే పరిమితంచేసింది. ఈ ఏడాది అప్పులు (ద్రవ్యలోటు) ఎఫ్ఆర్‌బీఎం పరిధికి (3.5 శాతానికి) లోపే రూ.33 వేల కోట్లుగా ఉన్నట్టు ప్రభుత్వం పేర్కొన్నది. ప్రస్తుతం మన రాష్ట్ర మొత్తం సంపద రూ.9.69 లక్షల కోట్లకు పెరిగినందున అందులో 25 శాతం వరకు (రూ.2,16,422 కోట్లకుపైగా) రుణాలను తీసుకునే వెసులుబాటు ఉన్నది. గతేడాది జీఎస్డీపీ (రూ.8.61 లక్షల కోట్లు)లో మొత్తం రుణాలను 21 శాతానికి పరిమితం చేయాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం.. అంతకంటే తక్కువగా 20.55 శాతానికే కట్టడిచేయడం గమనార్హం. ఈసారి బడ్జెట్ అంచనాల్లో రాష్ట్ర ప్రభుత్వం దీన్ని కేవలం 0.19 శాతం మాత్రమే పెంచి 20.74 శాతానికి పరిమితంచేసింది. వాస్తవానికి దేశంలోని చాలా రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణను పాటించకుండా జీఎస్డీపీలో 25 శాతానికి మించి అప్పులుచేస్తున్నాయి. ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని దాటి రుణాలు తీసుకుంటున్నాయి. ఈ విషయంలో ఎంతో అప్రమత్తంగా వ్యవహరిస్తున్న తెలంగాణ ప్రభుత్వం భవిష్యత్ తరాలకు మరింత సంపదను చేకూర్చే ప్రాజెక్టులకు, ఇతర అత్యవసరాలకు మాత్రమే రుణాలు తీసుకొంటున్నది. వీటిని తీర్చేందుకు మరో 25 ఏండ్ల సమయం ఉన్నది. అప్పటివరకు నామమాత్రపు వడ్డీని మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

సంవత్సరాలవారీగా తెలంగాణ జీఎస్డీపీ, రుణాల వివరాలు

| సంవత్సరం | జీఎస్డీపీ | తీసుకున్న మొత్తం | జీఎస్డీపీలో రుణాల శాతం |
|---|---|---|---|
| 2017-18 | 6,58,325 | 1,29,531.89 | 20.04 |
| 2018-19 | 7,53,811 | 1,52,190.12 | 20.23 |
| 2019-20 | 8,61,031 | 1,75,281.07 | 20.55 |
| 2020-21 | 9,69,604 | 1.99,215.30 | 20.74 |

(బడ్జెట్ అంచనా)

# వార్షిక వేతనం 27 లక్షలు!

- ఇద్దరు విద్యార్థినులకు అమెజాన్ బంపర్ ఆఫర్

**పేట్‌బషీరాబాద్:** ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థినులకు అమెజాన్ ఇండియా బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఒక్కొక్కరికి రూ. 27 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు ఇచ్చింది. మంగళవారం ఆఫర్ లెటర్లను కూడా పంపించింది. మేడ్చల్ జిల్లా దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ నాలుగో సంవత్సరం చదువుతున్న మధురిమ, శిరీష ఈ ఆఫర్ కొట్టేశారు. కళాశాలలో ఇటీవల జరిగిన ఇంటర్వ్యూల్లో వీరికి ప్లేస్‌మెంట్స్ లభించాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ పాత్ర విద్యార్థినులకు నియామక పత్రాలు అందజేశారు. చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్ విద్యార్థినులను అభినందించారు.



అమెజాన్‌లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులు మధురిమ, శిరీష

# డిగ్రీలో కొత్తకోర్సులు

- నాలుగేండ్ల కోర్సులుగా డాటాసైన్స్, బిజినెస్ ఎనలిటిక్స్
- 21న టీసీఎస్‌తో ఉన్నత విద్యామండలి ఒప్పందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మార్కెట్‌లో డిమాండ్ ఉన్న డాటాసైన్స్, బిజినెస్ ఎనలిటిక్స్ వంటి కోర్సులను డిగ్రీలో నాలుగేండ్ల(ఆనర్స్) కాలవ్యవధితో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెట్టేందుకు ఉన్నతవిద్యామండలి సూత్రప్రాయంగా అంగీకరించింది. కోర్సుల సిలబస్, విధివిధానాల రూపకల్పనకు ప్రొఫెసర్ రామచంద్రం నేతృత్వంలో కమిటీ అధ్యయనం చేస్తున్నది. నూతన కోర్సులకు సహకారంపై 21న టీసీఎస్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. నాలుగేండ్ల డిగ్రీలు ఉంటేనే ఇమ్మిగ్రేషన్ అధికారులు విదేశాలకు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు.

### ఇంజినీరింగ్‌లో పాత కోర్సులు వద్దని వినతి

సీఎస్ఈ, ఈసీఈ, ఐటీ, మెకానికల్ కోర్సులు వద్దని మంగళవారం కొన్ని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు పాపిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశాయి. ఏఐసీటీఈ అనుమతించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్‌లెర్నింగ్, డాటాసైన్స్, ఐవోటీ, నెట్‌వర్క్ కోర్సులు ప్రవేశపెట్టాలని, పాత కోర్సులు చదువుతున్నవారిని వేరే కాలేజీలకు బదిలీచేయాలని కోరాయి.


# సూక్ష్మఎవుసం.. దిగుబడి అధికం

## పెరిగిన ఆహార ధాన్యాల ఉత్పత్తి

- 2018-19లో 1.6 కోట్ల టన్నుల ఉత్పత్తి.. సూక్ష్మసేద్యంతో పెరుగుతున్న దిగుబడి
- ఆరేండ్లలో 2.48 లక్షల మంది రైతులకు డ్రిప్, స్ప్రింకర్ల సదుపాయం
- సామాజిక -ఆర్థిక సర్వే 2020 నివేదిక వెల్లడి

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:**

రాష్ట్రంలో ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. సూక్ష్మసేద్యంలో సాగువిస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో దిగుబడులు కూడా ఆశించినదానికన్నా అధికంగా ఉన్నాయి. సమృద్ధిగా లభ్యమవుతున్న సాగునీటి వసతి, రైతుబంధు వంటి పథకాల తోడ్పాటుతో రైతులు ఉత్సాహంగా పంటలు పండిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే-2020 నివేదిక ప్రకారం 2018-19 (వానకాలం, యాసంగి) సీజన్లలో 1.6 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తి అయ్యాయి. ఇందులో వరి 66.69 లక్షల టన్నులుండగా, మక్కజొన్నలు 20.83 లక్షల టన్నులు ఉత్పత్తి అయ్యాయి. ఇక 2019-20లో ఆహారధాన్యాల ఉత్పత్తి 40.17 శాతం పెరిగింది. ధాన్యం ఉత్పత్తి 32 లక్షల టన్నులు పెరిగి 98.74 లక్షల టన్నులు ఉత్పత్తయింది. అదేవిధంగా పత్తి వంటి ఆహారేతర పంటల ఉత్పత్తి కూడా పెరిగింది. ఆహారేతర పంటల ఉత్పత్తి 2016-17లో 33.6 శాతం ఉండగా, 2018-19 నాటికి 38.8 శాతానికి చేరింది.







గత ఆరేండ్లలో డ్రిప్ కనెక్షన్లు, స్ప్రింకర్ల సదుపాయం పొందిన రైతుల వివరాలు ఇలా ఉన్నాయి

| సంవత్సరం | రైతులు | డ్రిప్ కనెక్షన్లు | స్ప్రింక్లర్లు | మొత్తం |
|---|---|---|---|---|
| 2014-15 | 31,277 | 46,353 | 30,130 | 74,483 |
| 2015-16 | 39,545 | 77,979 | 21,665 | 99,643 |
| 2016-17 | 55,121 | 1,32,121 | 22,835 | 1,54,956 |
| 2017-18 | 83,458 | 1,39,289 | 84,276 | 2,23,565 |
| 2018-19 | 37,596 | 70,233 | 30,530 | 1,00,763 |
| 2019-20 | 1,745 | 3,920 | 913 | 4,833 |

### వేగంగా పెరుగుతున్న సూక్ష్మసేద్యం

తెలంగాణ ఏర్పడిననాటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరినాటికి రాష్ట్రంలో 6.6 లక్షల ఎకరాల్లో సూక్ష్మసేద్యాన్ని అమలుచేస్తున్నారు. రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సూక్ష్మసేద్యం వేగంగా విస్తరిస్తున్నది. రాష్ట్రంలో సుమారు 56 లక్షల మంది రైతులుండగా, గత ఆరేండ్లలో 2.48 లక్షల మంది డ్రిప్ సదుపాయం పొందారని సామాజిక-ఆర్థిక నివేదిక తెలిపింది. సూక్ష్మసేద్యం వల్ల రైతులకు ఖర్చు కూడా భారీగా తగ్గిందని నాబ్కాన్స్ సర్వే సైతం వెల్లడించింది. నాబార్డు నుంచి రుణం తీసుకొని అమలుచేస్తున్న ఈ పథకంలో దేశంలో ఎక్కడాలేని విధంగా ఎస్సీ, ఎస్టీలో సూక్ష్మసేద్యంలో వందశాతం సబ్సిడీ ఇస్తున్నారు. సూక్ష్మసేద్యం ద్వారా మరింతమంది రైతులకు లబ్ధి చేకూర్చే ఉద్దేశంతో కేసీఆర్ సర్కార్ ఈసారి బడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటాయించింది.

# అంగన్‌వాడీలకు ఒంటిపూట

- కమిషనర్ దివ్యను కోరిన అంగన్‌వాడీ ఉద్యోగులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వేసవి తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఒంటిపూట సెలవులు ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి కోరారు. మంగళవారం స్త్రీ, శిశుసంక్షేమశాఖ కమిషనర్ దివ్యను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

# మత వైషమ్యాలు రెచ్చగొట్టేందుకే సీఏఏ

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకే కేంద్రం పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌరపట్టిక, జాతీయ జనాభాపట్టికను తీసుకొచ్చిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి 23 వరకు సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

# లారెన్స్ సోదరుడిపై జూనియర్ ఆర్టిస్ట్ ఫిర్యాదు

- విచారణ జరిపిస్తామన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ సుల్తాన్‌బజార్:** నటుడు, నృత్య దర్శకుడు లారెన్స్ సోదరుడు వినోద్ తనను వేధిస్తున్నాడని, వరంగల్‌కు చెందిన జూనియర్ ఆర్టిస్ట్ దివ్య ఫిర్యాదుచేశారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను కలిసిన ఆమె.. వినోద్ తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని చెప్పారు. పోలీసు అధికారి అండతో తనను జైలుకు కూడా పంపించారని, తనకు ప్రాణభయం ఉన్నందున రక్షణ కల్పించాలని కోరారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని బాధిత మహిళకు కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ భరోసా ఇచ్చారు.

# పే అండ్ అకౌంట్స్ ఆడిటర్ గోపీనాథ్ అరెస్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ పే అండ్ అకౌంట్స్ విభాగం ఆడిటర్ గోపీనాథ్‌ను ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్టుచేశారు. బకాయి జీతం బిల్లులు తయారుచేసేందుకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నుంచి రూ.5 వేలు లంచం డిమాండ్‌చేసిన కేసులో రెండో నిందితుడు గోపీనాథ్. గతనెల 24న నమోదైన ఈ కేసులో ఇప్పటికే ఏ1 నిందితుడు తోట రామారావును ఈ నెల 7న ఏసీబీ అధికారులు అరెస్టుచేశారు. కేసు దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు తాజాగా గోపీనాథ్‌ను అరెస్టుచేసి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు.

# అమ్మకానికి రాజీవ్ స్వగృహ

- విధివిధానాల ఖరారుకు కార్యదర్శుల కమిటీ ఏర్పాటు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- కార్పొరేషన్‌ను ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేసేందుకు చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాజీవ్ స్వగృహ ఆస్తులను యథాతథంగా విక్రయించేందుకు ప్రభుత్వం కార్యదర్శుల కమిటీని నియమించింది. 80శాతం నిర్మాణాలు పూర్తయిన రంగారెడ్డి జిల్లా బండ్లగూడ, పోచారంలోని ఫ్లాట్లతోపాటు రాజీవ్ స్వగృహకు చెందిన ఇతర ఆస్తుల అమ్మకాలకు సంబంధించిన విధివిధానాలను కమిటీ ఖరారుచేస్తుంది. గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అర్విందకుమార్ సభ్యులుగా ఉన్నారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకొన్న నిర్ణయం మేరకు కార్యదర్శుల కమిటీని నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

### ఉమ్మడి రాష్ట్రంలో తాకట్టు


గతంలో వాటా సొమ్ము చెల్లించినవారితోపాటు ఇతరులు ఎవరైనా ఈ ఇండ్లను కొనుగోలు చేసుకోవచ్చునని జీవోలో పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రాజీవ్ స్వగృహ ఇండ్లను నిర్మించేందుకు రాజీవ్‌స్వగృహ కార్పొరేషన్ ఏర్పాటయ్యింది. అప్పట్లో రూ.8,504 కోట్ల అంచనాతో 32 ప్రాజెక్టులు చేపట్టారు. ఇందులో తెలంగాణ ప్రాంతంలో రూ.6,301 కోట్లతో 20 ప్రాజెక్టులు మొదలయ్యాయి. వీటి కోసం ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంలోని 784 ఎకరాల భూమిని తాకట్టు పెట్టి, రూ.1000 కోట్ల రుణం తీసుకొన్నది. ఆ తర్వాత కార్పొరేషన్ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడంతో 2011లోనే ఇండ్ల నిర్మాణం నిలిపివేశారు. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం రుణాలు తీర్చకపోవడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే రూ.1071.99 కోట్లు చెల్లించి, తనాఖా పెట్టిన భూములను విడిపించింది. తాజాగా ఈ ఫ్లాట్లను యథాతథంగా విక్రయించి, నిధులు సమకూర్చడం ద్వారా కార్పొరేషన్‌ను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొన్ని ఇండ్లను ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయిస్తామని గతంలో హామీ ఇచ్చినప్పటికీ, మధ్య తరగతి సొంతింటి కలను తీర్చేందుకు వాటిని అందరికీ అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలను దృష్టిలో పెట్టుకొని రాజీవ్ స్వగృహ ఆస్తుల ధరలను ఖరారు చేయనున్నారు. నిబంధనల ప్రకారం పారదర్శకంగా అమ్మకం ప్రక్రియను చేపట్టనున్నారు. కమిటీ పూర్తి విధివిధానాలను ఖరారు చేయనున్నది.



# 'నిమిషం'పై పిల్

- ఇంటర్ విద్యార్థులు ఈ నిబంధనతో ఇబ్బంది పడుతున్నారన్న పిటిషనర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి నిరాకరిస్తూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల ఇంటర్మీడియట్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఏడాదిపాటు చదివి, సన్నద్ధమైన విద్యార్థులు నిమిషం నిబంధన కారణంగా పరీక్షకు హాజరుకాలేకపోతున్నారని, ఎంతో ఆందోళనకు గురవుతున్నారని పిటిషనర్ రాపోలు భాస్కర్ పేర్కొన్నారు. ఆలస్యం పేరుతో విద్యార్థులను పరీక్షలకు అనుమతించకపోవడం రాజ్యాంగ విరుద్ధమేనని వివరించారు. ఈ నిబంధనను తొలగించి, ఆలస్యం కారణంగా పరీక్షలు రాయలేకపోయినవారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించేలా ఆదేశాలివ్వాలని హైకోర్టుకు విజ్ఞప్తిచేశారు. నిమిషం ఆలస్యం కారణంగా ఎందరు పరీక్షలు రాయలేకపోయారనే వివరాలు సమర్పించేలా ఆదేశాలివ్వాలని కోరారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు.. విచారణను బుధవారానికి వాయిదావేసింది.



# హైకోర్టుకు హాజీపూర్ కేసు

- ఉరి ఖరారుపై రిఫర్ ట్రయల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హాజీపూర్ వరుస హత్యల కేసు హైకోర్టుకు చేరింది. ఈ కేసులో దోషిగాతేలిన శ్రీనివాస్‌రెడ్డికి నల్లగొండ మొదటి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి న్యాయస్థానం గత నెలలో మరణశిక్ష విధించింది. ఉరిశిక్షను ధ్రువీకరించాలని కోరుతూ కేసు ప్రొసీడింగ్స్‌ను రిఫర్ ట్రయల్ నిబంధన కింద హైకోర్టుకు నల్లగొండ కోర్టు సిఫారసు చేసింది. మంగళవారం రిఫర్ ట్రయల్ చేపట్టిన చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం.. దోషి శ్రీనివాస్‌రెడ్డి, పోలీసులకు నోటీసులు జారీచేసింది. ఇరువర్గాల వివరణ సమర్పించాలని ఆదేశించింది. తనకు ఉరిశిక్ష విధించడాన్ని సవాల్ చేస్తూ దోషి శ్రీనివాస్‌రెడ్డి హైకోర్టులో అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు.

### ఏమిటీ రిఫర్ ట్రయల్?

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ)-1973లోని సెక్షన్ 366 ప్రకారం ఏదైనా తీవ్ర నేరానికి సంబంధించి దిగువ కోర్టు ఉరిశిక్ష విధించినపక్షంలో ఆ ఉరిశిక్షను హైకోర్టు ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఈ మేరకు దిగువ కోర్టు జారీచేసిన ప్రొసీడింగ్స్‌ను హైకోర్టుకు సమర్పించాలి. దిగువ కోర్టు విధించిన ఉరిశిక్షను హైకోర్టు ధ్రువీకరించే వరకు ఉరిశిక్షను అమలుచేయడానికి వీలుండదు. మరోవైపు దిగువ కోర్టు తీర్పుపై హైకోర్టులో అప్పీల్ చేసుకొనే అవకాశం కూడా దోషులకు ఉంటుంది.

బుధవారం
11•3•2020
కరీంనగర్


# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




## సంతాన యోగం!

- యోగాతో వీర్యకణాల వృద్ధి
- సీసీఎంబీ, ఎయిమ్స్ సంయుక్త పరిశోధనలో వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ తార్నాక:**

పిల్లలు పుట్టడం లేదని బాధపడుతున్నారా? మూడువారాల పాటు యోగా చేసి చూడండి. ఫలితం దక్కవచ్చు. పురుషుల్లో వీర్యకణాల వృద్ధికి యోగా తోడ్పడుతుందని హైదరాబాద్ సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ), ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనల్లో వెల్లడయ్యింది. సంతానోత్పత్తి కణాలు తక్కువగా ఉన్న పురుషులతో 21 రోజులపాటు రోజుకు గంట చొప్పున సంప్రదాయ యోగావిధానంలోని ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయించడం వల్ల వారిలో వీర్యకణాల నాణ్యత పెరిగినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. సంతానలేమితో బాధపడే పురుషులు ఆధునిక వైద్యవిధానంతోపాటు యోగా పద్ధతులు అనుసరించడం వల్ల ఫలితం

మిగతా 4వ పేజీలో



ఎల్‌ఎండీ జలాశయం నుంచి దిగువకు 6,100 క్యూసెక్కుల నీటి ప్రవాహంతో ఉన్న కాకతీయ కాల్వ. ( ఇన్‌సెట్) పచ్చదనం పరుచుకున్న కాల్వకింది పొలాలు

కాళేశ్వరం.. కథలు
Success of Telangana

# కాలువంతా ప్రాణహితమే

## 146 రోజులుగా ఆ కొస నుంచి ఈ కొస దాకా పారుతున్న కాకతీయ కాల్వ

### చరిత్రలో తొలిసారి ఎస్సారెస్పీ పూర్తి ఆయకట్టుకు నీరు

### గోదావరి నీటితో నిండిన 2,138 చెరువులు

### పద్నాలుగు జిల్లాలో పండుతున్న సిరుల పంటలు

ఎగువన గోదావరి ఎడారిగా మారినా ఎస్సారెస్పీ ఆయకట్టులో సిరుల పంట పండుతున్నది. సర్కారు తుమ్మలతో ఆనవాళ్లు కోల్పోయిన కాకతీయ కాల్వల్లో ప్రాణహిత పరవళ్లు తొక్కుతున్నది. టెయిల్, హెడ్ అనే తేడాలేకుండా ప్రాజెక్టు మొదటి తూమునుంచి చివరి ఎకరా వరకు ప్రాణధారలు పారుతున్నాయి. వరద నీటికోసం దశాబ్దాలపాటు ఎదురుచూపులకు అలవాటుపడిన ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దశను కాళేశ్వరం మార్చివేస్తున్నది. ప్రాజెక్టు చరిత్రలోనే కనీవినీ ఎరుగని రికార్డులు నమోదుచేస్తూ ఆయకట్టు రైతుల్లో వెలుగులు నింపుతున్నది. మీ పాదాల చెంతకు కాళేశ్వరం జలాలను తెచ్చి కష్టాలను దూరంచేస్తానన్న సీఎం కేసీఆర్ మాటలను నిజంచేసి చూపుతున్నది. 4

### 6 రికార్డులు

1. గత 35 ఏండ్లలో ఎల్‌ఎండీ దిగువన కాకతీయ కాల్వలో తొలిసారి 6,100 క్యూసెక్కుల నీరు
2. దిగువ మానేరు ప్రారంభమైన 1985 తర్వాత మొదటిసారి దిగువకు 52 టీఎంసీల విడుదల
3. అక్టోబర్ 13 నుంచి సుమారు 146 రోజులపాటు కాకతీయ కాల్వకు నిరవధికంగా నీటి సరఫరా
4. ఎస్సారెస్పీ స్టేజ్-2 పరిధిలోని 767 చెరువులు నిండటం ఎస్సారెస్పీ చరిత్రలోనే తొలిసారి
5. స్టేజ్-2లోని ఆయకట్టుకు 24 టీఎంసీల నీరు పారడం ఇదే మొదటిసారి
6. ఎస్సారెస్పీ చరిత్రలో స్టేజ్-1 కింద 9,68,640 ఎకరాలు యాసంగిలో సాగవడం తొలిసారి

# మన బంధం పటిష్ఠం

## అమెరికా, భారత్ మైత్రి ప్రపంచానికి మేలు

- హైదరాబాద్‌లో కాన్సులేట్ భవనం రాష్ట్రానికి గర్వకారణం
- టాపింగ్ ఔట్‌లో మంత్రి కేటీఆర్
- గొప్పగా తెలంగాణ ప్రభుత్వ విధానాలు
- భారత్‌లో అమెరికా రాయబారి జస్టర్ ప్రశంస
- నానక్‌రాంగూడలో నిర్మాణంలో ఉన్న కాన్సులేట్ పరిశీలన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

యూఎస్ కాన్సులేట్ భవనం హైదరాబాద్‌లో ఏర్పాటుకావడం రాష్ట్రానికే గర్వకారణమని ఐటీ శాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. ఈ నిర్మాణం భారత్, అమెరికా మధ్య ఉన్న పటిష్ఠ బంధానికి అద్దంపట్టేలా నిలుస్తున్నదని పేర్కొన్నారు. హైదరాబాద్ నానక్‌రాంగూడలో నిర్మిస్తున్న అమెరికా కాన్సులేట్ భవనాన్ని భారత్‌లో అమెరికా రాయబారి కెన్నత్ జస్టర్‌తో కలిసి మంత్రి కేటీఆర్ మంగళవారం సందర్శించారు. టాపింగ్ ఔట్ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్.. ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన ప్రజాస్వామ్యం గల అమెరికా, అతిపెద్ద ప్రజాస్వామ్యం గల భారత్ మంచి సంబంధాలు కలిగి ఉండటం ప్రపంచానికి మంచి చేస్తుందని

మిగతా 7వ పేజీలో



నానక్‌రాంగూడలో నిర్మిస్తున్న అమెరికా కాన్సులేట్ నూతన భవనం టాపింగ్ ఔట్ కార్యక్రమంలో అమెరికా రాయబారి కెన్నత్ జస్టర్, మంత్రి కే తారకరామారావు

## నేటినుంచి బడ్జెట్‌పై చర్చ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం నుంచి శాసనసభ, శాసనమండలిలో 2020-2021 వార్షిక బడ్జెట్‌పై చర్చ ప్రారంభం కానున్నది. ఉదయం 10 గంటలకు మొదట ప్రశ్నోత్తరాల (క్వశ్చన్ అవర్) కార్యక్రమం ఉంటుంది. అనంతరం బడ్జెట్‌పై చర్చను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రారంభిస్తారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు తీర్మానాన్ని బలపరుస్తారు. మండలిలో చర్చను పురాణం సతీశ్ ప్రారంభిస్తారు. గంగాధర్‌గౌడ్ బలపరుస్తారు.



## సింధియా గుడ్‌బై

- కాంగ్రెస్‌ను వీడిన మధ్యప్రదేశ్ నేత
- మోదీ, అమిత్ షాతో భేటీ
- నేడు బీజేపీలో చేరే అవకాశం
- సింధియాను బహిష్కరించిన కాంగ్రెస్
- 22 మంది సింధియా అనుకూల ఎమ్మెల్యేలు రాజీనామా
- స్పీకర్ ఆమోదిస్తే ఎంపీ సర్కారు పతనం

5

## శబరిమలకు రాకండి

- కరోనా నేపథ్యంలో ఆలయబోర్డు సూచన
- కేరళలో నెలాఖరు వరకు స్కూళ్లు, సినిమా హాళ్లు బంద్

5

## 16 నుంచి ఒంటిపూటబడి

- యథావిధిగా మధ్యాహ్న భోజనపథకం
- ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు
- జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం

7

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 30.00 | రిటైల్ లైవ్ | 75.00 |
| డ్రెస్డ్ | 52.00 | స్కిన్‌లెస్ | 86.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 295.00 | రంగారెడ్డి | 295.00 |
| మెదక్ | 295.00 | కరీంనగర్ | 298.00 |
| వరంగల్ | 298.00 | డజన్ ధర | 54.00 |




Authorised Dealers - Karimnagar: Bharadwaj Hero, Ph: 7799766341. Devesh Hero, Ph: 7799766346. Ramagundam: Siddi Shri Vinayaka Hero, Ph: 9817009247. Mancherial: Balaji Hero, Ph: 7799766326. Adilabad: Chandra Hero, Ph: 7799766397.

Authorised Service Centres - Jagityal: Ravi Teja Motors, Ph: 98666 24312, 96039 67071. Siddipet: Master Motors, Ph: 99088 02229, 96521 12282. Sircilla: Arif Motors, Ph: 91337 86757. Metpalli: Harihar Enterprises, Ph: 9441873338, 8523803388. Korutla: Shri Rama Motors, Ph: 08725-254666, 99899 07676. Peddapalli: Shri Sai Maruti Motors, Ph: 98662 06602, 95020 73443. Nirmal: Sai Chandra Motors, Ph: 08734-242984 / 85209 12777. Kaghaznagar: Manish Motors, Ph: 9848849975. Bellampalli: R.K. Enterprises, Ph: 9849 302384.

Authorised Representative Dealers: Bhainsa: Tirumala Enterprises, Ph: 9440349120. Utnoor: Shri Chandra Motors, Ph: 9959876486. Ichoda: Ichoda Motors, Ph: 9440757883. Asifabad: Shivani Motors, Ph: 9440010306. Bodh: Mahalakshmi Motors, Ph: 9440037842. Manda: Manda Motors, Ph: 9701494879. Mandamarri: Jagadamba Motors, Ph: 9440922683. Tandur: Shri Vigneshwara Motors, Ph: 9440443676. Chennur: Karthikeya Motors, Ph: 9985589955. Lakshettipet: Shri Srinivasa Motors, Ph: 9246234143. Banswada: Shri Srinivasa Motors, Ph: 9705675700. Yellareddy: Shiva Sai Motors, Ph: 9440288498. Ramayampet: Shiva Motors, Ph: 9912475028. Dharpalli: Venkateshwara Motors, Ph: 9493244488. Lingampeta: Vigneshwar Motors, Ph: 9553465555. Dichpally: Narasimha Motors, Ph: 9966550026. Machareddy: Balaji Motors, Ph: 9494624242. Bikaner: Ganesh Motors, Ph: 9441134175. Choppadandi: Shri Sai Motors, Ph: 9848793898. Huzurabad: Rahul Motors, Ph: 9849169794. Sultanabad: Shri Sai Surya Motors, Ph: 9849473568. Jammikunta: Pavan Motors, Ph: 9246826995. Humnabad: Sahiti Motors, Ph: 9866260441. Yellareddypet: United Motors, Ph: 9951406077. Vemulawada: Siri Motors, Ph: 9000857772. Bejjanki: Narmada Motors, Ph: 9440825483. Mulkanoor: Sampath Motors, Ph: 7032826995. Manthani: Shivasankar Automobiles, Ph: 8074655686. Rayekal: Harika Motors, Ph: 9000188393. Gollapalli: Shri Amrutha Motor, Ph: 9989151651. Dharmaram: Shri Dhanya Motors, Ph: 9642020222. Dharmapuri: R R Motors, Ph: 9849004221. Armoor: Venkateshwara Motors, Ph: 9848522331. Bichkunda: Shri Lakshmi Motors, Ph: 9491740244. Bhingal: Shri Lakshmi Narasimha Motors, Ph: 9848258736. Kamarapalli: Harihara Motors, Ph: 9948555525. Nandipet: Shri Lakshmi Motors, Ph: 9963149399. Huzurabad: Rahul Motors, Ph: 9849169794. Jammikunta: Pavan Motors, Ph: 9246826995. Gangadhar: R K Motors, Ph: 9394551432.

నిండుగా పారుతున్న కాకతీయ కాలువ



# కాలువంతా ప్రాణహితమే

## శ్రీరాంసాగర్ ఆయకట్టులో కాళేశ్వరం సిరులు • 50 ఏండ్ల తర్వాత సాగులోకి ఎస్సారెస్పీ పూర్తి ఆయకట్టు

- తొలిసారిగా ఎల్ఎండీ నుంచి దిగువకు 52 టీఎంసీల జలాలు
- కాకతీయ కాలువ పొడవునా కళకళ లాడుతున్న పొలాలు



కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్‌నగర్‌లో కాకతీయ కాలువ నీటితో ఏపుగా పెరిగిన మక్కజొన్న పంట

**హైదరాబాద్/కరీంనగర్, నల్లగొండ ప్రధాన ప్రతినిధులు, నమస్తే తెలంగాణ:**

ఎగువన ఎండుతున్న గోదారితో ఎస్సారెస్పీ నిండి చివరి ఆయకట్టుకు నీరొస్తుందా!! అనే యాభైఏండ్ల ఎదురుచూపుకు తెరపడింది.. సర్కారు తుమ్మతో ఆనవాళ్లు కోల్పోయిన కాకతీయ కాలువల్లో కాళేశ్వరం ద్వారా ప్రాణహిత పరవళ్లు తొక్కుతున్నది. టెయిల్, హెడ్ అనే తేడా లేకుండా ప్రాజెక్టు మొదటి తూము నుంచి చివరి ఎకరా వరకు ప్రాణధారలు పారుతున్నాయి. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు కాళేశ్వరం అభయం ఇస్తున్నది. ఎస్సారెస్పీ చరిత్రలోనే తొలిసారిగా స్టేజి-2 చివరి ఆయకట్టుకు కూడా నీరందిస్తున్నది. 1970 జూలై 24న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రారంభమైంది. ప్రాజెక్టు స్టేజి-1 కింద పూర్వ నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో 9,68,640 ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఇందులో 0 నుంచి 146 కిలోమీటర్ వరకు (ఎల్ఎండీ ఎగువన) 4,62,920 ఎకరాలు, 146 నుంచి 284 కిలోమీటర్ (౦దిగువన) 5,05,720 ఎకరాలు ఉన్నది. స్టేజి- 2 కింద 284 నుంచి 346 కిలోమీటర్ వరకు 3,97,949 ఎకరాలు, 767 చెరువుల కింద 59,622 ఎకరాలు కలిపి మొత్తం 4,57,571 ఎకరాలు ఆయకట్టు ఉన్నది. స్టేజి 1,2 కలిపి మొత్తం 14.26 లక్షలకుపైగా ఆయకట్టు ఉండగా.. ప్రాజెక్టుచరిత్రలో యాసంగిలో ఏనాడూ నాలుగైదు లక్షల ఎకరాలకు మంచి సాగయింది లేదు. కానీ, ప్రస్తుతం పరిస్థితి మారింది. కాకతీయ కాలువలో ప్రవహిస్తున్న ప్రాణహిత జలాల ద్వారా 346 కిలోమీటర్ల పరిధిలో ప్రతిఎకరాకూ నీరందుతున్నది. కాళేశ్వరం జలాలను ఎస్సారార్ నుంచి ఎల్ఎండీకిపంపి అక్కడి నుంచి కాకతీయకెనాల్ ద్వారా పూర్తిఆయకట్టుకు అందిస్తున్నారు.

### దూరదృష్టితో కాలువకు మరమ్మతులు

ఒకవైపు కాళేశ్వరం పనులను పరుగులు పెట్టిస్తూనే.. శ్రీరాంసాగర్ స్టేజి-2 వరకు ప్రాణహిత నీటిని తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ముం దునుంచే చర్యలుచేపట్టింది. వాస్తవానికి కాకతీయకాలువ గరిష్ఠ ప్రవాహం 8,500 క్యూసెక్కులు. కానీ సమైక్యరాష్ట్రంలో 4వేల క్యూసెక్కులకు మించి ఎప్పుడూ నీటిని వదలిపెట్టలేదు. కాలువ మరమ్మతు, ఇతర విషయాలపై నాటి ప్రభుత్వాలు దృష్టిసారించకపోవడంతో కట్టలు ఎక్కడికక్కడే తెగిపోయి నీటి సరఫరాకు ఇబ్బంది కలిగేది. దీంతో కొన్నిసీజన్లలో నీళ్లు ఉన్నా.. విడిచిపెట్టలేని పరిస్థితి ఉండటంతో స్టేజి-1 వరకే ఎస్సారెస్పీ నీళ్లు పరిమితమయ్యేవి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో కాకతీయకాలువలో గరిష్ఠ ప్రవాహం మేరకు నీటిని విడుదలచేసేందుకు ఆదేశాలు జారీచేసి.. ఒక కమిటీ కూడా వేశారు. ఇరవైరోజులపాటు కాలువలను సందర్శించిన కమిటీ చేపట్టాల్సిన ఆధునికీకరణ పనులపై నివేదిక ఇచ్చింది. ఆ మేర కు ప్రభుత్వం రూ.వేయికోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టింది. ఎల్ఎండీ ఎగువన 146 కి.మీ. వరకు రూ.వంద కోట్లతో.. ఎల్ఎండీ దిగువన స్టేజీ-2లో రూ.774 కోట్లతో కాలువ ఆధునీకరణ పను లు చేపట్టారు. ప్రస్తుతం కాకతీయకాలువలో రికార్డు స్థా యిలో 6,100 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతున్నది.

> **టెయిల్ టు హెడ్**
>
> 2018లో నీటి కొరత ఉన్న సమయంలో శ్రీరాంసాగర్ మొదటిదశ ఆయకట్టుకు నీరందించేందుకు పాటించిన టెయిల్‌ను హెడ్ పద్ధతినే ఇప్పుడు రెండోదశ ఆయకట్టు పరిధిలోని చెరువులను నింపేందుకు అమలుచేస్తున్నారు.


### నిండుగా చెరువులు

ఎస్సారెస్పీ స్టేజీ-1 కింద 0-284 కి.మీ. వరకు మొ త్తం 1,645 చెరువులు ఉం డగా 1371 చెరువులు పూ ర్తిగా.. మిగిలిన 271 చెరువులు సగానికి నిండాయి. అలాగే స్టేజీ-2 కింద 284 నుంచి 346 కి.మీ. పరిధిలో 767 చెరువులు ఉండగా అన్ని చెరువులను నిండాయి. 346 కిలోమీటర్ తర్వాత 69, 70, 71 డీబీఎంల ద్వారా సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని 14 మండలాల్లో కొన్నివందల చెరువులు పూర్తిగా నిండాయి.

> **ఆయకట్టు జిల్లాలు**
>
> స్టేజీ-1 కింద నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, మహబూబాబాద్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు.. స్టేజీ-2 కింద వరంగల్‌రూరల్, జనగాం, మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో ఆయకట్టు విస్తరించి ఉన్నది.

### 42 టీఎంసీలు కాళేశ్వరజలాలే

2019-20లో ఎస్సారెస్పీలోకి ఆలస్యంగా వరదవచ్చింది. కాకతీయ కాల్వ ద్వారా ఎల్ఎండీకి ఎనిమిది టీఎంసీలు మాత్రమే వచ్చాయి. పరివాహకప్రాంతంలో కురిసిన వర్షాల ద్వారా11.058 టీఎంసీలు రాగా, అంతకు ముందు 3.496 టీఎంసీల నిల్వ ఉన్నది. కానీ, ఎల్ఎండీ ద్వారా దిగువ ఆయకట్టుతోపాటు చెరువులు నింపడానికి వాడిన నీటి పరిమాణం 52.106 టీఎంసీలు. దీంతోపాటు, ఇప్పటికీ ఎల్ఎండీలో 10.509 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. అంటే మొత్తం 65 టీఎంసీల్లో ఏకంగా 41.593 టీఎంసీలను కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఎత్తిపోసి.. శ్రీరాజరాజేశ్వర జలాశయం ద్వారా ఎల్ఎండీకి తరలించినవే. కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి రావడంతోనే సాధ్యమైంది.




### ఇకపై రెండు పంటలు

కాళేశ్వరం ప్రాజెక్టు గతేడాది జూన్ 21న సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభమైంది. భారీ మోటర్లు, కొత్తగా నిర్మించిన శ్రీరాజరాజేశ్వర జలాశయంలో పూర్తిస్థాయి నీటినిల్వ నింపడంలో సాంకేతిక ప్రొటోకాల్ అమలుచేయాల్సి ఉన్నందున ఆలస్యం కావడం.. అంతకుముందు ఎస్సారెస్పీ, ఎల్ఎండీల్లో నీటినిల్వలు లేకపోవడం.. తదితర కారణాలతో 2019-20 వానాకాలం సాగు నీటిని అందించడం సాధ్యం కాలేదు. ఇప్పుడు అన్నిరకాలుగా కాళేశ్వరం సిద్ధం కావడంతో శ్రీరాంసాగర్‌ను ఎల్ఎండీ ఎగువ వరకే పరిమితంచేసి.. దిగువన ఆయకట్టుకు అభయం ఇచ్చినట్టయింది. గతేడాది అక్టోబర్ 13 నుంచి ఇప్పటిదాకా యాసంగి సాగుకు నీరందుతూనే ఉన్నది. వచ్చే ఏడాది శ్రీరాంసాగర్ పరిధి ఆయకట్టులో రెండు పంటలకూ పుష్కలమైన నీరు అందనున్నది. ఇప్పటికే ఎల్లంపల్లి, ఎల్ఎండీల్లో పదిటీఎంసీలకు పైగా నీటినిల్వలు ఉండగా.. శ్రీరాజరాజేశ్వర జలాశయంలో 25 టీఎంసీలు, ఎస్సారెస్పీలో 46 టీఎంసీల వరకు ఉన్నాయి. దీంతో రానున్న వానాకాలం సాగుకు నిర్ణీత సమయంలోనే నీరందించే వీలున్నది.



కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామం

## నీటికోసం జైలుకెళ్లిన హిమ్మత్‌నగర్ రైతులు

కాకతీయ కెనాల్ నుంచి వచ్చే డీబీఎం-6 ఉపకాలువ చివరి ఆయకట్టు గ్రామం కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్‌నగర్. ఈ గ్రామంలో 1,852 ఎకరాల ఆయకట్టు ఉండగా.. గతంలో మూడునాలుగొందల ఎకరాలకు మించి నీళ్లు పారలేదు. 2007లో పంటలు ఎండుతుంటే.. హిమ్మత్‌నగర్‌తోపాటు, పక్కనే ఉన్న నర్సింహులపల్లె, అచ్చంపల్లి, శ్రీరాములపల్లి గ్రామాల రైతులు ముప్పైమంది ప్రధాన కాలువ తూమును పైకెత్తేందుకు వెళ్లారు. అక్కడ అధికారులు అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది. 22 మంది రైతులపై అధికారులు కేసులు పెట్టడంతో మూడురోజులు జైలులో ఉండాల్సి వచ్చింది. నేడు కాకతీయ కాలువ నిండుగా పారడంతో హిమ్మత్‌సాగర్ రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం 900 ఎకరాల్లో మక్క, 600 ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. మిగిలిన భూమిలో వివిధ పంటలు సాగుచేయడంతో ఎటుచూసినా పచ్చదనమే కనిపిస్తున్నది. గ్రామంలోని చింతలచెరువు, లకోటకుంట కూడా కాళేశ్వరం జలాలతో నిండిపోయాయి.



### ఆగం చేసిండ్రు

**ఎండిపోతున్న** పొలాలను చూసి తట్టుకోలేక.. తూములను ఎత్తుదామని ప్రధానకాలువ వద్దకు వెళ్లాం. నీళ్లు ఇవ్వకపోగా అధికారులతో గొడవపడ్డారని నాతోపాటు 22 మంది రైతులపై అప్పట్లో కేసులు పెట్టి జైలుకు పంపించారు. ఇప్పటికీ మాకు గుర్తుకొస్తే బాధ అనిపిస్తుంది. కానీ, ఇప్పుడు ఢోకాలేదు. గ్రామాలు పచ్చబడటమేకాదు, నీళ్లు సమృద్ధిగా రావడంతో చుట్టుపక్కల ఉన్న గ్రామాల మధ్య కూడా గొడవలు లేకుండాపోయాయి. ఎవరి పొలాల్లో వాళ్లం పనిచేసుకుంటున్నాం. ఇన్ని నీళ్లు ఇస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

**-రామస్వామి, రైతు, హిమ్మత్‌నగర్**

## ఊరు చుట్టూ నీళ్ల సందడి

**సూర్యాపేట** జిల్లాలో అత్యంత నీటిఎద్దడి ఉన్న గ్రామాల్లో ఆత్మకూర్ (ఎస్) మండలంలోని గట్టికల్లు ఒకటి. ఊరి పైనంగనే ఉన్న పెద్దచెరువులో వానాకాలంల మోకాల్లోతు నీళ్లు తప్పితే.. ఈ మధ్య ఎన్నడూ నిండింది లేదు. మంచినీటికి కూడా గ్రామస్థులు ఇబ్బంది పడేవారు. వ్యవసాయబోర్ల వద్దే తాగునీరు తెచ్చుకునేవారు. గ్రామంలో కొద్దిమందికే.. అది కూడా వానాకాలంలోనే వడ్లు పండేది. కానీ ఎస్సారెస్పీ ఫేజ్-2 డీబీఎం71పైన ఉన్న 22 ఎ ల్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా నీటితో ఈ జనవరిలో గట్టికల్లు చెరువు నిండింది. అలుగు దుంకడంతో రైతులందరూ యాసంగి నాట్లుపెట్టారు. ఇప్పుడు ఈ ఊరి చుట్టూ ఎటుపోయినా గోదావరి జలాలతోని వరిపొలాలు పచ్చగా కనువిందు చేస్తున్నా యి. నీళ్ల కోసం గోస తీశిన మాకు ఊరిసుట్టూ నీళ్లు చేరి కండ్ల సంబురం జేస్తున్నయ్. పొలాలను జూస్తుంటె బురదల పొర్లాడాలనిపిస్తుందని చెప్తున్నరు గట్టికల్లులోని వృద్ధరైతులు.



గట్టికల్లు చెరువు



### బోరు దంచి కొడ్తుంది

**నాకు** గుర్తుండగా మా గ్రామంలోని గట్టికల్లు చెరువు రెండుసార్లు అలుగుబోసింది. అప్పట్లో వాన నీళ్లకు అలుగులు పోస్తే.. ఈసారి మాత్రం ఎండకాలానికి ముందు జనవరి నెలలోనే అలుగుదుంకింది. ఎండకాలంలో సక్కగా దూపకూడా తీర్చలేనంత సన్నధారలు పోసే బోరు ఇప్పుడు దండిగ దంచి కొడ్తున్నది. 15 కండేలా బావి నీళ్లతో నిండుగా ఉన్నది. ఇంతకుముందు యాసంగిలో 20 గుంటలు నాటు బెట్టేది. ఇప్పుడు ఆరెకరాలు పెట్టిన.

**- బండగొర్ల యల్లయ్య, గట్టికల్లు, ఆత్మకూర్(ఎస్) మండలం, సూర్యాపేట జిల్లా**

## చివరి చెరువు కింద యాసంగి జోరు



సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని రావిచెరువు ఆయకట్టు కింద యాసంగి వరిపంట

**సూర్యాపేట** జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని రావిచెరువు ఎస్సారెస్పీ ఫేజ్-2 పరిధిలో 71 డీబీఎం మీద ఉన్న చివరి చెరువు. గతంలో ఒక్కసారికూడా గోదావరి నీటితో ఇది నిండలేదు. భక్తళాపురం వద్ద అండర్ టన్నెల్ పనులను పూర్తిచేయించడంతోపాటు, కాళేశ్వరం ద్వారా ఎస్సారెస్పీ ఫేజ్-2 కాల్వల్లో నీళ్లు పారించి సూర్యాపేట జిల్లాలోని వేలచెరువులు నింపారు. చివరిచెరువు అయిన మాచారం గ్రామంలోని రావిచెరువు సైతం జనవరిలో నిండి అలుగుపోసింది. 140ఎకరాల శిఖం కలిగిన ఈ చెరువు కింద ప్రత్యక్షంగా 200 ఎకరాలు, పరోక్షంగా మరో వెయ్యిఎకరాల భూమి సాగవుతున్నది. ఈ చెరువు కింద బోర్లతో మొన్నటివరకు ఒకట్రెండు ఎకరాలు పండించుకున్న రైతులు.. ఈ యాసంగిలో తమకున్న మొత్తం భూమిని సాగుచేస్తున్నరు. 200 కిలోమీటర్ల దూరం నుంచి గోదావరి నీళ్లు మా ఊరికొస్తయని ఎన్నడూ అనుకోలేదని.. శెర్వు నిండి యాసంగి గూడ పంటలు పండుతయని కలల గూడ ఊహించలేదని మాచారం రైతులు సంబురపడుతున్నరు.

### బాధలు పోయినయ్



**నా** వయస్సు 65 ఏండ్లు. చిన్నతనంలో వాననీళ్లతో మా ఊర్లోని రావి చెరువు నిండి రెండుపంటలు పండినయి. తర్వాత చెరువు నిండింది లేదు.. రెండు పంటలు పండింది లేదు. ఈసారి మాత్రం కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎస్సారెస్పీ ఫేజ్-2 కాల్వల ద్వారా గోదారి జలాలతో రావిచెరువును నింపడంతోపాటు, అలుగు దుంకినయి. చెరువు కింద ఉన్న 20 గుంటల్లో 8 గుంటలు అచ్చుగట్టి యాసంగి నాటువేసిన. వానాకాలం నాటికి మిగిలిన పన్నెండు గుంటలు కూడా సాగదోలి నాటుపెడతా. ఇన్నేండ్ల సంది వొడ్లు కొనుక్కుని బియ్యం పట్టిచ్చుకునేవాడిని. ఈసారి నుంచి తిండికి నాలుగ్గింజలు నా భూమిలోనే పండుతయి.

**- శిత్రం పుల్లయ్య, మాచారం, పెన్‌పహాడ్ మండలం, సూర్యాపేట జిల్లా**

### లోకం పోకడ




### ముహూర్తం

సూర్యోదయం: 6.26 గంటలకు

సూర్యాస్తమయం: 6.19 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం విదియ మధ్యాహ్నం 3.34 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: హస్త రాత్రి 7.00 వరకు, తదుపరి చిత్త, అమృతఘడియలు: మధ్యాహ్నం 1.46 నుంచి మధ్యాహ్నం 3.09 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.23 నుంచి మధ్యాహ్నం 1.52 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.59 నుంచి మధ్యాహ్నం 12.47 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.22 నుంచి 3.09 వరకు, వర్జ్యం: ఉదయం 5.22 నుంచి 6.46 వరకు, తిరిగి అర్ధరాత్రి 2.06 నుంచి తె.జా. 3.31 (తెల్లవారితే గురువారం) వరకు.

## చారిత్రక కట్టడాల పునరుద్ధరణ గర్వకారణం

### ప్రేమావతి, తారామతి టూంబ్స్‌ను ప్రారంభించిన అమెరికా రాయబారి

**మెహిదీపట్నం:** రాష్ట్రంలోని చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, సుందరీకరణ పనుల్లో తాము కూడా భాగస్వాములవడం గర్వంగా ఉన్నదని అమెరికా రాయబారి కెన్నెత్ ఐ జస్టర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన అమెరికా ఆర్థిక సహకారంతో, ఆగాఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన గోల్కొండ టూంబ్స్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇటీవల మరమ్మత్తులు పూర్తయిన ప్రేమావతి, తారామతి టూంబ్స్‌ను ప్రారంభించారు. వివిధ దేశాల్లో చారిత్రక, వారసత్వ సంపదను పరిరక్షించడానికి అమెరికా ఆర్థికసాయం అందజేస్తున్నదని ఆయన చెప్పారు. గోల్కొండ టూంబ్స్‌లో మ్యాపింగ్, డా క్యుమెంటేషన్ కోసం 2014లో లక్షా ఒక వెయ్యి డాలర్ల నిధులు ఇచ్చామన్నారు. ఇప్పుడు ప్రేమావతి, తారామతి టూంబ్స్ పునరుద్ధరణ, సుందరీకరణకు లక్షా మూ డువేల డాలర్లను కేటాయించామన్నారు.

### ఏరో స్ట్రక్చర్స్‌ను సందర్శించిన కెన్నెత్ జస్టర్

ఆదిబట్లలోని టాటా లాఖిడ్ మార్టిన్ ఏరో స్ట్రక్చర్స్ ఫెసిలిటీ సెంటర్‌ను కెన్నెత్ జస్టర్ సందర్శించారు. పదేండ్ల క్రితం ఏర్పాటైన ఈ సెంటర్ అమెరికా, భారత్ మధ్య రక్షణ రంగ సహకారానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో అమెరికా కాన్సుల్ జనరల్ (హైదరాబాద్) జోయెల్ రీఫ్ మన్, పురాతత్వశాఖ ఈడీ నారాయణ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని ప్రేమావతి, తారామతి టూంబ్స్‌ను మంగళవారం పరిశీలిస్తున్న భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ ఐ జస్టర్

## సంతాన యోగం!

మూడోపేజీ తరువాయి...

ఉంటుందని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్‌మిశ్రా పేర్కొన్నారు. యోగా ప్రక్రియను అనుసరించినవారి వీర్యకణాల్లో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గి, వీర్యకణాల చురుకుదనంలో వేగం పెరిగింది. దీంతో వీర్యకణాలు ఫలదీకరణ సామర్థ్యాన్ని పెంపొందించుకొన్నట్టు నిర్ధారించారు. యోగా చేయడం వల్ల డీఎన్ఏ కదలికలను విశ్లేషించే మిథైలేషన్ అనే రసాయనిక మార్పు యథాస్థితికి చేరినట్టు గుర్తించారు. వాతావరణ పరిస్థితులు, ఆహార అలవాట్లు, చెడు అలవాట్లు, క్రమపద్ధతిలేని జీవనవిధానం వల్ల జన్యుక్రమం విపరీతమార్పులకు లోనై, సంతానోత్పత్తి కణాలకు హాని కలుగుతుందని రాకేశ్‌మిశ్రా చెప్పారు.

## మైనార్టీలో కమల్‌నాథ్ సర్కార్!

మధ్యప్రదేశ్‌లో మొత్తం 230 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ఇటీవల ఇద్దరు ఎమ్మెల్యేలు మరణించారు. దీంతో అసెంబ్లీలో ప్రస్తుతం 228 మంది శాసనసభ్యులు ఉన్నారు. 22 మంది ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ ఆమోదిస్తే సభ్యుల సంఖ్య 206కు పడిపోతుంది. అప్పుడు కనీస మెజార్టీ 104కు తగ్గుతుంది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు 114, బీజేపీకి 107 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. రాజీనామాలకు ఆమోద ముద్ర పడితే కాంగ్రెస్ బలం 92కు తగ్గుతుంది. దీంతో ప్రభుత్వం మైనార్టీలో పడిపోతుంది. బీజేపీ విశ్వాస పరీక్ష కోరితే.. కమల్‌నాథ్ ప్రభుత్వం బలాన్ని నిరూపించుకోలేక పోవచ్చు.

## నెల క్రితమే 'పద్మ'వ్యూహం

**బెంగళూరు:** మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడానికి దాదాపు నెల రోజుల క్రితమే వ్యూహం ఖరారైనట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం కర్ణాటక రాజధాని బెంగళూరు సమీపాన ఒక రిసార్ట్‌లో బసచేసిన 19 మంది రెబెల్ ఎమ్మెల్యేలు మధ్యప్రదేశ్‌లో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు కనీసం రెండు వారాలు ఇక్కడే ఉంటారని బీజేపీ వర్గాల కథనం. కాంగ్రెస్ అసమ్మతి ఎమ్మెల్యేలకు ఆతిథ్యం ఇచ్చే విషయమై చర్చించేందుకు రావాలని 15-20 రోజుల క్రితమే బీజేపీ అధిష్ఠానం కర్ణాటక పార్టీ నేత ఒకరిని ఆదేశించినట్లు తెలుస్తున్నది. 19 మంది రెబెల్ ఎమ్మెల్యేల్లో ఒక స్వతంత్ర ఎమ్మెల్యేతో పాటు 8మంది వారం క్రితమే బెంగళూరుకు వచ్చారు. వారిలో స్వతంత్ర ఎమ్మెల్యే, ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే వెనుకకు వెళ్లారు. సోమవారం బెంగళూరుకు వచ్చిన 13మంది ఎమ్మెల్యేలు.. ఇప్పటికే బసచేసిన ఆరుగురితో జత కలిశారు. బీజేపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు వీరికి వసతి బాధ్యతలను ఆ పార్టీ కర్ణాటక సీనియర్ నేత చూస్తున్నారు.



మధ్యప్రదేశ్ గవర్నర్, స్పీకర్‌కు తాము పంపిన రాజీనామా లేఖలను చూపుతున్న బెంగళూరు రిసార్టులో ఉన్న సింధియా వర్గ ఎమ్మెల్యేలు

## తండ్రి జయంతి రోజున నానమ్మ కోరిక నెరవేర్చాడు

### జ్యోతిరాదిత్య మేనత్త యశోధర రాజె వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌ను వీడటంపై ఆయన మేనత్త, బీజేపీ నేత యశోధర రాజె స్పందించారు. 'కుటుంబ సభ్యులందరూ ఒకేదగ్గర ఉండాలన్నది విజయరాజె సింధియా(రాజమాత) ఆఖరి కోరిక. తండ్రి మాధవ్‌రావు సింధియా జయంతి రోజే (మార్చి 10) జ్యోతిరాదిత్య తన నానమ్మ కోరికను నెరవేర్చాడు. జాతి ప్రయోజనాల కోసం రాజమాత రక్తం ఓ నిర్ణయాన్ని తీసుకున్నది. ఇప్పుడు దూరాలన్నీ చెదిరిపోయాయి' అని యశోధర రాజె తెలిపారు. కాంగ్రెస్ కోసం జ్యోతిరాదిత్య అంకితభావంతో పనిచేసేవాడని, అయితే ఆయన ఆత్మ గౌరవాన్ని గాయపరిచే విధంగా ఏదో జరిగి ఉంటుందని ఆమె వ్యాఖ్యానించారు.





# సింధియా గుడ్‌బై

### మధ్యప్రదేశ్‌లో తారస్థాయికి రాజకీయ సంక్షోభం

- కాంగ్రెస్‌ను వీడిన జ్యోతిరాదిత్య సింధియా
- కొత్త ప్రయాణం ప్రారంభిస్తానంటూ సోనియాగాంధీకి లేఖ
- మోదీ, అమిత్ షాతో భేటీ.. నేడు బీజేపీలో చేరే అవకాశం
- సింధియాను బహిష్కరించిన కాంగ్రెస్
- 22 మంది సింధియా అనుకూల ఎమ్మెల్యేలు సైతం రాజీనామా

**న్యూఢిల్లీ, మార్చి 10:** మధ్యప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభం మరింత ముదిరింది. కమల్‌నాథ్ ప్రభుత్వ మనుగడకే ప్రశ్నార్థకంగామారింది. సీనియర్ నేత జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్ పార్టీని వీడారు. రాజీనామా లేఖను కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి మంగళవారం పంపించారు. తన తండ్రి మాధవరావు సింధియా జయంతిరోజే ఆయన కాంగ్రెస్‌ను వీడారు. పార్టీలో 18 ఏండ్ల ప్రస్థానానికి ముగింపు పలికారు. ఆయన బుధవారం బీజేపీలో చేరనున్నట్టు సమాచారం. మరోవైపు బెంగళూరులోని రిసార్ట్‌లో ఉన్న సింధియా అనుకూల వర్గం ఎమ్మెల్యేలు 22 మంది సైతం తమ శాసన సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ఇందులో ఆరుగురు మంత్రులు ఉన్నారు. దీంతో కమల్‌నాథ్ ప్రభుత్వం మైనార్టీలో పడింది. ఇదే అదునుగా అధికారాన్ని హస్తగతం చేసుకునే దిశగా బీజేపీ అడుగులు వేస్తున్నది. అయితే తాము బలాన్ని నిరూపించుకుంటామని సీఎం కమల్‌నాథ్ ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం సీఎల్పీ సమావేశానికి నలుగురు స్వతంత్రులు సహా సుమారు 100 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారని మంత్రి ఒకరు తెలిపారు. తాజా పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో క్యాంపు రాజకీయానికి తెరలేచింది. తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్, బీజేపీ రహస్య ప్రాంతానికి తరలించేందుకు సిద్ధమయ్యాయి.

### సింధియా బహిష్కరణ

సింధియాను బుజ్జగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. రాజస్థాన్ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ నేతృత్వంలోని బృందాన్ని ఆయన వద్దకు పంపింది. అయితే వారిని కలిసేందుకు సింధియా ఒప్పుకోలేదు. ఆ తర్వాత కొంతసేపటికే సింధియాను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు పార్టీ ప్రకటించింది.

### గంటకుపైగా చర్చలు

సింధియా మంగళవారం ఉదయం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నివాసానికి వెళ్లారు. అనంతరం వారిద్దరూ ప్రధాని మోదీ నివాసానికి చేరుకున్నారు. ముగ్గురూ గంటకుపైగా చర్చలు జరిపారు. సింధియా బీజేపీలో చేరితే ఏయే బాధ్యతలు అప్పగిస్తారో మోదీ, షా వివరించినట్టు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఆయనకు రాజ్యసభ స్థానంతోపాటు కేంద్ర మంత్రి పదవి కట్టబెట్టవచ్చని వెల్లడించాయి. దీంతో సింధియా బీజేపీలో చేరడం దాదాపు ఖాయమైంది. అనంతరం కాంగ్రెస్‌కి సింధియా రాజీనామా చేశారు. ఆ తర్వాత బీజేపీ అధ్యక్షుడు నడ్డాతో భేటీ అయ్యారు. మరోవైపు మధ్యప్రదేశ్‌కు చెందిన బీఎస్పీ ఎమ్మెల్యే సంజీవ్ సింగ్ కుశ్వానా, ఎస్పీ ఎమ్మెల్యే రాజేశ్ శుక్లా బీజేపీ సీనియర్‌నేత, మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. హోలీ సందర్భంగా వారు గౌరవసూచకంగా మాత్రమే తనను కలిశారని, ఇందులో రాజకీయమేమీ లేదని చౌహాన్ తెలిపారు.

### ఏడాది నుంచి అనుకుంటున్నా: సింధియా

పార్టీని ఎందుకు వీడాల్సి వస్తున్నదో సోనియాకు పంపిన రాజీనామా లేఖలో సింధియా వివరించారు. '18 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీకి నిబద్ధతతో సేవలందించా. నేను పార్టీని వీడాలని ఏడాదిగా అనుకుంటున్నా. ప్రజలకు, మధ్యప్రదేశ్‌కు, దేశానికి సేవచేయాలన్నదే నా అభిమతం. కాంగ్రెస్‌లో ఉంటే నా లక్ష్యాలకు అనుగుణంగా నడుచుకోలేనని స్పష్టమైంది. సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించేందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నా. అందుకే పార్టీలో నా ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నా' అని సింధియా పేర్కొన్నారు. ఇన్నాళ్లూ తనకు సహకరించిన సోనియాకి, పార్టీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

### గవర్నర్, స్పీకర్ కీలకం

మధ్యప్రదేశ్‌లో జరుగనున్న తదుపరి పరిణామాల్లో గవర్నర్, స్పీకర్ పాత్ర కీలకం కానున్నారని నిపుణులు చెప్తున్నారు.

- బీజేపీ విన్నపం మేరకు గవర్నర్.. ప్రభుత్వాన్ని విశ్వాస పరీక్ష కోరవచ్చు.
- ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కమల్‌నాథ్ సిఫారసు చేస్తే.. ఆమోదించడం, తిరస్కరించడం గవర్నర్ అభీష్టం.
- 22 మంది ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ తిరస్కరించవచ్చు. ఇదే జరిగితే కర్ణాటక తరహా హైడ్రామా జరగొచ్చు.

### గవర్నర్‌కు రాజీనామా లేఖలు

సింధియా రాజీనామా అనంతరం.. ఆయన వర్గం ఎమ్మెల్యేలు 22 మంది తమ రాజీనామా లేఖలను గవర్నర్ లాల్జీ టాండన్‌కు సమర్పించారు. మరోవైపు సింధియా వర్గానికి చెందిన ఆరుగురు మంత్రులను తొలిగించాలంటూ సీఎం కమల్‌నాథ్ గవర్నర్‌కు లేఖ రాశారు. కాగా, బీజేపీ నేత భూపేంద్ర సింగ్ నేతృత్వంలోని బృందం స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతిని కలిసింది. బెంగళూరులోని 19 మంది ఎమ్మెల్యేల రాజీనామా లేఖలను ఆయనకు అందజేసింది. మిగతా ముగ్గురు నేరుగా అందించారు.

### కమల్‌నాథ్ ముందున్న మార్గాలు..



'సింధియా సంక్షోభం'తో విలవిలలాడుతున్న ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ముందు ఇప్పుడు మూడు దారులు ఉన్నాయని విశ్లేషకులు చెప్తున్నారు.

- అసెంబ్లీని రద్దుచేస్తూ కమల్‌నాథ్ నిర్ణయం తీసుకోవచ్చు. ఈ సిఫారసుకు గవర్నర్ ఆమోదముద్ర వేస్తే మళ్లీ ఎన్నికలకు వెళ్లడం అనివార్యం అవుతుంది.
- 22 మంది ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ ఆమోదిస్తే ప్రభుత్వం మైనార్టీలో పడిపోతుంది. ముందే కమల్‌నాథ్ తన పదవికి రాజీనామా చేసే అవకాశం.
- గవర్నర్ అసెంబ్లీలో బలాన్ని నిరూపించుకోవాలని కోరితే.. కమల్‌నాథ్ విశ్వాస పరీక్షకు వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే.. సింధియా వర్గంలో 22 మంది ఎమ్మెల్యేలు ఉన్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోకపోవచ్చు.



సింధియా పూర్వీకులు బ్రిటిషర్లకు సాయం చేశారు. అలాంటి నీచ భావజాలాన్నే ఇప్పుడు ఆయన అనుసరించారు. స్వప్రయోజనాలు ఆశించి నమ్మక ద్రోహానికి పాల్పడే జయ్‌చంద్, మీర్ జాఫర్లకు త్వరలోనే గుణపాఠం లభిస్తుంది

— అరుణ్ యాదవ్, కాంగ్రెస్ నేత

*1857లో బ్రిటిష్ వారితో జరిగిన పోరాటంలో తమను తాము రక్షించుకోవడానికి సింధియా పూర్వీకులు రాణీ లక్ష్మీబాయిని విడిచిపెట్టారు.*

*—జీతూ పట్వారీ, మధ్యప్రదేశ్ మంత్రి*



ప్రజల నమ్మకానికి, సిద్ధాంతాలకు సింధియా ద్రోహం చేశారు. దేశం సంక్షోభ పరిస్థితిలో ఉన్నప్పుడు బీజేపీతో చేతులు కలుపడం అంటే ఆ నాయకుడు తన స్వప్రయోజనాలకు, వ్యక్తిగత లక్ష్యాలకు ప్రాధాన్యతనిచ్చినట్టే.

*—అశోక్ గెహ్లాట్, రాజస్థాన్ ముఖ్యమంత్రి*

*గాంధీల ఇంటి పేరుతోనే కాంగ్రెస్ పార్టీ మనుగడ సాగిస్తున్నదని ఇప్పటి వరకు విమర్శిస్తున్నవారు... సింధియా అనే ఇంటి పేరున్న వ్యక్తి కాంగ్రెస్ నుంచి వెళ్లిపోవడం ఆ పార్టీకి పెద్ద దెబ్బ అంటున్నారు. ఇది నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది.*

*– ప్రశాంత్ కిశోర్, రాజకీయ వ్యూహకర్త*



మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని పడగొట్టాలన్న ఆసక్తి బీజేపీకి లేదని మొదటినుంచి చెప్తున్నాం. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు కాంగ్రెస్ అంతర్గత వ్యవహారం. దానిపై నేను ఎలాంటి వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు

*— శివరాజ్ సింగ్ చౌహాన్, ఎంపీ మాజీ సీఎం*

*కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తూ మా తండ్రి తీసుకున్న నిర్ణయం పట్ల గర్వం ఉన్నది. మా కుటుంబానికి ఎలాంటి అధికార దాహం లేదు. అది చరిత్రే చెబుతుంది. మాట ఇచ్చిన ప్రకారం.. భారత దేశంలో, మధ్యప్రదేశ్‌లో గణనీయ మార్పు తీసుకొస్తాం.*

*–జ్యోతిరాదిత్య సింధియా కుమారుడు మహానార్యమాన్*

కీలక నేత జ్యోతిరాదిత్య కాంగ్రెస్‌ను వీడటం నిజంగా దుర్వార్తే. స్వార్థ ప్రయోజనాలు, బీజేపీ చూపిన ప్రలోభాలు ఆయన్ని పార్టీ మారేలా చేశాయి.

—అధిర్ చౌదరి, కాంగ్రెస్ నేత

### సింధియా రాజకుటుంబం..

## బీజేపీ, కాంగ్రెస్‌ల కలబోత



విజయరాజె సింధియా

**స్వాతంత్ర్యానికి** ముందు గ్వాలియర్ సంస్థానాన్ని పాలించిన రాజకుటుంబ వారసుడు జ్యోతిరాదిత్య సింధియా. ఆయన నాయనమ్మ విజయరాజె సింధియా 1957లో కాంగ్రెస్ నుంచి రాజకీయ ఆరంగేట్రం చేశారు. గుణ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించారు. అయితే 1967లో ఆమె జనసంఘ్‌లో (బీజేపీ పూర్వరూపం) చేరారు. 1971లో ఇందిరాగాంధీ హవాను తట్టుకుని జనసంఘ్ తరపున బింద్ నుంచి విజయరాజె, గుణ నుంచి విజయరాజె కుమారుడు మాధవరావ్ సింధియా గెలుపొందారు. అయితే ఎమర్జెన్సీ అనంతరం 1977లో మాధవరావ్ సింధియా తన తల్లిని కాదని కాంగ్రెస్‌లో చేరారు. అదే సమయంలో విజయరాజె కుమార్తెలు వసుంధర రాజె, యశోధర రాజెలు కూడా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1984లో వసుంధర రాజె బీజేపీలో చేరారు. యశోధర రాజె మధ్యప్రదేశ్‌లో బీజేపీ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మాధవ్‌రావ్ సింధియా 2001లో విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన కుమారుడైన జ్యోతిరాదిత్య సింధియా తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ కాంగ్రెస్‌లోనే ఉండిపోయారు.

## దూరమైన సన్నిహితుడు



**కాంగ్రెస్** పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపుపొందిన జ్యోతిరాదిత్య సింధియా పార్టీని వీడటం వెనుక కొన్నాళ్లుగా గూడుకట్టుకున్న అసంతృప్తి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్‌లో జ్యోతిరాదిత్యది 18 ఏండ్ల ప్రస్థానం. తండ్రి మాధవరావు సింధియా మరణించటంతో 2002లో ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. గుణ లోక్‌సభ స్థానంనుంచి పార్లమెంట్‌కు నాలుగుసార్లు ఎన్నికయ్యారు. అయితే, 2017లో రాహుల్ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన తర్వాత.. యువనేతలకు ప్రాధాన్యం కల్పించటంతో జ్యోతిరాదిత్య పేరు ప్రముఖంగా వెలుగులోకొచ్చింది. 2018 మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయంలో జ్యోతిరాదిత్య కీలకపాత్ర పోషించినప్పటికీ.. ఆయనకు సీఎం పదవి లభించలేదు.కనీసం, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవి కూడా దక్కలేదు. పార్టీ అధ్యక్షపదవికి రాహుల్ రాజీనామా చేయటంతో.. పార్టీలో యువనేతలకు ప్రాధాన్యం పోయింది. గత కొన్ని నెలలుగా ప్రయత్నించినప్పటికీ రాహుల్ అపాయింట్‌మెంట్ దొరక్కపోవడం, తాను ఆశించిన రాజ్యసభ సీటుపై పార్టీ ఎలాంటి హామీని ఇవ్వకపోవడంతో జ్యోతిరాదిత్యకు అసంతృప్తి మరింత పెరిగింది. ఈ నేపథ్యంలోనే ఆయన పార్టీని వీడినట్లు తెలుస్తున్నది.



**హోలి.. రంగుల కేళి** హరివిల్లును నేలమీదికి దింపి.. రంగుల్లో తడిపి.. ప్రతి ఒక్కరికీ మధుర జ్ఞాపకాలను మిగిల్చే పండుగ హోలి. మంగళవారం పలు ప్రాంతాల్లో సంబురాలు జరుగగా.. చెన్నైలో ఓ బాలుడు ఇలా రంగుల్లో మునుగుతున్నాడు.



పోలీసులకు బంగారం అప్పగిస్తున్న భరత్, అతుల్ తిలేకర్

## ఆటో డ్రైవర్ల నిజాయితీ

### రూ.7.57 లక్షల బంగారం పోలీసులకు అప్పగింత

**పుణె:** మహారాష్ట్రలోని పుణెలో ఇద్దరు ఆటో డ్రైవర్లు నిజాయితీ చాటుకొన్నారు. ఆదివారం పుణె రైల్వేస్టేషన్ పార్కింగ్ వద్ద ఆటో డ్రైవర్లు అతుల్ తిలేకర్, భరత్ భోసాలే ఒక బ్యాగ్‌ను గమనించారు. అందులో రూ.7.57లక్షల విలువైన బంగారు ఆభరణాలున్నాయి. దీంతో వారు ఆ బ్యాగ్‌ను రైల్వే పోలీసులకు అప్పగించారు. అప్పటికే, దీపక్ అనే వ్యక్తి తన బ్యాగ్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలను కనుక్కున్న తర్వాత ఆ బ్యాగ్‌ను దీపక్‌కు అప్పగించారు.

## సిక్కింలో వారంలో ఐదు పనిదినాలకు చెల్లు

**గ్యాంగ్‌టక్, మార్చి 10:** సిక్కింలో ఉద్యోగుల పనితీరుపై అసంతృప్తితో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం వారంలో ఐదురోజుల పనిదినాల విధానాన్ని రద్దుచేసింది. ఇకపై రెండు, నాలుగో శనివారాలే సెలవురోజులుగా ఉంటాయని స్పష్టంచేసింది. ఈ కొత్త విధానం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నది. గత ఏడాది మేలో అధికారంలోకి వచ్చాక సీఎం ప్రేమ్‌సింగ్ తమంగ్.. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులకు వారంలో ఐదు పనిదినాల విధానాన్ని ప్రారంభించారు. అయితే, ఉద్యోగుల పనితీరుపై సిక్కిం క్రాంతికారి మోర్చా ప్రభుత్వం సంతృప్తిగా లేదని అధికారవర్గాలు వెల్లడించాయి. దీంతో గతేడాది మేలో ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవరించారు. వారంలో పనిదినాలను ఆరుగా మారుస్తూ ఆదేశాలిచ్చారు.

# శబరిమలకు రావొద్దు

- కరోనా నేపథ్యంలో దేవస్థానం బోర్డు సూచన
- కేరళలో మరో ఎనిమిది మందికి వైరస్
- కర్ణాటక, మహారాష్ట్రలోనూ ముగ్గురికి..
- దేశంలో 61కి చేరిన బాధితుల సంఖ్య
- కేరళలో విద్యాసంస్థలు, థియేటర్లు బంద్

**తిరువనంతపురం:** కేరళలో ప్రసిద్ధ శబరిమల పుణ్యక్షేత్రంపైనా కరోనా ప్రభావం పడింది. రాష్ట్రంలో వైరస్ వ్యాప్తి నేపథ్యంలో భక్తులు అయ్యప్ప దర్శనానికి రావొద్దని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) సూచించింది. నెలవారీ పూజల నిమిత్తం శుక్రవారం ఆలయ ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఈ నెల 18న మళ్లీ మూసివేస్తారు. టీబీడీ అధ్యక్షుడు వాసు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో శబరిమల దర్శనానికి రావొద్దని భక్తులకు సూచించారు. ఆలయంలో పూజా కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టంచేశారు. కేరళలో తాజాగా మరో ఎనిమిది కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో బాధితుల సంఖ్య 14కు చేరింది. కరోనా వ్యాప్తి నేపథ్యంలో కేరళ సర్కారు రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు, థియేటర్లను ఈ నెల 31 వరకు మూసివేయాలని ఆదేశించింది. మరోవైపు, కర్ణాటక, పుణేలో ముగ్గురికి చొప్పున వైరస్ సోకినట్లు తేలింది. దీంతో దేశంలో కరోనా బాధితుల సంఖ్య 61కి పెరిగింది. బెంగళూరులో ప్రాథమిక పాఠశాలలకు నిరవధిక సెలవులు ప్రకటించారు. ఇద్దరు కరోనా బాధితులకు చికిత్స కోసం దేశంలో తొలిసారి రెండు యాంటీ హెచ్‌ఐవీ మందులను వినియోగించారు. కాగా, ఇరాన్‌లో చిక్కుకుపోయిన 58 మంది భారతీయులను వాయుసేన విమానం ద్వారా మంగళవారం స్వదేశానికి తీసుకొచ్చారు. ఘజియాబాద్‌లోని ప్రత్యేక కేంద్రంలో వారిని ఉంచారు. ఇరాన్‌లో ఇప్పటివరకు 291 మంది మరణించగా, 8,042 మంది వైరస్ బారినపడ్డారు.

**ఇటలీ దిగ్బంధం..**

వేగంగా విస్తరిస్తున్న కరోనాను కట్టడిచేసేందుకు ఇటలీ ప్రభుత్వం దేశం మొత్తాన్ని దిగ్బంధంలో ఉంచింది.



ఇరాన్ నుంచి ఘజియాబాద్‌కు తీసుకొచ్చిన భారతీయులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మొత్తం 6 కోట్లమంది ప్రజలు ఇంటికే పరిమితం కావాలని సూచించింది. ఏప్రిల్ 3 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. వాటికన్‌లోని ప్రసిద్ధ సెయింట్ పీటర్స్ స్క్వేర్, బసిలికాను ఏప్రిల్ 3 వరకు మూసివేయనున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మంగళవారం తొలిసారి వుహాన్‌లో పర్యటించారు. చైనాలో ఇప్పటివరకు 3.136 మంది మరణించగా, 80,754 మందికి వైరస్ సోకింది. పాకిస్థాన్‌లో కరోనా కేసుల సంఖ్య 18కి పెరిగింది. కరోనా నేపథ్యంలో రెండువారాలపాటు ఇటలీకి విమాన రాకపోకలను రద్దు చేస్తున్నట్లు స్పెయిన్ ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. కరోనాకు సంబంధించి ఎలాంటి పరీక్షలు చేయించుకోలేదని శ్వేతసౌధం ప్రకటించింది.

### సరిహద్దులు మూసివేత

కరోనా వ్యాప్తిని నియంత్రించేందుకు ఈశాన్య రాష్ట్రాలు అంతర్జాతీయ సరిహద్దులను మూసివేస్తున్నాయి. మిజోరం సోమవారమే మయన్మార్, బంగ్లాదేశ్ సరిహద్దులను మూసివేసింది. విదేశీయుల ప్రవేశంపై నిషేధం విధించింది. తాజాగా మణిపూర్ కూడా మయన్మార్‌తో సరిహద్దులను మూసివేసింది. ఇటీవలే సిక్కిం, అరుణాచల్ కూడా విదేశీయుల పర్యటనలపై ఇదేతరహా ఆంక్షలను విధించాయి.

## ఇంటివద్దే 'కరోనా' పరీక్షలు!

**వాషింగ్టన్:** ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో తన వంతు సాయం చేయడానికి 'గేట్స్ ఫౌండేషన్' ముందుకొచ్చింది. ఇంటి వద్దే కరోనా పరీక్షలను చేసుకునే పరికాలను (కిట్) అందజేయడానికి కసరత్తు చేస్తున్నది. ఈ కిట్ ద్వారా ముక్కు నుంచి సేకరించిన నమూనాలను అధికారులకు పంపితే.. పరీక్షల తర్వాత కరోనా సోకిందా? లేదా? అన్న సమాచారాన్ని అధికారులు చేరవేస్తారు.

## చూపులేనివారికి అండగా కండ్లద్దాలు!

**న్యూయార్క్:** చూపులేని వారు కూడా తమ ముందు ఉన్న వ్యక్తులను, వస్తువులను గుర్తుపట్టే కండ్లద్దాలు రానున్నాయి. 'గూగుల్ ఏఐ'(కృత్రిమ మేధ) సంస్థ డచ్‌కు చెందిన ఓ సంస్థతో కలిసి ఈ మేరకు పరిశోధనలు నిర్వహిస్తున్నది. అద్దాలకు అమర్చే అధునాతన కెమెరాల్లాంటి పరికరాలు ముందున్న వ్యక్తులను, వస్తువులను గుర్తించి సమాచారం ఇస్తాయి.

## 'నా కల నెరవేరకముందే చనిపోతానేమో'

**వాషింగ్టన్:** అంగారకుడిపైకి మానవుడిని పంపాలన్న తన స్వప్నం నెరవేరకముందే తాను మరణించొచ్చని ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్ సీఈవో ఎలెన్ మస్క్ అన్నారు. 'మానవుడిని భూస్థిర కక్ష వరకు తీసుకెళ్లడానికే 18 ఏండ్లు పట్టింది. అలాంటిది మార్స్‌పైకి తీసుకెళ్లాలంటే చాలా సమయం పట్టొచ్చు. మా మార్స్ ప్రాజెక్టు వేగాన్ని పెంచాలి. లేకుంటే నా కల నెరవేకముందే నేను చనిపోవచ్చు' అని మస్క్ పేర్కొన్నారు.

## నేడు బీజేపీ రాజ్యసభ అభ్యర్థుల జాబితా!

**న్యూఢిల్లీ:** ఈ నెల 26న 17 రాష్ట్రాల్లోని 55 రాజ్యసభ స్థానాలకు జరుగనున్న ద్వైవార్షిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను బీజేపీ బుధవారం వెల్లడించనున్నదని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన సమావేశమై చర్చించింది. ఈ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా పాల్గొన్నారు.

## ఆఫ్ఘన్ నుంచి వెనక్కి వెళ్తున్న అమెరికా సైన్యం

**కాబూల్:** ఆఫ్ఘనిస్థాన్ నుంచి తమ సైన్యం ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభమైందని అమెరికా అధికారి ఒకరు వెల్లడించారు. గత నెలలో ఆఫ్ఘన్, తాలిబన్లతో కుదిరిన శాంతి ఒప్పందం మేరకు వైదొలుగుతున్నట్లు తెలిపారు. దక్షిణాది రాష్ట్రం హెల్మండ్ రాజధాని లష్కర్ గహ్ బేస్, పశ్చిమ రాష్ట్రం హీరత్‌లోని ఒక బేస్ నుంచి సైనికుల ఉపసంహరణ ప్రారంభమైందని వెల్లడించారు.

## హిందూ మున్నాని కార్యాలయంపై పెట్రోల్ బాంబుతో దాడి

**కోయంబత్తూరు:** కోయంబత్తూరులోని హిందూ మున్నాని కార్యాలయంపై మంగళవారం దుండగులు పెట్రోల్ బాంబుతో దాడికి పాల్పడటంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. హిందూ మున్నాని నాయకుడిపై ఇటీవల దాడికి ప్రతిగా రెండు మసీదులు లక్ష్యంగా కొందరు దాడికి యత్నించిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హిందూ మున్నాని కార్యాలయాన్ని ఉదయం 10 గంటలకు తెరిచిన సిబ్బంది పెట్రోల్‌బాంబు శకలాలను గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. దుండగులను గుర్తించేందుకు పరిసరాల్లోని నిఘా కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మరోవైపు మార్చి 6న మసీదుపై దాడికి యత్నించిన ఘటనలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మార్చి 5న సీఏఏకు మద్దతుగా నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొనివస్తున్న హిందూ మున్నాని జిల్లా కార్యదర్శి మదుక్కరై ఆనంద్‌పై దాడికి ప్రతీకారంగానే ప్రార్థనాలయంపై పెట్రోల్‌బాంబు విసిరినట్టు వారు అంగీకరించారు.

## ఇండోనేషియాకు డచ్ రాజు క్షమాపణ

**ది హేగ్, మార్చి 10:** తమ వలస పాలనలో దారుణమైన అకృత్యాలకు గురైన ఇండోనేషియా ప్రజలకు నెదర్లాండ్స్ రాజు విల్లెం-అలెగ్జాండర్ క్షమాపణలు చెప్పారు. 'ఆనాటి ఘటనల వల్ల ఛిద్రమైన కుటుంబాల్లో నెలకొన్న విషాదం, దుఃఖం నేటికీ కొనసాగుతున్నట్టు నేను గుర్తించాను. దీనికి చింతిస్తున్నా' అని ఆయన తెలిపారు. ఈ విధంగా నాటి వలస పాలకుల తరుపున ఇండోనేషియాకు క్షమాపణలు చెప్పిన మొదటి డచ్ రాజుగా విల్లెం నిలిచారు. ఇండోనేషియాకు 1945లో స్వాతంత్ర్యం వచ్చింది. అంతకు ముందు దాదాపు 350 ఏండ్లపాటు ఆ దేశాన్ని డచ్ రాజులు(నెదర్లాండ్స్ దేశస్థులు) పాలించారు.



ఇది ఘర్‌వాపసీ. మాధవ్‌రావ్ సింధియా కూడా అతని రాజకీయ జీవితాన్ని జనసంఘ్‌తో ప్రారంభించారు. జ్యోతిరాదిత్య సింధియా వివక్షకు గురయ్యాడు. నా మేనల్లుడి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా.


**యశోధర రాజే సింధియా, సీనియర్ బీజేపీ నాయకురాలు**

కాంగ్రెస్ పార్టీకి జ్యోతిరాదిత్య సింధియా రాజీనామా పెద్ద ఎదురుదెబ్బ. అతను పార్టీ నాయకత్వంలో మూలస్తంభం లాంటివాడు. పార్టీ నేతలు సింధియాను పార్టీలో ఉండేట్లు ఒప్పించాల్సింది. అతనిలాగానే చాలామంది కాంగ్రెస్ నేతలు ఒంటరివారై పార్టీని వీడేందుకు చూస్తున్నారు.

**కుల్దీప్ బిష్ణోని, కాంగ్రెస్ సీనియర్ నేత**




**చరిత్రలో నేడు**



**1669**
ఇటలీలోని ఎట్నా అగ్నిపర్వతం పేలుడు. 15 వేల మంది మృతి

**1795**
కుర్దా యుద్ధంలో మొగల్‌లను ఓడించిన మరాఠాలు.





**1935**
అట్టావా ఎల్లింగ్టన్ స్ట్రీట్‌లో బ్యాంక్ ఆఫ్ కెనడా ప్రారంభం.

నేపాల్‌లో గతేడాది అట్టహాసంగా ప్రారంభమైన ప్రధాన మంత్రి ఉపాధి పథకం ఇప్పుడు విమర్శలకు గురవుతున్నది. స్థానిక నిరుద్యోగ యువతకు కనీసం వందరోజుల పాటు పని కల్పించి కనీస వేతనం ఇవ్వాలన్న ఉద్దేశం మంచిదే. కానీ ఆచరణలో యువశక్తిని నిర్మాణాత్మక రంగాల్లో వినియోగించుకోలేక విఫలమైంది. నిధులను అనుత్పాదక రంగాల్లో కుమ్మరించి వృథా చేసే బదులు యువతకు కనీస నైపుణ్యాలు గరపడానికి ఉపయోగించడం మంచిది. ఈ పథకం సమాజం మీద ఎటువంటి ప్రభావం చూపుతున్నదనేది సమీక్షించుకోవడం అవసరం.

**ది హిమాలయన్ టైమ్స్**

బంగ్లాదేశ్‌లో కరోనా వైరస్ వ్యాపించకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రధాని వెల్లడించడం హర్షణీయమే. కానీ ఈ వైరస్‌ను ఎదుర్కొనడానికి దేశం సమాయత్తమై ఉన్నదా అనేది అనుమానంగానే ఉన్నది. దేశంలో ఇప్పటికే ముగ్గురికి కరోనా వైరస్ వ్యాపించింది. బంగ్లాదేశ్‌లో నగరాలు కిక్కిరిసి ఉంటాయనేది తెలిసిందే. దేశంలో వైద్య వసతులు కూడా అంతంతమాత్రం. దవాఖానల్లో తగిన వసతులను వెంటనే ఏర్పాటుచేయాలి. ప్రజలకు కూడా ఆరోగ్య సూత్రాలను బోధించాలి.

**ది డైలీ స్టార్**



# కాంగ్రెస్ దీనావస్థ

మధ్యప్రదేశ్ నాటకీయ పరిణామాలు కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకత్వ బలహీనతను మరోసారి బయటపెట్టాయి. ముఖ్యమంత్రి కమల్‌నాథ్‌తో సరిపడని కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు జ్యోతిరాదిత్య సింధియా తన బలగంతో కాంగ్రెస్ పార్టీని వీడిపోయారు. ఇరువైమందికిపైగా శాసనసభ్యులు ఆయన వెంట వెళ్ళడంతో కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలో పడిపోయింది. రాష్ట్రంలోని రెండువర్గాల మధ్య విభేదాలు ఇంత తీవ్రస్థాయికి చేరుకుంటే, ఇంతకాలం అధిష్ఠానం ఏమి చేస్తున్నదనే ప్రశ్న తలెత్తుతున్నది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో జ్యోతిరాదిత్య కృషి కూడా ఉన్నది. ఆయన కుటుంబం మొదటినుంచి పార్టీ నాయకత్వానికి సన్నిహితమైనది. జ్యోతిరాదిత్య పార్టీని వీడుతారని ఏ మాత్రం ఊహించలేదని మధ్యప్రదేశ్‌లోని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. కమల్‌నాథ్‌కు ముఖ్యమంత్రి పదవి అప్పగించినందువల్ల అధిష్ఠానం తనకు పీసీసీ నాయకత్వమైనా ఇస్తుందని జ్యోతిరాదిత్య ఆశించారు. ఈ కోరిక నెరవేరకపోగా ఆయన అనుయాయులకు కూడా ఏ పదవులూ ఇవ్వలేదు. పార్టీ నిర్ణయాల్లో ఆయనను పూర్తిగా పక్కకుపెట్టారు. తాజాగా రాజ్యసభకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో, తప్పనిసరిగా గెలిచే మొదటి సీటును తనకు కేటాయించకపోవడం ఆయనకు ఆగ్రహం తెప్పించింది. ఏ రాజకీయపక్షంలోనైనా భిన్నవర్గాలుంటాయి. అన్నింటినీ సంబాళిస్తూ పార్టీని నడిపించాలి. కాంగ్రెస్ అధిష్ఠానం కమల్‌నాథ్-దిగ్విజయ్‌సింగ్ కూటమిని ఒప్పించలేనంత బలహీనంగా ఉండటమే జ్యోతిరాదిత్య వంటి నాయకుడిని కోల్పోవడానికి కారణం. గోవా, కర్ణాటక పరిణామాల తర్వాత మధ్యప్రదేశ్ సన్నివేశం కాంగ్రెస్ పార్టీ నాయకత్వ వైఫల్యాన్ని చాటుతున్నది.

జ్యోతిరాదిత్య నిష్క్రమణను గమనిస్తున్న వారికి రాజస్థాన్ రాజకీయాలు గుర్తుకువస్తున్నాయి. రాజస్థాన్‌లో కూడా మధ్యప్రదేశ్‌ను పోలిన పరిస్థితులే ఉన్నాయి. కాంగ్రెస్‌పార్టీ విజయానికి కృషిచేసిన యువనాయకుడు సచిన్‌పైలట్‌కు ముఖ్యమంత్రి పీఠం దక్కలేదు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఏకపక్ష ధోరణిని నియంత్రించలేని నిస్సహాయత కేంద్ర నాయకత్వానిది. సచిన్ పైలట్ అడుగడుగునా అసమ్మతిని వ్యక్తంచేస్తూనే ఉన్నారు. రాజ్యసభకు వజ్రాల వ్యాపారిని పంపాలని ముఖ్యమంత్రి గెహ్లాట్ భావిస్తుంటే సచిన్ పైలట్ అభ్యంతరం చెబుతున్నారు. వ్యాపారులను కాదు, రాజకీయ నాయకులను పంపాలని ఆయన అంటున్నారు. పైలట్ కనుక ఓ ఇరువైమంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ నుంచి బయటకు తెస్తే ప్రభుత్వం కూలిపోతుందనీ, అధిష్ఠానం ఇంత క్రియాశూన్యంగా ఉండకూడదనీ పార్టీ వర్గాలే అంటున్నాయి. కాంగ్రెస్‌లో పాత నాయకులకు, యువనేతలకు మధ్య ఏ మాత్రం పొసగడం లేదు. రాహుల్‌గాంధీ సీనియర్ నాయకులతో వ్యవహరించడానికి అవసరమైన పరిణతిని, స్థాయిని సంతరించుకోలేకపోయారు. రెండువర్గాల మధ్య సమన్వయం సాధించడానికి బదులు యువ నాయకులతో తనకంటూ ఒకవర్గాన్ని తయా రుచేసుకున్నారు. పాత నాయకులు ప్రాబల్యాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించడం సహజం. అన్ని రాష్ర్టాలలో ఈ రెండువర్గాల మధ్య విభజన రేఖ ఏర్పడి విభేదాలు తీవ్రమయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని పటిష్ఠ వ్యూహంతో నడిపించడంలో విఫలమైన రాహుల్‌గాంధీ, ఫలితాలు వెలువడిన తర్వాత అధ్యక్ష స్థానం నుంచి తప్పుకున్నారు. సోనియాగాంధీకి ఎంతటి చతురత ఉన్నా అనారోగ్యం మూలంగా పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నారు. నెహ్రూ కుటుంబం సమర్థనాయకత్వాన్ని అందించడమూ లేదు, సమష్టి నాయకత్వాన్ని రూపుదిద్దుకోనివ్వడమూ లేదు. సమస్యకు అదే మూలకారణం.

**పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకోవడంలో కాంగ్రెస్ నాయకత్వం వెనుకబడింది. దేశానికి ప్రత్యామ్నాయాన్ని అందించడంలోనూ ఘోరంగా విఫలమైంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రత్నామ్నాయంగా కాంగ్రెస్ నిలువలేదనేది ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా ముందుగానే పసిగట్టారు. ప్రధాని మోదీకి పోటీగా రాహుల్‌గాంధీని దేశ ప్రజల ముందుంచడం ఆత్మహత్యా సదృశమని కూడా స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ కూడా బీజేపీయేతర పక్షాలను కూడగట్టడంలో విఫలమయ్యారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి సమర్థవంతమైన నాయకత్వం లేదు.**

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకోవడంలో కాంగ్రెస్ నాయకత్వం వెనుకబడింది. దేశానికి ప్రత్యామ్నాయాన్ని అందించడంలోనూ ఘోరంగా విఫలమైంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రత్నామ్నాయంగా కాంగ్రెస్ నిలువలేదనేది ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా ముందుగానే పసిగట్టారు. ప్రధాని మోదీకి పోటీగా రాహుల్‌గాంధీని దేశ ప్రజల ముందుంచడం ఆత్మహత్యా సదృశమని కూడా స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ కూడా బీజేపీయేతర పక్షాలను కూడగట్టడంలో విఫలమయ్యారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి సమర్థవంతమైన నాయకత్వం లేదు. కాంగ్రెస్ పార్టీ కూడా వివిధ రాష్ర్టాలలో చెప్పుకోదగినంత బలంగా లేదు. ఈ నేపథ్యంలో జాతీయ రాజకీయాలలో ప్రత్యామ్నాయం కోసం కాంగ్రెస్ పార్టీ కేంద్రంగా ఆలోచించే పరిస్థితి లేదు. రెండు జాతీయ పార్టీల మధ్యనే పోటీ అనే భావన ఇక ఉండదు. కేంద్రీకృత, సమాఖ్యశక్తుల మధ్య రాజకీయ మోహరింపు జరుగవచ్చు. దేశవ్యాప్తంగా ప్రాంతీయశక్తులు బలంగా నిలదొక్కుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో బీజేపీయేతర, కాంగ్రెసేతర పక్షాలన్నీ ఒక సైద్ధాంతిక భూమికను ఏర్పాటుచేసుకొని ఏకతాటిపైకి రావడం అవసరం. ఇందుకు ఎన్నికల సందర్భమే ఉండాలని లేదు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే చిత్తశుద్ధి ఉంటే చాలు. కేసీఆర్ సూచనల మేరకు ఒకే వేదిక మీదకు వచ్చి చర్చించుకుంటే ఆయా పక్షాలకే కాదు, దేశానికీ శ్రేయస్కరం.

# సంక్షేమపథంలో వికాస రథం


**అసమానతలు ప్రజల అవసరాలు తీర్చటంలో అవరోధంగా ఉంటాయి. ఆర్థికాభివృద్ధి మాత్రమే ప్రజల అవసరాలను తీర్చదు. అభివృద్ధి అనేది సమాజంలోని భిన్నవర్గాలకు అందుబాటులోకి వచ్చి వారి సామాజిక జీవన అవసరాలను తీర్చినప్పుడే దానికి సార్థకత చేకూరుతుంది. సమాజంలోని అభివృద్ధి ఫలాలను అందుకోలేని వారిని ప్రత్యేక ఆర్థిక, సంక్షేమ పథకాలతో ఆదుకోవాలి. అందుకోసం రాజకీయాలకు అతీతంగా కులం, మతం, లింగ భేదం లేకుండా అందరికీ అండగా నిలువాలి. ఈ క్రమంలో తెలంగాణలో అభివృద్ధి సంక్షేమ పథకాలలో తలమానికం లాంటి 'ఆసరా' పథకాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి.**

రాష్ట్ర అవతరణ తర్వాత స్వీయపాలన ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలిస్తున్నది. సమాజంలోని అన్నివర్గాల అభ్యున్నతికి సంక్షేమ, అభివృద్ధి పథకాలతో కృషిచేస్తున్నది. తెలంగాణలోని వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్ కులాలు, తరగతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. సమస్త వర్గాల ప్రజా జీవనాన్ని సంతోషమయం చేయటంలో సామాజిక భద్రత కూడా ప్రధానమైనది. అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో నగరీకరణ పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడులతో వచ్చేవారికి రక్షణ, భద్రత విషయంలో భరోసా కల్పించాలి. అందుకోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2.75 లక్షల సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ప్రతి ఒక్కరికీ భద్రత కల్పిస్తున్నది. శాంతిభద్రతలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నది. సీసీ కెమెరాల వినియోగంలో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో నిలువటం గమనార్హం. అలాగే మహిళల రక్షణ కోసం 'షీ' టీమ్స్ ఏర్పాటుచేసి మహిళలు, బాలికలకు తోడుగా నిలుస్తున్నది.

అసమానతలు ప్రజల అవసరాలు తీర్చటంలో అవరోధంగా ఉంటాయి. ఆర్థికాభివృద్ధి మాత్రమే ప్రజల అవసరాలను తీర్చదు. అభివృద్ధి అనేది సమాజంలోని భిన్నవర్గాలకు అందుబాటులోకి వచ్చి వారి సామాజిక జీవన అవసరాలను తీర్చినప్పుడే దానికి సార్థకత చేకూరుతుంది. సమాజంలోని అభివృద్ధి ఫలాలను అందుకోలేని వారిని ప్రత్యేక ఆర్థిక, సంక్షేమ పథకాలతో ఆదుకోవాలి. అందుకోసం రాజకీయాలకు అతీతంగా కులం, మతం, లింగ భేదం లేకుండా అందరికీ అండగా నిలువాలి. ఈ క్రమంలో తెలంగాణలో అభివృద్ధి సంక్షేమ పథకాలలో తలమానికం లాంటి 'ఆసరా' పథకాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

ఆసరా పథకం తెలంగాణలో పేదలు, వృద్ధులకు పెద్ద అండ. ముఖ్యంగా నిరాదరణకు గురవుతున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, కల్లుగీత పనివారలు, బీడీ కార్మికులు తదితర వర్గాలకు ఆసరా పింఛన్లు ఆత్మగౌరవాన్ని పెంచటమే కాదు, వారి జీవనకాలాన్నీ, ప్రమాణాలను పెంచాయి. రాష్ట్రవ్యాప్తంగా వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నవారు 12,49,135 ఉండగా, వితంతు పింఛన్లు పొందుతున్న వారు 14,34,556 ఉన్నారు. అలాగే వికలాంగులు, నేత పనివారు, కల్లు గీత పనివారలు, హెచ్ఐవీ రోగులు, బోదకాలు బాధితులు, ఒంటరి మహిళలు ఇలా అన్ని వర్గాల వారు కలిసి 38,63,775 మంది ఉన్నారంటే ప్రజలకు ఏ రీతిన సాయం అందుతున్నదో ఊహించవచ్చు. వికలాంగులకు 1500 రూపాయలు ఉన్న పింఛన్‌ను 3,016కు పెంచటంతో పాటు, మిగతా అందరికీ పింఛన్ సొమ్ము మొత్తాన్ని వెయ్యి రూపాయల నుంచి 2016కు పెంచింది. అందుకనే ఇవాళ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రతి కుటుంబం పెద్ద కొడుకుగా భావిస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి వృద్ధాప్య పింఛన్ వయో పరిమితిని 65 ఏండ్ల నుంచి 57 ఏండ్లకు తగ్గించి తెలంగాణ ప్రభుత్వం పెద్ద మనసు చాటుకున్నది.

తెలంగాణ సంక్షేమ పథకాలలో కళ్యాణలక్ష్మి పథకం ప్రత్యేకమైనది. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని 18 ఏండ్లు నిండిన యువతుల వివాహం కోసం లక్షా 116 రూపాయలను అందజేస్తున్నది. 2019-20 సంవత్సరంలోనే ఎస్సీలలో 21,603 మంది, ఎస్టీలలో 10,917 మంది కళ్యాణలక్ష్మి సాయం అందుకున్నా రు. ఇందుకోసం ఎస్సీలకు 213.03 కోట్లు, ఎస్టీల కోసం 105.83 కోట్లు వెచ్చించింది. ఇదేకాలంలో బీసీలు 63,281 మంది, ఈబీసీలు 7,881 మంది లబ్ధి పొందారు. దీనికోసం ప్రభుత్వం 615.54 కోట్లు, 75.56 కోట్లు అందించింది. అలాగే మైనారిటీ వర్గాల కోసం షాదీ ముబారక్ పథకంలో భాగంగా 26,914 మందికి 263.07 కోట్లు వెచ్చించింది.




సమాజంలో అత్యధికంగా ఉన్న వెనుకబడిన తరగతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలను చేపట్టింది. ఈ వర్గానికి చెందిన పేదలు ఉపాధి పొందడానికి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. ఈ ఆర్థిక మద్దతు పథకాల ద్వారా 201 8-19 సంవత్సరంలో 14,067 మందికి లబ్ధి చేకూరింది. ఆధునిక లాండ్రీ యూనిట్ల ఏర్పాటు కు ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించింది. అధునాతన హెయిర్ స్టైల్స్, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ ఇప్పించింది. మైనార్టీల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడం కోసం ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం వివిధ పథకాలను అమలుపరుస్తున్నది. ఇందుకోసం 2019-20 లో 1,072 మంది లబ్ధిదారుల కోసం 8.33 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించింది.

**2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో ఎస్టీలు 31.78 లక్షల మంది (9.08 శాతం) ఉన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 12,292 ఆవాస ప్రాంతాల్లో ఉన్న ఎస్టీల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక వినూత్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నది. గిరిజనుల అభ్యున్నతి కోసం వ్యవసాయం, చేపల పెంపకం, పశు గణాభివృద్ధి, స్వయం ఉపాధిరంగాల్లో ప్రత్యేక పథకాలను రూపొందించింది. 2014 నుంచి ఇప్పటిదాకా ఎస్టీలకు సబ్సిడీల రూపంలో 425.58 కోట్లను వెచ్చించింది. 50,205 కుటుంబాలు లబ్ధి పొందాయి. డ్రైవర్ కమ్ ఓనర్ పథకం కింద ఎస్టీ యువతకు వాహనాల కొనుగోలుకు ఆర్థిక సాయం అందించింది. ఇప్పటిదాకా 19.82 కోట్లతో 446 వాహనాలను అందించింది.**

డ్రైవర్ ఎంపవర్‌మెంట్ స్కీం కింద వాహనాల కొనుగోలుకు భారీ ఆర్థిక సహాయాన్ని అందించింది. మారుతీ మోటార్స్, ఉబర్ సంస్థల భాగస్వామ్యంతో యువతకు ఉపాధి కల్పన జరుగుతున్నది. వాహన కొనుగోళ్లలో 60 శాతం ఆర్థిక సహాయం లేదా 5 లక్షల సబ్సిడీని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అందిస్తున్నది. యాభై వేలు లబ్ధిదారుడు చెల్లించుకోవాల్సి ఉంటుంది. మిగతా మొత్తానికి బ్యాంకు రుణం ఉంటుంది. 2018-19లో 409 వాహనాల పంపిణీ జరిగింది. ఇం దుకు సబ్సిడీగా 18.17 కోట్ల కేటాయింపు జరిగింది.

తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలను ప్రత్యేక అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నది. తెలంగాణ జనాభాలో 15.4 శాతంగా ఉన్న ఎస్సీల సంక్షేమం కోసం షెడ్యూల్డ్ క్యాస్ట్స్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఎస్‌సీడీడీ)ను ఏర్పాటు చేసి వారి అభ్యున్నతి కోసం కృషిచేస్తున్నది. తెలంగాణ అవతరణ తర్వాత భూమి లేని నిరుపేదలైన ఎస్సీల కోసం 678.11 కోట్లు వెచ్చించి 15,448 ఎకరాల భూమిని 6,104 కుటుంబాలకు పంచిపెట్టింది. అలాగే 2014 నుంచి సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ స్కీం కింద 1,20,383 మందికి , స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం కింద 5,040 మందికి ఆర్థిక సహకారాన్ని అందించింది. మొత్తంగా ఇప్పటిదాకా 1362.47 కోట్ల రూపాయలను ఎస్సీ వర్గాల అభ్యున్నతికి వెచ్చించింది.

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో ఎస్టీలు 31.78 లక్షల మంది (9.08 శాతం) ఉన్నారు. తెలంగాణవ్యాప్తంగా 12,292 ఆవాస ప్రాంతాల్లో ఉన్న ఎస్టీల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక వినూత్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నది. గిరిజనుల అభ్యున్నతి కోసం వ్యవసాయం, చేపల పెంపకం, పశు గణాభివృద్ధి, స్వయం ఉపాధి రంగాల్లో ప్రత్యేక పథకాలను రూపొందించింది. 2014 నుంచి ఇప్పటిదాకా ఎస్టీలకు సబ్సిడీల రూపంలో 425.58 కోట్లను వెచ్చించింది. 50,205 కుటుంబాలు లబ్ధి పొందాయి. డ్రైవర్ కమ్ ఓనర్ పథకం కింద ఎస్టీ యువతకు వాహనాల కొనుగోలు కు ఆర్థిక సాయం అందించింది. ఇప్పటిదాకా 19.82 కోట్లతో 446 వాహనాలను అందించింది.

ఒక్కోసారి పేదల అవసరాలు కొన్ని ఏ పథకం కిందికి రావు. ఇటువంటి అవసరాలు తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిధులను ఏర్పాటు చేసింది. విద్యా,క్రీడలు మొదలైన రంగాలలో అత్యవసరంగా తోడ్పాటు అందించడానికి ఈ నిధులను అందిస్తున్నది.

**(తెలంగాణ సామాజిక, ఆర్థిక సర్వే నివేదిక ఆధారంగా...)**

# 'పౌర' భావనకు అగ్నిపరీక్ష

**జాతీయం**



**కర్నె ప్రభాకర్**

గంగా జమునా తెహజీబ్ హైదరాబాద్ సంస్కృతి అని సీఎం కేసీఆర్ ఎన్నోసార్లు అన్న మాట. నిజమే.. హైదరాబాద్ ఒక మినీ ఇండియా. వందల ఏండ్ల నుంచి అనేక ప్రాంతాల దేశాల ప్రజలు మన హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఏ దేశం, రాష్ట్రం వారైనా, ఏ మతం, వర్గం వారైనా అక్కున చేర్చుకొని ఆదరించే గొప్ప ప్రేమాభిమానాల నగరం మనది. భూగోళమంతా వెతికినా సకల మతాలకు, సంస్కృతులకు సమ్మేళనమైన ఇటువంటి అద్భుత నగరం మనకు కనిపించదు. ఒక్క హైదరాబాద్ మాత్రమే కాదు, తెలంగాణ మొత్తంలో మనుషుల మధ్య ఇవే ప్రేమాభిమానాలుం టయి. కానీ ఇప్పుడు ఈ ఘనమైన చరిత్రను చెరిపేస్తూ మతాన్ని మనుషులకు అంటగట్టి, తద్వారా జరిగే రావణకాష్టంలో చలిమంటలు కాపుకుందామని కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి కుట్రలను మనుషులే దేశమని నమ్మే వారంతా వాటిని ఎదుర్కోక, వ్యతిరేకించక తప్పని పరిస్థితి వచ్చింది. 21వ శతాబ్దంలో ప్రపంచ దేశాలన్నీ అభివృద్ధి కోసం వ్యూహాలు రచించి ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతుంటే, మన దేశంలో మాత్రం మతఘర్షణలతో దేశాన్ని అపఖ్యాతి పాలు చేస్తున్నారు. మనుషుల నడుమ గోడలు కట్టి దేశానికున్న లౌకిక ఆత్మను హననం చేయాలని చూస్తున్నారు. ఇది గర్హనీయమే కాదు అనాగరికం.

76 ఏండ్ల గణతంత్ర దేశంలో, 130 కోట్ల జనాభాకు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాలనే అగ్నిపరీక్ష పెట్టింది. అసలు మోదీ ప్రభుత్వం చేస్తున్నదేమిటో, జ్ఞానశీలురంతా ఒకసారి ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. ప్రజల నడుమ చిచ్చుపెట్టే వారి ప్రయత్నాన్ని ప్రజలకు వివరించి, విజ్ఞానవంతులను చేయాల్సిన అవసరం ఏర్పడింది. అసోంలో మోదీ ప్రభుత్వం ప్రకటించిన 19 లక్షల మంది స్థానికేతురుల బూచి, ఇప్పుడు దేశ కాషాయికరణకు ఆయుధంగా మారుతుందని దేశప్రజలు భయపడుతున్నరు. ఆ భయమే ఇప్పుడు సీఏఏ, ఎన్నార్సీ నిరసనల ఆకృతిగా మారింది. ఇదే రేపు దేశ ఔన్నత్యానికి మచ్చగా మారితే, ప్రపంచవ్యాప్తంగా ఈ దేశానికున్న ప్రత్యేక గుర్తింపునకు సీఏఏ, ఎన్నార్సీ మచ్చగా మారే ప్రమాదం ఉన్నది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించే చొరబాటుదారుల పట్ల అప్రమత్తత అవసరమే. కానీ అక్రమ చొరబాటుదారుల పేరుతో 130 కోట్ల మంది ప్రజలను పరీక్షకు నిలబెట్టడం భావ్యం కాదు. ఇప్పటికే ఆధార్‌కార్డ్ పౌరసత్వ గుర్తింపునకు దోహదపడుతుంటే.. దాన్ని బలోపేతం చేసి దేశాన్ని సంరక్షించాల్సిందిపోయి, దేశ ప్రజలకు కొత్త చిక్కులు పెట్టడం ఎందుకు? ఇప్పుడు అసోంలో మొదలైన సీఏఏ కార్చిచ్చు దేశ రాజధానిలో 30 పైచిలుకు పౌరుల ప్రాణాలను తీసింది.

దేశంలో ఇంత అలజడి జరుగుతుంటే, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. మాలాంటి ప్రజాప్రతినిధులం ప్రశ్నించకపోతే ఈ అగ్నిపరీక్ష పాపం లో భాగస్వాములం కాదా అన్నది ఆత్మక్షోభకు గురిచేస్తున్నది. బంగ్లాదేశ్ నుం చి అసోంకు వలసలు వస్తున్నది నిజమే. బంగ్లా-భారత్ నడుమ యుద్ధం కన్నా ముందు, వలస వచ్చినవారి పట్ల ఉదాసీనంగా వ్యవహరించిన కేంద్రం, ఆ తర్వాత భారత్‌లోకి అక్రమంగా చొరబడిన వారిని ఆపేందుకు ఏ ప్రయ త్నమూ చేయలేదు. అక్రమ చొరబాటుదారుల పట్ల అందరికీ ఒకే అభిప్రా యం ఉండాలి. కానీ, ఆ పేరుతో దేశంలో ఉన్న ముస్లిం ప్రజలను అభద్రతలోకి నెట్టివేస్తామనేది ఆక్షేపణీయం. సీఏఏ అమలైతే.., ఈ దేశం లో వందల ఏండ్లుగా ఉన్న ముస్లింలు ఒంటరివారమనే భావనతో జీవిస్తారు. సీఏఏ ప్రకా రం, దేశంలో ఉన్న హిందువులు, క్రిస్టియన్లు, పార్సీలు, సిక్కులు స్థానికులై, ముస్లింలను మాత్రమే వెలివేసినట్లవుతుంది. బీజేపీ నాయకులు చెప్పినట్టు కేవలం ఇది జనగణన అయితే పర్వాలేదు. కానీ, సంఘ్‌పరివార్‌కు చెందిన సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాగూర్ వంటి నాయకుల రెచ్చగొట్టే మాటలు.. ఎలా ఉంటున్నాయో అందరూ చూస్తున్నదే. ఇదిలా ఉంటే, ఏ మతానికి చెందినవారో తెలియడానికి వారు వేసుకున్న దుస్తులు చాలవా.. అన్న ప్రధాని మాటలు సామాన్యుల గుండెల్లో భయందోనలు రేపవా? ఈ మాటలను ఏ విధంగా సమర్థించు కుంటారో వారే చెప్పాలి.

కేంద్ర పెద్దలు వాదిస్తున్నట్టు ఇప్పుడు వారు జరుపాలనుకుంటున్నది జనగణన మాత్రమే అయితే.. బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ హిందువుల దేశీయతనే కాదు, శ్రీలంకలో స్థిరపడిన తమిళ హిందూవుల పరిస్థితిని కూడా సమీక్షించవలసిన అవసరం ఏర్పడుతుంది. అప్పుడు వారిని సీఏఏలో ఎందుకు చేర్చలేదన్న ప్రశ్న ఉదయిస్తుంది. హిందీ మాట్లాడే ఆఫ్ఘనిస్థాన్ హిందువులకు మోదీ సర్కార్ పౌరసత్వం ఇస్తున్నప్పుడు, శ్రీలంకలో సింహల భాష మాట్లాడని తమిళుల సంగతేంటీ? తమిళులపై శ్రీలంకలో దాడులు జరుగడం లేదా? ఆ దేశపు తమిళులు దేశంలోకి రావడం లేదా? ఎందుకీ ద్వంద్వ విధానం అని ఆలోచించాల్సిన అవసరమున్నది.

కేంద్ర పెద్దలు వాదిస్తున్నట్టు ఇప్పుడు వారు జరుపాలనుకుంటున్నది జనగణన మాత్రమే అయితే.. బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ హిందువుల దేశీయతనే కాదు, శ్రీలంకలో స్థిరపడిన తమిళ హిందూవుల పరిస్థితిని కూడా సమీక్షించవలసిన అవసరం ఏర్పడుతుంది. అప్పుడు వారిని సీఏఏలో ఎందుకు చేర్చలేదన్న ప్రశ్న ఉదయిస్తుంది. హిందీమాట్లాడే ఆఫ్ఘనిస్థాన్ హిందువులకు మోదీ సర్కార్ పౌరసత్వం ఇస్తున్నప్పుడు, శ్రీలంకలో సింహల భాష మాట్లాడని తమిళుల సంగతేంటీ? తమిళులపై శ్రీలంకలో దాడులు జరుగడం లేదా? ఆ దేశపు తమిళులు దేశంలోకి రావడం లేదా? ఎందుకీ ద్వంద్వ విధానం అని ఆలోచించాల్సిన అవసరమున్నది.

ఈ భయాలు కేవలం సృష్టించుకున్నవో లేక అపాదించుకున్నవో కాదు మోదీ-షాలు 2014 నుంచి మాట్లా డుతున్న అనేక అంశాల భావప్రతీకలు. కమలనాథులు కోరుకుంటున్నట్టు.. తప్పక జరిపి తీరుతామంటున్న సీఏఏ, ఎన్నార్సీ అనంతరం తేలాల్సింది ప్రజలెవరో, పౌరులెవరో భారతీయులెవరో విషయమే కదా. కానీ సీఏఏ, ఎన్నార్సీ నిబంధనలతో ఇది సాధ్యమా? కేంద్రం అడిగే ప్రశ్నలకు 130 కోట్లమంది ప్రజల వద్ద ఆధారాలున్నాయా? ఒకవేళ వారడిగే 15 రకాల ప్రశ్నల్లో ఏ ఒక్కదానికి సమాధానం లేకపోతే పరిస్థితి ఏమిటి? ఎందుకంటే సాక్షాత్తు అమిత్ షా అన్నమాటలు 'No person will citizenship autometically'. అంటే ప్రజలంతా తాము పౌరులమని నిరూపించుకోవాల్సి అన్నమాట. కానీ అగ్రదేశాలకు వలసల పట్ల ఒక విధానం ఉన్నది. వలసలను అరికట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటారు. అయినప్పటికీ అక్రమంగా చొరబాటుదారులపైన రాజకీయ నిర్ణయంతో అక్కడి దేశాల్లో జాతీయత కలిగించిన అనేక సందర్భాలున్నాయి. అమెరికా సైతం సందర్భానుసారంగా అక్రమ చొరబాటుదారులకు సిటిజన్‌షిప్ ఇచ్చే విషయంలో ఉదారంగా వ్యవహరించిన ఉదాహరణలున్నయి.

అందుకే మోదీ సర్కారు నిర్ణయాన్ని ఒక్క కేసీఆర్ మాత్రమే వ్యతిరేఖించడం లేదు. ఎన్డీయేలో భాగస్వాములైన జేడీయూ, అకాళీదల్‌తో పాటు, హిందుత్వ మార్కుతో రాజకీయాలు చేసే శివసేన కూడా వ్యతిరేకిస్తున్నది. మతాలు, కులాల పేర జరిగే అల్లర్ల పట్ల అప్రమత్తంగా ఉండే తెలంగాణ ఇప్పుడు అప్రమత్తమైంది. కాబట్టే కేసీఆర్ కుండబద్ధలు కొట్టి సీఏఏను వ్యతిరేకిస్తునారు. మానవీయతకు పట్టం గడుతున్నారు.

**(వ్యాసకర్త: రాష్ట్ర శాసనమండలి సభ్యులు)**

## జనగళం

### వదంతులకు అడ్డుకట్ట వేయాలె

కరోనా వైరస్ ప్రభావం రాష్ట్ర పౌల్ట్రీ పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. కరోనా కారణంగా చికెన్ , కోడిగుడ్ల ధరలు రోజు రోజుకు పడిపోతున్నాయి. తద్వారా రాష్ట్ర పౌల్ట్రీ పరిశ్రమ ఆదాయం పడిపోయింది. నిజానికి చెప్పాలంటే యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ మన రాష్ర్టానికి సోకలేదు. కరోనా లక్షణాలున్న ఒక వ్యక్తి మాత్రమే రాష్ట్రంలో అడుగుపెట్టాడని, అతను కూడా చికిత్స తర్వాత కోలుకున్నాడని రాష్ట్ర ఆరోగ్యమంత్రి ఈటల రాజేందర్‌తో పాటు ప్రభుత్వ వైద్యులు ప్రకటించారు. అయినా కరోనా వదంతులు రాష్ర్టాన్ని వీడటం లేదు. ఈ వదంతుల కారణంగానే జనాలు జంకుతున్నారు. కాబట్టి ఈ వదంతులకు అడ్డుకట్ట వేయాలి. అప్పుడే పౌల్ట్రీ పరిశ్రమకు ఆదాయం పెరుగుతుంది.

**- కమలాకర్ నందగిరి, బీబీనగర్, యాదాద్రి జిల్లా**

### రైతు పక్షపాతి ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ బడ్జెట్‌లో రైతు రుణమాఫీ కోసం సుమారు రూ.25,936 కోట్లు కేటాయించింది. అయితే రూ.25 వేల లోపు ఉన్న రుణగ్రస్తులకు ఒకేసా రి రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించటం పట్ల రాష్ట్ర రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నది. మొత్తంగా 2018 డిసెంబర్ 11వ తేదీనాటికి బ్యాంకులకు బాకీ ఉన్న సుమారు 40 లక్షల 66 వేల మంది రైతులు ఈ రుణమాఫీతో లబ్ధి పొందనున్నారు. ఈ కేటాయింపులతో తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ముఖ్య మంత్రి కేసీఆర్ మరోసారి నిరూపించారు.

**- మాసాని సురేష్, సైదుపల్లి, వికారాబాద్ జిల్లా**

### జాగ్రత్తలు పాటించకపోవడమే కారణం

రంగులు చల్లుకుంటూ ఆనందంగా జరుపుకునే హోలీ వేడుకల్లో ఏటా విషాద చాయలు చోటుచేసుకోవడం బాధాకరం. ఏటా పదుల సంఖ్యలో యువకులు మరణిస్తుండటం చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నది. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఈతరాని వారు నీటిలో దిగడమే ఈ విషాదాలకు కారణం.

**- నర్మాల కృష్ణతేజ, లక్ష్మీనగర్, కరీంనగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# చర్లపల్లి జైలులో చేపల పెంపకం!

- ఎన్‌ఎఫ్‌డీబీకి ప్రతిపాదనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వినూత్న సంస్కరణల్లో ముందున్న తెలంగాణ జైళ్లశాఖ ఖైదీలకు ఉపాధి కల్పనలో భాగంగా మరో శిక్షణకు సిద్ధమైంది. చర్లపల్లి సెంట్రల్ జైలులో ఖైదీలకు శాస్త్రీయ పద్ధతిలో చేపల పెంపకాన్ని నేర్పేలా ఎన్‌ఎఫ్‌డీబీ (నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు)కు ప్రతిపాదనలు పంపించింది. ఇప్పటికే ఓపెన్‌జైలు ఆవరణలో ఉన్న తాత్కాలిక చెరువులో సాధారణ పద్ధతుల్లో చేపలను పెంచుతున్నారు. వ్యర్థజలాలను కూరగాయల సాగులో వినిగియోగించుకొనేలా సమీకృత పద్ధతిలో మత్స్యసాగుపై ఎన్‌ఎఫ్డీబీ.. రైతులకు శిక్షణ ఇస్తుంది. ఇందుకు సంబంధించిన ప్రాజెక్టును ఖైదీల కోసం ప్రారంభించాలని కోరుతూ జైళ్లశాఖ అధికారులు ఎన్‌ఎఫ్డీబీకి లేఖరాశారు. ప్రాజెక్టు మంజూరుకు తగిన వసతులున్నాయా.. అని తెలుసుకునేందుకు ఎన్‌ఎఫ్డీబీ బృందం చర్లపల్లి జైలుకు క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తుందని అధికారులు తెలిపారు.

# హరిత తెలంగాణ కోసం మొక్కల దత్తత

- టీఎస్‌ఎఫ్‌డీసీ వినూత్న ప్రయోగం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మొక్కలను సంరక్షించేందుకు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎఫ్‌డీసీ) 'మొక్కలదత్తత' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బొటానికల్ గార్డెన్‌లోని పాలపిట్ట పార్కులో ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. దాతలు రూ. 5 వేలు చెల్లించి ఒక మొక్కను దత్తతను తీసుకుంటే మొక్క బతికున్నంతవరకు వారిపేర్లున్న బోర్డులను మొక్కలపై ఉంచుతామని టీఎస్‌ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్, పీసీసీఎఫ్ రఘువీర్ తెలిపారు. ఎక్కువ మొక్కలను దత్తత తీసుకొనేవారికి రుసుములో రాయితీ ఇస్తామని వెల్లడించారు. పాలపిట్టపార్కులో రెండొందల మొక్కలను దత్తత తీసుకొనేందుకు కెనరాబ్యాంక్ ముందుకొచ్చింది. ఇందుకోసం ఐదు లక్షల రూపాయలు చెల్లించింది.



పాలపిట్ట పార్కులో కెనరాబ్యాంకు దత్తత తీసుకున్న మొక్కలు

# 16 నుంచి ఒంటిపూట బడులు

- ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు
- యథావిధిగా మధ్యాహ్న భోజనపథకం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎండల తీవ్రత పెరుగనున్న నేపథ్యంలో ఈ నెల 16నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్యలోనే తరగతులు నిర్వహించాలని, అన్ని పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని యథావిధిగా అమలుచేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ చిత్రా రామచంద్రన్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ ఈ నెల 16నుంచి ఏప్రిల్ 23వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని పేర్కొన్నారు. కాగా ఏప్రిల్ 24 నుంచి వేసవిసెలవులు ప్రారంభంకానున్నాయి. జూన్ 11వ తేదీవరకు విద్యార్థులకు వేసవి సెలవులుంటాయని, 2020-21 విద్యాసంవత్సరానికి సంబంధించి జూన్12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభిస్తామని విద్యాశాఖ తెలిపింది. ఈ ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయని ప్రాంతీయ విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాధికారులకు తెలిపింది. పాఠశాలల్లో ఈ విద్యాక్యాలెండర్‌ను అమలుచేయాలన్నారు.





హైదరాబాద్ నానక్‌రాంగూడలో అమెరికా కాన్సులేట్ నిర్మిస్తున్న భవన టాపింగ్ ఔట్ కార్యక్రమంలో అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, సీపీ సజ్జనార్, యూఎస్ కాన్సుల్ జనరల్ జోయల్ రిఫ్‌మన్

# మన బంధం పటిష్ఠం

మూడోపేజీ తరువాయి...

చెప్పారు. రెండుదేశాల మధ్య సత్సంబంధాల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోదీ కృషిచేస్తున్నారని గుర్తుచేశారు. భవన నిర్మాణం అద్భుతంగా ఉన్నదని ప్రశంసించారు. దక్కన్ నిర్మాణ శైలికి దగ్గరగా ఉండేలా రూపొందించినందుకు అమెరికా ప్రభుత్వానికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. భారత్‌లో అమెరికా రాయబారిగా జస్టర్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి హైదరాబాద్‌కే వచ్చారని గుర్తుచేసిన కేటీఆర్.. నాటినుంచి తెలంగాణకు ఒక మంచి స్నేహితుడిగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. అంతకుముందు కెన్నత్ జస్టర్.. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలు గొప్పగా ఉన్నాయని ప్రశంసలు కురిపించారు. టీఎస్‌ఐపాస్ వంటివి తెలంగాణ ఖ్యాతిని రెట్టింపు చేశాయని కొనియాడారు. హైదరాబాద్ అద్భుతంగా అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు. ఇలాంటి నగరంలో యూఎస్ కాన్సుల్ జనరల్ కార్యాలయం రావటం ఇక్కడి పౌరులకేగాక ఇతర రాష్ర్టాల వారికి సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. రానున్న రోజుల్లో అమెరికా-తెలంగాణ మధ్య ఉన్న బంధం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. 2021లో నూతన భవనం అందుబాటులోకి రానుందని జస్టర్ తెలిపారు.

### రూ.2500 కోట్లతో 12 ఎకరాల్లో నిర్మాణం

మల్టీ బిల్డింగ్ కాన్సులేట్ కాంప్లెక్స్‌ను ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని నానక్‌రాంగూడలో 12 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. రిచర్డ్ కెనడీ ఆర్కిటెక్ట్ బాధ్యతలు చూడగా.. క్యాడెల్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ భవనాన్ని నిర్మిస్తున్నది. నిర్మాణం కోసం దాదాపు రూ.2,500 కోట్లు (350.5 మిలియన్ డాలర్లు) ఖర్చు చేస్తున్నారు. నిర్మాణంలో అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్నారు. భారత్, అమెరికా సంస్కృతులు ప్రతిబింబించేలా చూసుకుంటున్నారు.

# కరోనాలేని తెలంగాణ!

## గాంధీలో చికిత్సతో కోలుకున్న యువకుడు

- రాష్ట్రంలో కరోనా ఒక్క పాజిటివ్ కేసూ లేదు
- రెండో టెస్టింగ్ ల్యాబ్‌కు కేంద్రం అనుమతి
- వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రం ప్రస్తుతం కరోనారహితంగా మారింది. ఇప్పుడు కరోనా వ్యాధిగ్రస్థులు ఒక్కరు కూడా లేరు. వైరస్ పాజిటివ్ ఉన్న వ్యక్తికి కూడా ఇప్పుడు నయమైపోయిందని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. మంగళవారం కోఠిలోని డీఎంఈ కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ దుబాయ్‌లో కరోనా వ్యాధిసోకి హైదరాబాద్‌కు వచ్చిన టెకీ గాంధీ దవాఖానలో 14 రోజులు వైద్య సేవలు అందించడంతో పూర్తిగా కోలుకున్నాడని చెప్పారు. తాజాగా ఆ యువకునికి నిర్వహించిన రెండు వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో ఒకటి నెగటివ్ అని వచ్చిందని, మరో నివేదిక పుణెనుంచి రావాల్సి ఉన్నదని తెలిపారు. ప్రపంచమంతటా కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో పలు దేశాల్లో ఉన్న మన రాష్ట్ర ప్రజలు తిరిగివస్తున్నారని, వారందరికీ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. 15 రోజుల్లో 41,102 మంది ప్రయాణికులకు పరీక్షలు చేసి, 277 మంది అనుమానితులను గాంధీదవాఖానకు తరలించామని తెలిపారు. ఈ పరీక్షల కోసం ఎయిర్‌పోర్టులో ఉన్న వైద్యసిబ్బందిని నాలుగురెట్లు పెంచామని చెప్పారు. స్క్రీనింగ్ కోసం సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు కొత్తగా రెండు మిషన్లకు ఆర్డర్ ఇచ్చామని, అవి రెండురోజుల్లో వస్తాయని తెలిపారు.



మంగళవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో సమావేశమైన యశోద దవాఖాన ఎండీ జీఎస్ రావు

### కేరళ తరహాలో...

కేరళలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం స్థాయిలో కూడా ఐసీయూ సేవలు అందుబాటులోకి తెచ్చారని మంత్రి రాజేందర్ చెప్పారు. మన రాష్ట్రంలో జిల్లా దవాఖానల్లో ప్రత్యేక ఐసొలేషన్ వార్డులను ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కరోనా వ్యాప్తి నియంత్రణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులతో చర్చించామన్నారు.

### హైదరాబాద్‌లో మరో టెస్టింగ్ ల్యాబ్

కేంద్రం ప్రతిపాదన మేరకు ఉస్మానియా దవాఖానలో మరో కరోనా టెస్టింగ్ ల్యాబ్‌ను నెలకొల్పనున్నామని ఈటల చెప్పారు. ఇప్పటికే గాంధీ దవాఖానలో ఒక టెస్టింగ్ ల్యాబ్ ఉన్న సంగతి తెలిసిందే. ఐపీఎంలో కూడా మరో ల్యాబ్ ఏర్పాటుచేసేందుకు అనుమతి కోరామని తెలిపారు. దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రికి సూచించామని చెప్పారు. వైరస్ వచ్చిన తర్వాత ఉత్పన్నమయ్యే పరిస్థితులను కేంద్రంతో చర్చించామని, సర్కారు, ప్రైవేటు దవాఖానల్లో అందించనున్న సేవలపై అధికారులతో సమీక్షించామని తెలిపారు. తెలంగాణలో ఒక్క కరోనా కేసు కూడా లేకపోయినప్పటికీ.. సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు సీఎస్, స్పెషల్ సీఎస్ నేతృత్వంలో పూర్తి సన్నద్ధంగా ఉన్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ జీ శ్రీనివాసరావు, డీఎంఈ రమేశ్‌రెడ్డి, పాల్గొన్నారు.

## వైద్యశాఖకు 2లక్షల మాస్కులు

**యశోద దవాఖాన వితరణ**

కొవిడ్-19 వ్యాప్తిని అడ్డుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వ కృషి అభినందనీయమని యశోద దవాఖాన ఎండీ జీఎస్ రావు, ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో మంత్రి ఈటలతో భేటీ అయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు వైద్యారోగ్యశాఖకు 2 లక్షల మాస్కులను అందజేస్తామని తెలిపారు. ఇప్పటివరకు 1.20 లక్షల మాస్కులు ఇచ్చామని, మరో 80వేలు బుధవారం అందిస్తామన్నారు.

### హోమ్ ఐసొలేషన్‌లో ఉండాలి

చైనా, హాంకాంగ్, సౌత్‌కొరియా, జపాన్, ఇటలీ, థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా, ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ దేశాల నుంచి వస్తున్న ప్రవాస భారతీయులు ఎవరికివారు స్వయంగా 14 రోజులపాటు తమ ఇంట్లోనే ఐసొలేషన్‌లో ఉండాలని సూచిస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన జారీచేసింది.

### కోవిడ్-19పై టీశాట్ అవగాహన

కరోనాను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై టీశాట్ అవగాహన కార్యక్రమం చేపట్టింది. టీశాట్ స్టూడియో నుంచి వైద్యాధికారుల బృందంతో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్షప్రసారం ద్వారా కార్యక్రమం నిర్వహించారు.

## వైద్య సిబ్బంది సేవలు అభినందనీయం

రాష్ట్రంలో కొవిడ్-19పై అవగాహన కల్పించడంలో వైద్యసిబ్బంది చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. టీఎన్జీవో ఆధ్వర్యంలో ఉద్యోగులు మంత్రితో మంగళవారం సమావేశమయ్యారు. అనంతరం వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, రాజేశ్‌కుమార్, కొండల్‌రెడ్డి, రమేశ్, టీఎన్జీవో మెడికల్ ఫోరం అధ్యక్షుడు కిరణ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, హరినాథ్, ఎంవీ నర్సింహారెడ్డి, వెంకటరమణ, శైలజ, విష్ణువర్ధన్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

# వానెంత పనిజేసె..

అకాల వర్షంతో రైతులు ఆగం

**మక్కజొన్న, మిర్చికి తీవ్రనష్టం**

**వివరాలు సేకరించిన వ్యవసాయశాఖ**



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకంపల్లిలో నేలవాలిన మక్కను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పలు జిల్లాల్లో అన్నదాతల ఆశలు అడియాశలయ్యాయి. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయానికి గాలివానకు దెబ్బతినడంతో వారు ఆగమయ్యారు. వర్షాలకు మక్కజొన్న, వరి పంటలతోపాటు కల్లాల్లో ఆరబోసిన మిర్చికి.. మార్కెట్లకు తీసుకొచ్చిన కందులు తదితర ఆపరాలకు నష్టం జరిగింది. కాగా, జరిగిన నష్టంపై వ్యవసాయ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలు చేసి నివేదికలు రూపొందిస్తున్నారు.

✦ కరీంనగర్ జిల్లాలో ఇటీవల కురిసిన వర్షంతో కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, చొప్పదండి, రామడుగు, గంగాధర, తిమ్మాపూర్, మానకొండూర్, శంకరపట్నం, ఇల్లందకుంట మండలాల్లో 460 హెక్టార్లలో మక్కజొన్న, వరి, నువ్వు పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. 411 హెక్టార్లల్లో మక్కజొన్న, 49 హెక్టార్లల్లో వరి, 0.8 హెక్టార్లల్లో నువ్వు పంటలు దెబ్బతిన్నాయి. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా ఏడు మండలాల్లో 129.2 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అత్యధికంగా సదాశివనగర్ మండలంలో 51.6 హెక్టార్లలో మక్కజొన్నకు నష్టం జరిగింది. సోమవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వర్షానికి సంగారెడ్డి జిల్లా అందోలు, హత్నూర, సిర్గాపూర్, కల్హేర్, నాగల్‌గిద్ద మండలాల్లో వరి 61.6 హెక్టార్లు, జొన్న 197.06 హెక్టార్లు, మక్కజొన్న 6.8 హెక్టార్లలో దెబ్బతిన్నది. మెదక్ జిల్లాలోని రామాయంపేట, నిజాంపేట, మెదక్ మండలాల్లో మక్కజొన్న 40 హెక్టార్లలో నష్టం జరిగింది. అకాల వర్షానికి నల్లగొండ జిల్లాలో 976 హెక్టార్లలో వరి దెబ్బతింది. ఖమ్మం జిల్లాలో కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబోసిన మిర్చితోపాటు అమ్మేందుకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు తడిసి ముద్దయ్యాయి. 45 మెట్రిక్ టన్నుల మిర్చికి నష్టం వాటిల్లగా, 117 హెక్టార్లలో మక్కజొన్న దెబ్బతిన్నది.

### ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికంగా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అకాల వర్షంతో తీవ్ర నష్టం జరిగింది. వరంగల్ రూరల్ జిల్లాలో అకాల వర్షందాటికి నర్సంపేట, చెన్నారావుపేట, దుగ్గొండి, గీసుగొండ, సంగెం, దామెర మండలాల్లో 2,132 హెక్టార్లలోని మక్కజొన్నకు నష్టం వాటిల్లింది. ఫలితంగా 27 గ్రామాల్లోని 4,625 మంది రైతులు నష్టపోయారు. నర్సంపేట మండలంలోని కమ్మపల్లి, దాసరిపల్లి గ్రామాల్లో 83 మంది రైతులకు చెందిన సుమారు 100 హెక్టార్లలో చపాట రకం మిరప పంటకు నష్టం వాటిల్లింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల, రేగొండ, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లో వర్షం కారణంగా మక్కజొన్న పనికి రాకుండాపోగా కల్లాల్లో మిర్చి దెబ్బతిన్నది. మొత్తం 488 హెక్టార్లలో మక్కజొన్న నేలవాలింది. విత్తన మిర్చికి భూపాలపల్లి ప్రసిద్ధి కాగా.. వానలకు జిల్లాలో వివిధ కంపెనీలకు సంబంధించిన సీడ్ మిర్చి తడిసి రంగు మారింది.



భూపాలపల్లి జిల్లా తిరుమలాపూర్‌లో తడిసిన మిర్చి ఆరబోసి తాలును వేరుచేస్తున్న మహిళలు

### క్షేత్రస్థాయిలో అధికారుల సర్వే

వర్షాలకు నష్టపోయిన పంటలను వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. జిల్లాల్లోని ఏయే మండలాల్లో ఎంతమేర పంట నష్టం జరిగిందో పూర్తిస్థాయి నివేదికలు రూపకల్పనలో అధికారులు బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో పంట నష్టం సర్వే పూర్తవ్వగా.. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు నివేదికలను ప్రభుత్వానికి అందజేయనున్నారు.

• జాతివైరం మరిచి..



ఓ గోమాత జాతివైరం మరిచి శునకానికి పాలివ్వడం అందరి దృష్టిని ఆకర్శించింది. ఈ దృశ్యం మంగళ వారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో 'నమస్తేతెలంగాణ' కెమెరాకు చిక్కింది. - అమ్రాబాద్ రూరల్

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**లక్షెట్టిపేట :** పట్టణంలోని కరీంనగర్ చౌరస్తా వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానిక హరిమూర్తి హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద లారీ, ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో జన్నారం మండల కేంద్రంలోని శ్రీలంక కాలనీకి చెందిన మౌలానాకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని తిరిగి లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. మృతుడు గ్యాస్ స్టౌవ్‌లు రిపేర్ చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు సమాచారం.



కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

## 'పట్టణప్రగతి' సమస్యలు పరిష్కరించాలి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల

**కరీంనగర్ కార్పొరేషన్, నమస్తేతెలంగాణ:** పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టణ ప్రగతి పురోగతిపై కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మేయర్ సునీల్‌రావు, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. డివిజన్లవారీగా ప్రత్యేకాధికారులు, ఏఈలు ప్రణాళికలు రూపొందించుకుని ప్రభుత్వానికి ఇవ్వాలని ఆదేశించారు.



సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం లక్ష్మీనాయక్ తండాలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

## తెలంగాణలో వలసలు బంద్

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట టౌన్ : సూర్యాపేట టౌన్ :** రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో వలసలు బంద్ అయ్యాయని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా చివ్వెం ల మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ.1.07 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో అన్నిరంగాలతోపాటు వ్యవసాయ రంగం కూడా డీలాపడిందన్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలిసేది కాదనీ, అరకొర కరెంట్‌తో నీరులేక ఆగిఆగి పోసే బోర్లను నమ్ముకోలేక నాడు రైతులు వలసలు వెళ్లేవారని చెప్పారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసి అన్ని ప్రాంతాలతోపాటు సూర్యాపేట జిల్లాలోని చివరి ఎకరాకు నీరందించారనీ, దీంతో ప్రస్తుతం వలసలు పూర్తిగా బందయ్యాయని తెలిపారు. చివ్వెంల మండలం మున్యానాయక్ తండా కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామ సర్పంచ్ బానోత్ బికారీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతోపాటు సుమారు 180 మంది మంత్రి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పసికందు అపహరణ

**భద్రాచలం, నమస్తేతెలంగాణ:** అప్పుడే పుట్టిన పసికందు అపహరణకు గురైన ఘటన భద్రాచలం ఏరియా దవాఖానలో మంగళవారం జరిగింది. దుమ్ముగూడెం మండలం ముల్కనపల్లికి చెందిన కారం కాంతమ్మ ప్రసవంకోసం మంగళవారం భద్రాచలం ప్రభుత్వ దవాఖానలో చేరగా, మధ్యాహ్నం 12:30 ప్రాంతంలో ఆమెకు ఆడ శిశువు జన్మించింది. పాపపుట్టిన కొద్దిసేపటికే కన్పించకపోవడంతో కుటుంబసభ్యులు దవాఖాన పరిసరాల్లో గాలించారు. దవాఖాన ఇంచార్జి సూపరింటెండెంట్ రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దవాఖానకు చేరుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. 25-30 ఏండ్ల వయస్సున్న యువతి పాపను తీసుకొని కన్పించకుండాపోయిందని ఇంచార్జి సూపరింటెండెంట్ తెలిపారు.

# అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హత్య

**హన్మకొండలో కిడ్నాప్..**

**భూపాలపల్లి రాంపూర్ అడవుల్లో హతం**




ఆనంద్‌రెడ్డి (ఫైల్)

**వరంగల్ క్రైం:** మూడురోజుల క్రితం అదృశ్యమైన ఖమ్మం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మోకు ఆనంద్‌రెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. తొలుత కిడ్నాప్ అనుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ప్రదీప్‌రెడ్డి అనే వ్యక్తి హత్య చేశాడని, తామే సాక్ష్యమని ఇద్దరు వ్యక్తులు మంగళవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. జనగామ జిల్లా ఓబుల్ కేశవపూర్‌కు చెందిన ఆనంద్‌రెడ్డి ఖమ్మంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. గతంలో వరంగల్‌లో పనిచేస్తున్న సమయంలో ఆయనకు వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలం శనిగరానికి చెందిన ప్రదీప్‌రెడ్డితో ఆర్థిక లావాదేవీలు కొనసాగాయి. ప్రదీప్‌రెడ్డి డబ్బులు ఇవ్వాల్సి ఉండటంతో ఈ నెల 6న ఆనంద్‌రెడ్డి ఖమ్మం నుంచి హన్మకొండకు వచ్చారు. ఏడో తేదీన హన్మకొండ అశోకహోటల్‌లో ప్రదీప్‌రెడ్డిని కలిసి అప్పు విషయం మాట్లాడారు. తాను నగదు ఇవ్వలేనని, భూపాలపల్లిలో ఉన్న తన స్థలాన్ని ఇస్తానని చెప్పి ఆనంద్‌రెడ్డిని అక్కడికి తీసుకువెళ్లాడు. ఏడో తేదీ మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఆనంద్‌రెడ్డి ఫోన్ స్విచ్‌ఆఫ్ కావడంతో హన్మకొండ పోలీస్‌స్టేషన్‌లో ఆయన తమ్ముడు శివకుమార్‌రెడ్డి ఫిర్యాదుచేశారు. పోలీసుల విచారణలో ఆనంద్‌రెడ్డిని తీసుకెళ్లిన వాహనం హైదరాబాద్‌లోని అల్వాల్‌లో ప్రత్యక్షం కావడం.. ప్రదీప్‌రెడ్డి, ఆయన కారు డ్రైవర్ సాగర్ ఫోన్లు పనిచేయకపోవడంతో పోలీసులు ఆ దిశ గా దర్యాప్తు చేపట్టారు. మంగళవారం సాయంత్రం ప్రదీప్‌రెడ్డి కారు డ్రైవర్‌సాగర్‌తోపాటు అనుచరుడు ప్రవీణ్‌రెడ్డి హన్మకొండ పీఎస్‌లో లొంగిపోయారు. ఆనంద్‌రెడ్డిని భూపాలపల్లి అడవిలో ప్రదీప్‌రెడ్డి హత్యచేశాడని, అందుకు తామే సాక్షులమని తెలిపారు. దీంతో వారిని వెంటబెట్టుకొని హన్మకొండ ఏసీపీ జితేందర్‌రెడ్డి, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీఐలు దయాకర్, వాసుదేవరావు నేతృత్వంలోని బృందం భూపాలపల్లిలోని రాంపూర్ అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టింది. హత్య జరిగిన ఆనవాళ్లను పోలీసు బృందం గుర్తించింది. కాగా అర్ధరాత్రి వరకు మృతదేహం ఆచూకీ లభించలేదు.



## హరితహారంలో విదేశీ వనిత

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మంగళకుంటపల్లిలో హరితహారంలో భాగంగా అమెరికాకు చెందిన హబీ అనే యువతి మంగళ వారం మొక్క నాటారు. గ్రామానికి చెందిన మాధవరం వాసుదేవరావు కుటుంబంతో కలిసి వచ్చిన ఆమె మొక్క నాటి అందరిని ఆకట్టుకున్నారు. - బల్మూరు



యంత్రాల మధ్య పనిచేస్తూ..
మనిషీ ఓ యంత్రం అవుతున్నాడు..
చిన్న కష్టం వచ్చిందంటే కుంగిపోతున్నాడు..
కాస్త బాధ కలిగినా ఒక భుజం
ఓదార్పుగా నిలువాలని కోరుకుంటున్నాడు..
కానీ ఈవిడ మాత్రం ప్రతిదీ
ఒక సవాలుగా తీసుకున్నారు..
యంత్రాల మధ్య పని చేస్తూ కూడా..
ఎంతో హాయిగా జీవించవచ్చని నిరూపిస్తూనే..
ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నారు..
ఆర్మీ.. నేవీ.. ఎయిర్‌ఫోర్స్..
ఇలా రక్షణ రంగంలోని మూడు
విభాగాలకూ తన సేవలందిస్తూ..
ఎంతోమంది ప్రశంసలూ
అందుకొంటున్నారు..
ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్
ఫ్యాక్టరీ అదనపు జనరల్ మేనేజర్‌గా
పనిచేస్తున్నారు..ఆమే సుజాత గోగినేని.
రక్షణ శాఖ ప్రతీ సంవత్సరం
ఇచ్చే ఆయుధ భూషణ్ అవార్డుకు ఎంపికయ్యారు..
ఈ సందర్భంగా ఆమె తన
ప్రస్థానాన్ని 'జిందగీ'తో పంచుకున్నారు.

# పనే ఆమె ఆయుధం

**మెదక్‌లోని** ఎద్దు మైలారం ఆర్డినెన్స్ బోర్డ్. ఇక్కడ కాకుండా దేశవ్యాప్తంగా ఆర్డినెన్స్‌కి సంబంధించి 41 ఫ్యాక్టరీలున్నాయి. ఇవికాకుండా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్, 65 యూనిట్స్, మార్కెటింగ్ సెంటర్స్ ఇలా చాలా విభాగాలు పనిచేస్తున్నాయి. ఇందులో ఎంతోమంది పనిచేస్తున్నారు. ప్రతీ సంవత్సరం రక్షణశాఖ ఎందులో మంచిగా పనిచేసే వారిని ఎంపిక చేస్తుంటుంది. వారిని ఆయుధ భూషణ్ అవార్డుతో గౌరవిస్తుంటుంది. గతేడాది సేవలకుగాను సుజాత గోగినేని ఆ పురస్కారాన్ని అందుకోవడానికి ఎంపికయ్యారు. ఏ గుర్తింపు కూడా ఒక్క రోజులో రాదు. ఆమెకు ఈ గుర్తింపు రావడానికి 35 యేండ్ల సమయం పట్టింది. ఇప్పుడు ఆ శ్రమకు తగిన గుర్తింపు లభించడం ఎంతో సంతోషంగా ఉందంటున్నారు.

**సవాళ్లను ఎదుర్కొంటూ:** డిఫెన్స్ అంటే.. అక్కడ ఆడవాళ్లు పనిచేస్తారా? అనుకొనే కాలం. ఆ సమయంలో ఉద్యోగంలో చేరారు సుజాత. ప్రతీరోజు ఒక కొత్త సవాలే. ఎందుకంటే ఆర్మీకి సంబంధించిన యుద్ధ ట్యాంకర్‌లను తయారు చేసేందుకు ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటుంది. ఒక్కసారి దానికి సంబంధించిన పార్ట్‌లు వచ్చాయంటే.. వీరి పని మొదలవుతుంది. మ్యానుఫ్యాక్చరింగ్ డిపార్ట్‌మెంట్ కాబట్టి.. అన్ని సెక్షన్స్ ఉంటాయి. ఇంజిన్లు, గేర్ బాక్స్‌లు, ఇలా అన్ని విభాగాల్లోనూ సుజాతకి పట్టుంది. ఒక ట్యాంక్ తయారుచేసిన తర్వాత దాన్ని వివిధ ప్రదేశాల్లోకి తీసుకెళ్లి ఫైరింగ్ చేయాలి. ఏదైనా డిఫెక్ట్ ఉంటే దాన్ని సరిచేయాలి. ఒక్కో మెషీన్‌ల్లో ఒక్కో వేరియంట్స్ ఉంటాయి. అన్ని విభాగాల్లో పనిచేసిన అనుభవం సుజాతకి ఉంది. ఏ రోజుకు ఆ రోజు కొత్త సవాళ్లు వస్తుంటాయి. వాటన్నింటినీ అధిగమించడం ఒక చాలెంజింగ్‌గా తీసుకుంటారీవిడ. ఇక నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఇలా అన్ని విభాగాలకు ఈమె తన సేవలందించారు.

**సౌకర్యాలు లేకున్నా:** సుజాత.. ఐటీ డెవలప్‌మెంట్‌లో భాగం అవుతూనే దానితోడు ప్రొడక్షన్, మార్కెటింగ్, కార్పొరేట్ ప్లానింగ్‌లో రెండు దశాబ్దాలు, బడ్జెట్.. ఇలా అన్ని డివిజన్‌లతో టచ్‌లో ఉంది. మొదట్లో అయితే.. ఆర్మీ, నేవీ వాళ్లతో మీటింగ్స్ ఉండేవి. ఆ సమయంలో లేడీస్ టాయిలెట్స్ కూడా ఉండకపోయేవి. ఎందుకంటే ఈ విభాగంలో ఆడవాళ్లు లేకపోయేది. కొన్ని సెమినార్లు, కొన్ని మీటింగ్స్‌కి వెళ్లినప్పుడు తను ఒక్కతే మహిళగా అటెండ్ అయిన సందర్భాలు ఉన్నాయి. కానీ అవేవీ ఆమె వృత్తికి అడ్డంకి అనుకోలేదు. మగవాళ్లకు దీటుగా పనిచేసింది. ఈ ధైర్యాన్ని మెచ్చి ఒక ఆర్గనైజేషన్ జేఎన్‌సీ చౌదరి షీల్డ్ ఇచ్చింది. ఆర్మీ మేజర్ జనరల్స్ వారికి సపోర్ట్ ఇస్తున్నందుకు, నేవీ, కోచ్‌గార్డ్ వాళ్లు ఇలా స్పెషల్‌గా తన గురించి, తన పనిని గుర్తించి మెచ్చుకుంటూ ఎన్నో లేఖలు కంపెనీకి పంపించారు.

**సేవలోనూ మిన్న:** మంచి పని చేయాలని మనసు ఉండాలే కానీ.. అది ఏ రూపంలోనైనా చేయొచ్చు అంటారు సుజాత. ప్రత్యేకంగా ఒక ఆర్గనైజేషన్ నడుపకున్నా.. ఎన్నో ఆర్గనైజేషన్లతో కలిసి 'నేను సైతం' అంటూ నడిచింది, ఇంకా నడుస్తూనే ఉన్నది. వారి సంస్థలోనే 'ఓడీఎఫ్ స్నేహహస్తాలు' అన్ని ఒక చిన్న ఆర్గనైజేషన్‌ని ప్రారంభించారు. అక్కడ పనిచేసే కొంతమంది ఉద్యోగులు తమ డబ్బును కూడబెట్టి అక్కడ ఎద్దుమైలారం చుట్టుపక్కల స్కూల్స్‌కి వెళ్లి ఎలాంటి సాయం కావాలన్నా చేస్తున్నారు. పచ్చదనం, పరిశుభ్రతలాంటి కార్యక్రమాలకు అండగా ఉంటున్నది.

**బల్గేరియా చాన్స్..**
సుజాత స్వస్థలం గుంటూరు. ప్రముఖ కార్మిక నాయకుడు గోగినేని సూర్యం, సుశీల దంపతులకు ముగ్గురు అమ్మాయిలు. వారి పెద్ద కూతురు సుజాత. చిన్నప్పటి నుంచి చదువు మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలని తండ్రి చెప్పేవారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని చదివారు సుజాత. పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్, జేకేసీ కాలేజ్‌లో ఇంటర్ చేశారు. అయితే ఆ కాలేజ్‌లో ఎంపీసీలో జాయినయింది తను ఒక్కతే కావడం ఇక్కడ విశేషం. ఆ తర్వాత బీఎస్సీలో చేరింది. రెండు నెలల పాటు కాలేజ్‌కి వెళ్లింది. అప్పుడు స్టూడెంట్ ఎక్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో బల్గేరియా వెళ్లడానికి చాన్స్ వచ్చింది. బల్గేరియాలో చదువుతున్నప్పుడు తను ఎలా అక్కడి భాష నేర్చుకుంది, హాస్టల్ వసతులు, కాలేజ్‌కి సంబంధించిన విషయాలతో ఒకరు డాక్యుమెంటరీ తీశారు. ఆ సమయంలో క్యాంపస్‌లో చాలా పాపులర్ అయ్యారు సుజాత. ఇండియా నుంచి ఏ అతిథులు వచ్చినా ఆమెనే పురమాయించేవారు. అలా ఇందిరాగాంధీలాంటి మహామహులు పరిచయమయ్యారు. వారి మాటల స్ఫూర్తితోనే అక్కడ చదువు పూర్తి చేసి స్వదేశానికి వచ్చేసింది.

**దేశానికే అంకితం..**
సాఫ్ట్‌వేర్ అప్పుడప్పుడే పుంజుకుంటున్న సమయం. తను అక్కడ ఐటీనే చదివింది. విదేశాల్లో ఎన్నో ఆఫర్లు వచ్చాయి. కానీ చదివిన చదువు దేశం కోసమే ఉపయోగించాలనుకుంది. ఇక్కడికి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగం కోసం చాలా ప్రయత్నాలు చేసింది. ఏపీఎస్ఆర్టీసీ వాళ్లకు, ఎలక్ట్రిసిటీ వాళ్లకు కంప్యూటర్ ప్రోగామర్‌గా పనిచేసింది. ఆ తర్వాత యూపీఎస్సీ ద్వారా 1989లో ఆర్డినెన్స్ హైదరాబాద్ శాఖలో జాయినయింది. ఆ తర్వాత చెన్నై, కోల్‌కతాలో పనిచేసింది. వివిధ విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఆర్డినెన్స్ సెక్టార్ మెదక్ అడిషనల్ జనరల్ మేనేజర్ సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్‌లో ఉన్నారు సుజాత.



**టీమ్ వర్క్ వల్లే..**

ఆడవాళ్లు దేంట్లోనూ తక్కువ కాదు.. మగవాళ్ల కంటే సైకలాజికల్‌గా మనమెంతో స్ట్రాంగ్ అని నా ఉద్దేశం. బాధ కలిగిందని ఒక భుజం కోసం ఎదురుచూడొద్దు. నా భర్త చాలా చిన్న వయసులోనే చనిపోయాడు. అప్పటికి ఇద్దరు పిల్లలు. వారి చదువుల కోసం కష్టపడ్డాను. ప్రతీ పనిలో అమ్మ నాకు అండగా నిలబడింది. దాంతో పనిని నేను నమ్ముకున్నా. నేను ఈ రంగంలోకి వచ్చినందుకు ప్రతీ రోజు గర్వంగా ఫీలవుతుంటా. కింది స్థాయి వారి నుంచి కొన్నిసార్లు కంప్లయింట్స్ వస్తుంటాయి. వారి సమస్యలను తీర్చడానికి శాయశక్తులా కృషి చేస్తా. నా ఈ అవార్డు నా ఒక్కదాని కృషి అని నేను అనుకోను. నాతో పనిచేసిన నా టీమ్ మొత్తానికి వచ్చిందని అనుకుంటున్నా.

...✍ సౌమ్య నాగపురి

## నిమిషాల్లో వ్యాధిని గుర్తించే పరికరం



'ప్రపంచంలో అత్యంత ప్రాణాంతక పురుగు ఏది' అంటే 'దోమ' అంటున్నారు బిల్‌గేట్స్. గ్రామీణ భారతదేశంలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు దోమల ద్వారా వస్తున్నాయి. దీనిని ముందుగానే నిర్ధారిస్తే వ్యాధి బారిన పడకుండా ఉంటారు. బెంగళూరుకు చెందిన హెల్త్‌కేర్ స్టార్టప్ అమేలియోరేట్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ బనితా శ్రీవాస్తవ తుంగా, ఆమె భర్త డాక్టర్ రాషెబరి తుంగాతో కలిసి 2016లో ఒక డివైజ్‌ను కనుగొన్నారు. ఇది దోమల ద్వారా వచ్చే వ్యాధులను గుర్తించగల డయాగ్నొస్టిక్ పరికరం. ఒక్క మాటలో చెప్పాలంటే.. వ్యాధి లక్షణాలు కనిపించిన మొదటి రోజున పరికరం ఈ మూడు వ్యాధులను 10 నిమిషాల్లో గుర్తించగలదు. ఈ డివైజ్‌ను ఉపయోగించేందుకు ఎలాంటి శిక్షణ అవసరం లేదు. ఈ పరికరాన్ని త్వరలోనే మార్కెట్లోకి విడుదల చేస్తామంటున్నారు దంపతులు. ధర రూ.4,000-5,000 వరకు ఉంటుంది. దీనిని ఇన్ఫోసిస్ ఫౌండర్ సుధామూర్తి గుర్తించారు.

**మలేరియా, చికున్‌గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులు దోమల ద్వారా సంతరించుకుంటాయి. ఈ వ్యాధులను 10 నిమిషాల్లో నిర్ధారించేందుకు ఈ దంపతులు ఒక డివైజ్‌ను కనుగొన్నారు. దీనిని ఇన్ఫోసిస్ సంస్థ గుర్తించింది. ఆరోహన్ సోషల్ ఇన్నోవేషన్ అవార్డ్స్ గోల్డ్ కేటగిరిలో అవార్డు అందుకున్నారు.**

## కొత్తగా బిజినెస్ పెట్టాలనుకుంటున్నారా?



- కొత్తగా బిజినెస్ ప్రారంభించాలనుకునే వారు ఇదివరకు అలాంటి వ్యాపారం ఏదైనా ఉందా? ఉంటే లాభ నష్టాలు తెలుసుకోవాలి. అదే వ్యాపారం చేస్తున్న వాళ్ల సూచనలు తీసుకోవాలి.
- మీ వ్యాపారంలో అందించే సేవలు కొత్తగా ఉండేలా చూసుకోవాలి.
- ఉద్యోగం చేస్తున్న వారు లాభ నష్టాలు బేరీజు వేసుకొని ఉద్యోగం మానేయడం మంచిది.
- అప్పు చేసి వ్యాపారం ప్రారంభించడం మంచిది కాదు. ఎందుకంటే వ్యాపారం సాగినా, సాగకపోయినా తీసుకున్న అప్పునకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. కొన్నాళ్లకు వడ్డీ పెరిగి తలకు మించిన భారమవుతుంది.

## ఎక్కువ వినాలె!



**చాలామంది తమ గురించి తాము గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు. ఎదుటి వాళ్లు ఏం చెప్పినా వినరు. ఈ చిన్న చిట్కాలు పాటిస్తే ఏ పరిచయమైనా జీవితాంతం కొనసాగుతుంది.**

- ఎవరితో అయినా మాట్లాడుతున్నప్పుడు వాళ్లు చెప్పేది శ్రద్ధగా వినాలి. మధ్యమధ్యలో వాళ్లు చెప్పే విషయానికి సంబంధించి ప్రశ్నలు అడుగుతూ ఉండాలి.
- ఎదుటివారు మాట్లాడుతున్నప్పుడు శ్రద్ధగా వింటే వారికి మీపై గౌరవం పెరుగుతుంది. వారి జీవితానుభవాల నుంచి, ఆలోచనల నుంచి ఎన్నో తెలియని విషయాల్ని తెలుసుకునే అవకాశం ఉంటుంది.
- అవతలి వ్యక్తి మీ గురించి తెలుసుకోవడానికి ఆసక్తి కనబరిచినప్పుడు పూర్తి నిజాయితీగా మీగురించి చెప్పాలి. అంతేగానీ వారు మాట్లాడుతున్నప్పుడల్లా మధ్యలో మీ ప్రస్తావన తీసుకురావడం మంచిది కాదు.
- చాలామంది మాట్లాడుతున్న సమయాల్లో దిక్కులు చూస్తూ.. గోళ్లు నములుతూ.. వెంట్రుకలను సరిచేసుకుంటూ కనిపిస్తుంటారు. ఇలా చేస్తున్నారంటే ఎదుటివాళ్లకు ఆ విషయంపై ఆసక్తి లేదని గమనించాలి.
- ఎదుటివాళ్లు తాము ఎదుర్కొన్న విషయల్ని చెప్పినప్పుడు వాళ్లను హేళన చేయడం, తక్కువ చేసి చూడడం సరికాదు. ప్రతిమనిషిలోనూ మంచి, చెడు ఉంటుంది. చెడు అనిపించినప్పుడు సున్నితంగా మందలించవచ్చు.

## శ్వేతవర్ణ దంపతులు



సెలబ్రిటీల లిస్టులో ప్రియాంక, నిక్ జోనస్‌ల పేర్లు ఎప్పుడూ ముందుంటాయి. ఈ దంపతులిద్దరూ తెల్లని దుస్తులు ధరించి ఇటీవల అంబానీ నివాసంలో జరిగిన హోలీ వేడుకలో పాల్గొన్నారు. ఇందులో చాలామంది సెలబ్రిటీలు పాల్గొనగా ఈ జంట ప్రత్యేకం. అమీ పటేల్ రూపొందించిన ఎగ్‌షెల్ కలర్ అనార్కలి, పాలాజ్జోస్ డ్రెస్‌లో ప్రియాంక కనిపించింది. దీనికి ఎంబ్రాయిడరీ వర్క్ చేశారు. ప్రియాంక డ్రెస్ కింది భాగంలో ఫ్రిల్స్ జతచేయడంతో మరింత అందం చేకూరింది. దుపట్టా, ప్యాంటు కాంబినేషన్ అదిరింది. క్లాస్సి కుర్తా-పైజామా సెట్‌లో నిక్ కనిపించాడు. నిక్ చేతికి రిచార్డ్ మిల్లే వాచ్ ఉంది. ఈ వాచ్ చాలా అరుదుగా దొరుకుతుంది. వీరిద్దరి డ్రెస్‌లో కామన్‌గా పసుపు, పింక్ కలర్స్‌తో డిజైన్ చేశారు. వేర్వేరు బ్రాండ్ల తయారీ నుంచి ఎల్లోకలర్ ఫుట్‌వేర్ ధరించారు. వీరి హోలీ సంబురాల ఫొటోలు ఇప్పుడు బాగా వైరల్‌గా మారాయి.

### మృతకణాలు తొలగాలంటే..



- ముఖానికి సబ్బులు, క్రీమ్‌లకంటే సున్ని పిండి చాలా మంచిది. చర్మంలోని మృతకణాలను చంపేస్తుంది.
- సూర్యకిరణాలకు చర్మంపై టాన్ ఏర్పడుతుంది. దీనికి గంధం పొడి, రోజ్‌వాటర్, నిమ్మరసం కలిపి ముఖానికి రాయలి. అరగంట తర్వాత కడుగాలి.




# నవజాత శిశువుకు భరోసా

**ప్రపంచంలో జరిగే ప్రతీ ఆవిష్కరణ వెనుకా ఓ సంఘర్షణ ఉంటుంది. సమస్యకు పరిష్కారాన్ని ఆలోచించే దిశలో ఎన్నో నిద్రలేని రాత్రులు ఆవిరైపోతుంటాయి. ఈ దారిలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా, పట్టువిడువకుండా కొత్త ఆలోచనలతో ముందుకెళ్లేవారే ఆవిష్కర్తలుగా చరిత్రలో నిలిచిపోతారు. ఆ కోవలో మన తెలంగాణ ఆడబిడ్డ ప్రత్యూష పారెడ్డి ఒకరు. నవజాత శిశువుల మరణాలను తగ్గించడం కోసం ఆమె చేసిన నూతన ఆవిష్కరణ వైపు ఇప్పుడు ప్రపంచ దేశాలు చూస్తున్నాయి.**



**ప్రతియేటా** పది లక్షలమంది నవజాత శిశువులు ప్రీమెచ్యూరిటీ కారణంగా చనిపోతున్నారు. అలాగే 4 లక్షల మంది నవజాత శిశువులు సెప్సిస్, ఇతర ఇన్ఫెక్షన్ల కారణంగా కన్నుమూస్తున్నారు. ఇక ఏటా 9 లక్షల మంది ఐదేండ్లలోపు చిన్నారులు న్యుమోనియా కారణంగా మరణిస్తున్నారు. అందుకే ప్రత్యూష పారెడ్డి ఓ కొత్త ఆవిష్కరణ చేసింది. అదే 'స్మార్ట్‌బేబీ మానిటర్'. దీంతో శిశు మరణాల రేటు తగ్గించడానికి భారతావనితో పాటు.. ప్రపంచానికి కూడా భరోసా ఇస్తున్నది ప్రత్యూష పారెడ్డి. ఈమె చేసిన ఈ నూతన ఆవిష్కరణకు ఎన్నో అవార్డులు రాగా.. తాజాగా ప్రతిష్ఠాత్మకమైన 'నీతి ఆయోగ్' అవార్డు కూడా వరించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నీతి ఆయోగ్‌లోని 'మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వేదిక'(డబ్ల్యూఈపీ) నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు ప్రత్యూష పారెడ్డి.

**'స్మార్ట్‌బేబీ మానిటర్' గురించి..**
ఓ శిశువు జననం ఎంతో ఆనందం నింపుతుంది. వారికి ఏదైనా సమస్య ఉందని తెలిస్తే.. అంతకు రెట్టింపు వేదన కలుగుతుంది. అప్పుడే పుట్టిన పిల్లల్లో ఒక్కోసారి గుండె కొట్టుకోవడంలో తేడా రావొచ్చు. ఉష్ణోగ్రతలు పడిపోవచ్చు, పెరగొచ్చు. కొందరికి శరీరం నీలిరంగులోకి మారిపోతుంటుంది. ఇలాంటి సమస్యలకి వెంటనే చికిత్స అందించాలి. దానికి పరిష్కారంగా 'స్మార్ట్ బేబీ మానిటర్' అనే సరికొత్త పరికరాన్ని ఆవిష్కరించారు ప్రత్యూష పారెడ్డి. చూడ్డానికి ఇదో చిన్న బ్యాండులా ఉంటుంది. పిల్లల కాళ్లకు/చేతులకు తొడిగితే సరిపోతుంది. డీప్ లెర్నింగ్ ఆల్గారిథం సాయంతో శిశువులో లోపాన్ని కనిపెడుతుందీ పరికరం. ఈ డివైజ్ ఒకేసారి శిశువులందరి డేటా కలెక్ట్ చేసి నర్సింగ్ స్టేషన్‌కు పంపుతుంది. దీనివల్ల పిల్లల పరిస్థితిని ఒకే ఇంటర్ ఫేస్ ద్వారా తెలుసుకొనే వీలు కలుగుతుంది. ఏ శిశువైనా అప్నియా, హైపోథెర్మియా లక్షణాలతో బాధపడుతుంటే, నర్సింగ్ స్టేషన్లో ఆడియో, విజువల్ అలారం మోగుతుంది. చిన్నపిల్లల్లో 35 డిగ్రీల కంటే ఉష్ణోగ్రత పడిపోతుంటుంది. దీన్ని 'హైపోథెర్మా' అంటారు. పిల్లలు గుక్క పెట్టినప్పుడు ఒక్కోసారి శ్వాస అందక ఇబ్బంది పడతారు. దీని 'అప్నియా' అంటారు. వీటిని పసిగడుతుందీ పరికరం.




**తక్కువ ఖర్చుకే అందుబాటులోకి..**

ప్రత్యూష పారెడ్డి, మనోజ్ శంకర్ ద్వయం రూపొందించిన ఈ 'స్మార్ట్‌బేబీ మానిటర్, ఇతర ఆరోగ్య పరికరాలు' తక్కువ ఖర్చుకు మార్కెట్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం స్మార్ట్‌బేబీ మానిటర్ పరికరం సైజును తగ్గించే పనిలో ఉన్నారు ప్రత్యూష. నవజాత శిశువుల సమస్యలు తెలుసుకునేందుకు నాలుగేండ్ల నుంచి ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. వాటి ఫలితంగానే స్మార్ట్‌బేబీ మానిటర్‌ను రూపొందించారు. ఇది చౌకైన స్మార్ట్ వేరబేల్. యూనిక్ కాంబినేషన్‌తో కూడా మెడికల్ గ్రేడ్ సెన్సర్లు నిరంతరం శిశువులను పర్యవేక్షిస్తుంటాయి. నవజాత శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించే విప్లవాత్మక మార్పుల్లో ఇదొకటి. అతి త్వరలోనే ఇవి అన్ని ఈ-కామర్స్ వెబ్‌సైట్స్‌లో అందుబాటులోకి రానున్నాయి.

**ఎవరీ ప్రత్యూష పారెడ్డి?**
'స్మార్ట్‌బేబీ మానిటర్' రూపకర్త అయిన ప్రత్యూష పారెడ్డిది హైదరాబాద్. ఈమెది ఇంజినీరింగ్ నేపథ్యం. కానీ డిజైనింగ్‌పై ఆసక్తితో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో చేరారు. గ్రామాల్లో నొప్పులొచ్చిన గర్భిణుల్ని ఆసుపత్రికి తీసుకువెళ్లలేక పడే ఇబ్బందుల్ని గమనించి 'ప్రత్యేక స్ట్రెచర్' తయారుచేశారు. ఆ తర్వాత ఫిలిప్స్ వంటి బడా సంస్థల కోసం యాప్‌లూ రూపొందించారు. మళ్లీ వైద్య అవసరాలవైపే మొగ్గుచూపి, ఐఐటీ-హైదరాబాద్ అందించిన 'సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' ఫెలోషిప్‌లో చేరారు. అప్పటి నుంచి రోగుల అవసరాలకు తగ్గ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ పరికరాల రూపకల్పనపై అధ్యయనం చేశారు. అందులో భాగంగానే నవజాత శిశువుల మరణాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు ప్రత్యూష. ఈ క్రమంలో తన కొలీగ్ మనోజ్ శంకర్‌తో కలిసి తెలంగాణలోని ఆస్పత్రుల్లో అధ్యయనం చేసి, శిశు మరణాలకు పరిష్కారంగా ఈ పరికరాన్ని రూపొందించారు. 'నెమో కేర్' అనే సంస్థను స్థాపించి కొత్త ఆరోగ్య పరికరాలకు రూపకల్పన చేస్తున్నారు ప్రత్యూష, శంకర్ మనోజ్.

...✍ దప్పు రవి

# కరోనాపై అలర్ట్


విజయ్ దేవరకొండ

ప్రస్తుతం కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వాలన్నీ సమాయత్తమవుతున్నాయి. కరోనాపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు పలు రక్షిత చర్యలు చేపడుతున్నాయి. ఈ వైరస్ పట్ల ప్రజల్ని అప్రమత్తం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో యువ కథానాయకుడు విజయ్‌దేవరకొండతో ఓ వీడియోను రూపొందించింది. ఇందులో ఆయన కరోనాను అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. 'కరోనా గురించి భయపడాల్సిన అవసరం లేదు. చిన్న చిన్న జాగ్రత్తలతో నివారించవచ్చు. పద్ధతిగా నమస్కారం పెట్టండి. షేక్‌హ్యాండ్ వద్దు. తరచుగా చేతిని సబ్బుతో కడుక్కోండి. మీ కళ్లు, ముక్కు, నోరు, చెవిని చేతితో తాకకండి. ఎవరైనా దగ్గుతూ, తుమ్ముతూ ఉంటే వారికి మూడు అడుగులు దూరంగా ఉండండి. రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండండి. కరోనా వైరస్‌ను అరికట్టాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ఎవరిలోనైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే 104కు ఫోన్ కాల్ చేయండి' అని ఈ వీడియోలో విజయ్ దేవరకొండ పేర్కొన్నారు.

# హృద్యమైన ప్రేమకథ


నాగచైతన్య, సాయిపల్లవి

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'లవ్‌స్టోరీ'. శేఖర్ కమ్ముల దర్శకుడు. నారాయణ్‌దాస్ కె నారంగ్, పి.రామ్మోహన్ రావు నిర్మాతలు. హోలీ సందర్భంగా సినిమాకు సంబంధించిన కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. హీరో చైతూని సాయిపల్లవి టీజ్ చేస్తున్న ఈ ఫొటో అభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. 'ఏయ్ పిల్లా..' సాంగ్ ప్రివ్యూకు మంచి స్పందన లభించింది. పూర్తి లిరికల్ వీడియోను నేడు విడుదల చేయబోతున్నాం' అన్నారు.


అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ మంగళ వారం కుటుంబ సభ్యులతో హోలీ జరుపుకున్నారు. ఈ సందర్భంగా సతీమణి ప్రణతి, కుమారులు అభయ్‌రామ్, భార్గవ్‌రామ్‌లతో కలిసి తీయించుకున్న సెల్ఫీని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

# ప్రభాస్ జోడీగా

'బాహుబలి' సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపును సొంతం చేసుకున్నారు ప్రభాస్. అతడితో నటించేందుకు బాలీవుడ్ అగ్ర తారలు సైతం ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. తాజాగా ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో పాన్ ఇండియన్ చిత్రం తెరకెక్కబోతున్నది. ఇటీవలే ఈచిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. ఈ సినిమాలో ప్రభాస్‌కు జోడీగా కత్రినాకైఫ్ నటించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. బాలీవుడ్ నాయికను హీరోయిన్ తీసుకోవాలని భావించిన చిత్రబృందం కత్రినాకైఫ్ పేరును పరిశీలిస్తున్నట్లుగా తెలిసింది. సైన్స్ ఫిక్షన్ కథాంశంతో దాదాపు నాలుగు వందల కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా రూపుదిద్దుకోనున్నట్లు చెబుతున్నారు. వైజయంతీ మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనున్నది. ఇదివరకు తెలుగులో 'అల్లరి పిడుగు', 'మల్లీశ్వరి' చిత్రాల్లో నటించింది కత్రినా.

**యూరప్‌లో ప్రభాస్**

ప్రభాస్ కథానాయకుడిగా రాధాకృష్ణకుమార్ దర్శకత్వంలో ఓ పీరియాడికల్ లవ్‌స్టోరీ తెరకెక్కుతున్నది. యూవీ క్రియేషన్స్, గోపీకృష్ణమూవీస్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. పూజాహెగ్డే కథానాయికగా నటిస్తున్నది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ యూరప్‌లో జరుగుతున్నది. ప్రభాస్‌తో పాటు అంతర్జాతీయ నటీనటులు, సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో ఓ ఛేజింగ్ సీక్వెన్స్‌ను పూర్తిచేసినట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. యూరప్‌లో మరో లాంగ్ షెడ్యూల్‌ను చిత్రీకరించబోతున్నట్లు పేర్కొన్నారు. ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న ఇరవయ్యవ చిత్రమిది. ఈ సినిమాకు 'జాన్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


కత్రినాకైఫ్


తమన్నా

# ముద్దుకు ఓకే!

పంజాబీ సోయగం తమన్నాను అభిమానులు మిల్కీబ్యూటీ అంటూ ప్రేమగా పిలుచుకుంటారు. పాలకడలిలో స్నానమాడి అప్పుడే భువిపై అరుదెంచిన అందాల రాశి అంటూ కితాబిస్తుంటారు. కెరీర్ ఆరంభం నుంచి నేటి వరకు వన్నెతరగని అందంతో వెలిగిపోతోంది ఈ అమ్మడు. అయితే సీనియర్ కథానాయికలకు ఇప్పుడు ఎక్కడకు వెళ్లినా పెళ్లి గురించిన ప్రశ్నలే ఎదురవుతున్నాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తమన్నాను ఇదే ప్రశ్న అడగ్గా ఈ భామ చెప్పిన సమాధానం అందర్నీ ఆశ్చర్యపరచింది. పెళ్లి గురించి కుటుంబ సభ్యులు ఎలాంటి ఆలోచన చేయడం లేదని స్పష్టత నిచ్చిన ఈ సుందరి సమయం వచ్చినప్పుడు ఏదైనా జరుగుతుందని చెప్పింది. మీకు స్వయంవరం ఏర్పాటు చేస్తే ఏ హీరోలు రావాలని కోరుకుంటున్నారని అడిగినప్పుడు..ప్రభాస్, హృతిక్‌రోషన్, విక్కీకౌశల్ అంటూ సమాధానమిచ్చింది. మరో విషయమేమింటే తమన్నా ఏ సినిమాలోను ముద్దు సన్నివేశాల్లో నటించలేదు. అలాంటి ఇంటిమేట్ సీన్స్‌లో నటించనని ముందస్తు ఒప్పందాన్ని కుదుర్చుకుంటుంది. ఇదే విషయం గురించి మాట్లాడుతూ 'నేను తెరపై ముద్దు సన్నివేశాల్ని అంగీకరించను. ఆ నియమాన్ని స్ట్రిక్ట్‌గా ఫాలో అవుతా. అయితే నా పక్కన హృతిక్ ఉంటే మాత్రం తప్పకుండా ముద్దుకు అంగీకరిస్తా' అని చెప్పింది. ఆమె వ్యాఖ్యలు ఇప్పుడు ఆమె అభిమానుల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.

# ఐదేళ్లు విరామం తీసుకున్నా


బాలాదిత్య

'జీవితంలో చదువు ముఖ్యమని అమ్మ చెప్పిన మాటకు కట్టుబడి ఐదేళ్లపాటు సినిమాలకు దూరమయ్యాను. ఈ విరామంలో నేను ఇండస్ట్రీ వదిలి విదేశాలకు వెళ్లిపోయాననే అపోహలు వచ్చాయి' అని అన్నారు బాలాదిత్య. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అన్నపూర్ణమ్మ గారి మనవడు'. నర్రా శివనాగేశ్వరరావు దర్శకుడు. ఎం.ఎన్.ఆర్ చౌదరి నిర్మిస్తున్నారు. త్వరలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది. బాలాదిత్య పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఈ సినిమాలో తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన అమృత, ప్రణయ్ ప్రేమకథ స్ఫూర్తితో దర్శకుడు శివనాగు నా పాత్రను సృష్టించారు. నిడివి తక్కువైనా కథాగమనంలో కీలకంగా ఉంటుంది. ప్రస్తుతం టీవీ, సినిమాలకు మధ్య అంతరం తగ్గింది. ఎక్కడైనా కెమెరా ముందు నటించాల్సిందే. ఆ ఆలోచనతోనే తమిళంలో ఓ సీరియల్‌లో నటిస్తున్నాను' అన్నారు.

# రొమాంటిక్ ఎంటర్‌టైనర్

'ఏబీసీడీ' తర్వాత కొంత విరామం తీసుకున్న అల్లు శిరీష్ త్వరలో కొత్త సినిమా మొదలుపెట్టబోతున్నారు. ఆయన కథానాయకుడిగా 'విజేత' ఫేమ్ రాకేష్ శశి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. న్యూఏజ్ రొమాంటిక్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం రూపుదిద్దుకోనున్నట్లు తెలిసింది. ఈ సినిమాలో అల్లు శిరీష్‌కు జోడీగా అను ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు తెలిసింది.


అల్లు శిరీష్

# ప్రేమకు బానిస..


రామకృష్ణ

'విద్యార్థి దశ నుంచి పరిణితి చెందేవరకు ఓ వ్యక్తి జీవితంలో చోటుచేసుకున్న భిన్నమైన ప్రేమకథల సమాహారమిది' అని అన్నారు పి.ఎస్.రామకృష్ణ. ఆయన నిర్మించిన చిత్రం 'ప్రేమపిపాసి'. జీపీఎస్, కపిలాక్షి మల్హోత్రా, సోనాక్షివర్మ నాయకానాయికలు. మురళీరామస్వామి దర్శకుడు. ఈ నెల 13న విడుదలకానుంది. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ప్రేమకు అడిక్ట్‌గా మారిన ఓ యువకుడి జీవితగమనంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయన్నది ఆకట్టుకుంటుంది. కథానుగుణంగా బోల్డ్‌గా ఈ సినిమాను తెరకెక్కించాం. ఇందులో పన్నెండు లిప్‌లాక్‌లుంటాయి. బాలీవుడ్‌లో ఇమ్రాన్‌హష్మీ మాదిరిగా జీపీఎస్‌కు లిప్‌లాక్‌ల హీరోగా పేరుతెచ్చిపెడుతుంది. ప్రేమలోని నిజాయితీని చాటిచెప్పే సినిమా ఇది. ప్రేమ పట్ల అమ్మాయిలు, అబ్బాయిల దృక్కోణం ఎలా ఉంటుందో దర్శకుడు మురళీ రామస్వామి నవ్యరీతిలో ఆవిష్కరించారు. దాదాపు వందకుపైగా థియేటర్లలో సినిమాను విడుదలచేస్తున్నాం. కన్‌స్ట్రక్షన్ వ్యాపారం నాది. సినిమాలపై ఆసక్తితో గతంలో 'ఇంతే' అనే లఘు చిత్రాన్ని నిర్మించాను. నిర్మాతగా ఇదే నా తొలి సినిమా. మా సంస్థ ద్వారా భవిష్యత్తులో కథాబలమున్న మరిన్ని మంచి చిత్రాల్ని నిర్మిస్తాను' అని తెలిపారు.


కెవీ రెడ్డి, రాజ్ కందుకూరి, రాజేంద్రన్

# ఒక ఏనుగు కథ

పి.కె.ఎన్ క్రియేషన్స్ పతాకంపై కె.వి.రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ' పోయే ఏనుగు పో'. ఎం.రాజేంద్రన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్, బ్యానర్ లోగోలను నిర్మాత రాజ్ కందుకూరి విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'టైటిల్ కొత్తగా ఉంది. మంచి కథ, మాటలతో దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లుగా కనిపిస్తున్నది' అని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ఏనుగు, చిన్న పిల్లల మధ్య జరిగే కథ ఇది. కుటుంబ విలువలతో రూపొందించాం. భీమ్స్ సిసిరోలియో చక్కటి బాణీలను అందించారు. త్వరలో తెలుగు, తమిళ భాషల్లో సినిమాను విడుదలచేస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: అమర్.జి, కథ: అరవింద్ కేశవన్.


కియారా అద్వానీ

# అతడే.. చెలికాడు

మీ జతగాడిలో ఎలాంటి లక్షణాలు ఉండాలని కోరుకుంటారని అడిగితే...కొందరు నాయికలు ముక్తసరిగా సమాధానమిస్తారు. మరికొందరేమో చాంతడంతా లిస్ట్‌ను చదివేస్తారు. బాలీవుడ్ ముద్దుగుమ్మ కియారా అద్వాణీ రెండో రకం. ఇటీవల ఓ మీడియా సమావేశంలో ఈ అమ్మడికి ఇదే ప్రశ్న ఎదురైంది. ఆమె పేర్కొన్న లక్షణాలు విని...అసలు ఇలాంటి యువకులు ఈరోజుల్లో దొరకడం సాధ్యమా అంటూ ఆశ్చర్యపోయారట. ఇంతకి ఈ సుందరి ఏం చెప్పిందంటే..'అన్నింటికంటే ఆ వ్యక్తిలో విధేయత ఉండాలని కోరుకుంటా. నన్ను బాగా నవ్వించగలగాలి. నా జోక్స్‌కు తానూ నవ్వాలి. వారసత్వంగా వచ్చిన ఆస్తులతో కాకుండా స్వయంకృషితో ఎదిగినవాడై ఉండాలి. ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా దయార్థ్రహృదయాన్ని ప్రదర్శించాలి' అంటూ నాన్‌స్టాప్‌గా సదరు చెలికాడి లక్షణాల్ని వల్లెవేసింది. చివరగా అన్నింటి కంటే అతగాడిలో నిజాయితీ ముఖ్యమని, అది కొరవడితే ఎన్ని ఉత్తమ లక్షణాలున్నా వృథాయే అంటూ ముక్తాయింపునిచ్చింది. ప్రస్తుతం ఈ సుందరి హిందీలో షేర్షా, లక్ష్మీ బాంబ్, ఇందూ కి జవానీ, భూల్‌భులయ్యా-2 చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. 'షేర్షా' కథానాయకుడు సిద్ధార్థ మల్హోత్రాతో ఈ వయ్యారి ప్రేమలో ఉందని బాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే వీటిపై మాట్లాడటానికి ఈ సుందరి సున్నితంగా తిరస్కరించింది.



# కల తీరేనా!

## నేటి నుంచి ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

### టైటిల్ లక్ష్యంగా బరిలో సింధు, సైనా

### ఒలింపిక్స్ అర్హతకు కీలకంగా టోర్నీ

**ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ కల భారత షట్లర్లను ఊరిస్తూనే ఉంది. రెండు దశాబ్దాలుగా అందని ద్రాక్షగా మారిన టైటిల్‌ను ఈసారైనా ఒడిసిపట్టుకునేందుకు మన షట్లర్లు సిద్ధమయ్యారు. ఫామ్‌లేమితో సతమతమవుతున్న సింధుతో పాటు గాయాలతో ఇబ్బంది పడుతున్న సైనా తిరిగి పుంజుకోవాలన్న పట్టుదలతో ఉంది. టోక్యో ఒలింపిక్స్ అర్హతకు ఈ టోర్నీకి కీలకం కావడంతో పోరు రసవత్తరంగా సాగే అవకాశముంది.**



**బర్మింగ్‌హామ్:** గతేడాది ప్రపంచ చాంపియన్‌గా అవతరించిన తర్వాత ఒక్క టైటిల్ కూడా గెలువలేకపోయిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటాలని పట్టుదలగా ఉంది. ఒలింపిక్స్ అర్హత కోసం శ్రమిస్తున్న సైనా నెహ్వాల్, శ్రీకాంత్ ఈ టోర్నీలో అదరగొట్టాలని ఆశిస్తున్నారు. ఈ సీజన్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ అయిన ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఓపెన్ బుధవారం ఇక్కడ ప్రారంభం కానుంది. ఇప్పటికే టోక్యో ఒలింపిక్స్ బెర్త్‌ను దాదాపు పక్కా చేసుకున్న తెలుగమ్మాయి సింధు ఆల్ ఇంగ్లండ్ టైటిల్ గెలిచిన తొలి భారత మహిళా షట్లర్‌గా నిలువాలని ఉవ్విళ్లూరుతున్నది. 2018లో ఈ టోర్నీలో సెమీస్ చేరిన ప్రపంచ ఆరో ర్యాంకర్ సింధు.. ఈసారి మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో బివాన్ జెంగ్(అమెరికా)తో పోటీని ఆరంభించనుంది.

**మధ్యాహ్నం 2.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం**

### శ్రీకాంత్‌కు కఠిన పోటీ

పురుషుల విభాగంలో టోక్యో టికెట్ దక్కించుకోవాలని పట్టుదలగా ఉన్న భారత షట్లర్ శ్రీకాంత్... ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ ఆదిలోనే తన కంటే మెరుగైన ర్యాంకు ప్రత్యర్థిని ఎదుర్కోనున్నాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో శ్రీకాంత్.. ఒలింపిక్ చాంపియన్, మూడో సీడ్ చెన్ లాంగ్(చైనా)ను ఢీకొననున్నాడు. ఇప్పటికే ఒలింపిక్స్‌లో చోటు దాదాపు ఖరారు చేసుకున్న ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సాయి ప్రణీత్ తొలి రౌండ్‌లో జ్వాజున్ పెంగ్(చైనా)తో తలపడనుండగా... హిరెన్ రుస్టావిటో(ఇండోనేషియా)తో కశ్యప్ పోటీ పడనున్నాడు. భారత యువ కెరటం లక్ష్యసేన్ తొలిసారి ఈ టోర్నీలో అడుగు పెడుతున్నాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి జోడీ తొలి రౌండ్లో టాప్ సీడ్ మార్కస్ గిడిన్ - సంజయ సుకముల్జో(ఇండోనేషియా) ద్వయంతో తలపడనుంది. మహిళల డబుల్స్‌లో ఎన్.సిక్కిరెడ్డి - అశ్వినీ పొన్నప్ప జోడీ పోటీలో ఉంది.

### ఇప్పటి వరకు ఇద్దరే..

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చరిత్రలో ఇప్పటి వరకు ఇద్దరు భారత షట్లర్లు మాత్రమే విజేతలుగా నిలిచారు. 1980లో పురుషుల సింగిల్స్‌లో దిగ్గజ ప్లేయర్ ప్రకాశ్ పదుకొనే టైటిల్ సాధించాడు. ఆ తర్వాత ప్రస్తుత జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ 2001లో విజేతగా నిలిచాడు. 2015 టోర్నీ మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ ఫైనల్ చేరినా మారిన్(స్పెయిన్) చేతిలో ఓడింది.

### కరోనా ఆందోళన

బ్రిటన్‌లోనూ కరోనా వైరస్ వ్యాపిస్తుండటంతో తొలుత టోర్నీ నిర్వహణే సందిగ్ధంలో పడింది. అయితే ఒలింపిక్స్ క్వాలిఫికేషన్‌లో ముఖ్యం కావడంతో టోర్నీ జరిపేందుకే నిర్వాహకులు మొగ్గు చూపారు.



### ఒలింపిక్స్ లక్ష్యంగా..

మరోవైపు టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించడాన్నే లక్ష్యంగా నిర్దేశించుకున్న హైదరాబాదీ షట్లర్ సైనా నెహ్వాల్ కీలకమైన ఈ టోర్నీలో తప్పక రాణించాలని భావిస్తున్నది. అయితే మూడో సీడ్ అకానే యమగూచి(జపాన్) రూపంలో తొలి రౌండ్‌లోనే 2015 రన్నరప్ సైనాకు కఠిన ప్రత్యర్థి ఎదురైంది. ఈ ఏడాది జరిగే విశ్వక్రీడల్లో చోటు దక్కించుకోవాలంటే అర్హత వ్యవధి ఏప్రిల్ 28వ తేదీ ముగిసేలోగా టాప్-16లో షట్లర్లు ఉండాల్సిందే. ఇంగ్లండ్ పోటీలో విజేతగా నిలిస్తే 12వేల ర్యాంకింగ్ పాయింట్లు రానున్న నేపథ్యంలో ప్లేయర్లందరూ ఈ టోర్నీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ప్రస్తుతం ఒలింపిక్ క్వాలిఫికేషన్‌లో సైనా 22వ ర్యాంకులో ఉంది.

### హోలీ.. రంగుల కేళి

మంగళవారం హోలీ పండుగ సందర్భంగా రంగులు అద్దుకున్న ధవన్, హార్దిక్, కృనాల్ పాండ్యా కుటుంబ సభ్యులు





## ఫైనల్లో వికాస్, సిమ్రన్

### మేరీ, అమిత్‌కు కాంస్యాలు




**అమన్(జోర్డాన్):** ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భారత బాక్సర్లు వికాస్ కృష్ణన్(69కేజీలు), సిమ్రన్‌జిత్ కౌర్(60కేజీలు) తుదిపోరుకు దూసుకెళ్లగా.. సెమీస్‌లో ఓడిన దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్(51కేజీలు), ప్రపంచ అగ్రర్యాంకర్ అమిత్ పంగల్(52కేజీలు),ఆశీష్ కుమార్ (75 కేజీలు),లవ్లీనా (69కేజీలు), పూజా రాణి(75కేజీలు) కాంస్యాలతో సరిపెట్టుకున్నారు. మంగళవారం జరిగిన మహిళల సెమీస్‌లో సిమ్రన్ 4-1తేడాతో షియూ వూ(తైవాన్)పై గెలువగా.. మేరీ 1-4తేడాతో చాంగ్ యున్(చైనా) చేతిలో ఓడింది. పురుషుల సెమీస్‌లో వికాస్ కృష్ణన్ 3-2తేడాతో అబ్లిఖాన్ జుసుపోవ్(కజకిస్థాన్)పై గెలిచాడు. ఫైనల్లో ఇషియా హుసేన్(జోర్డాన్)తో తలపడనున్నాడు.

## అర్పిత్ శతకం

**సౌరాష్ట్ర 384/8**

**రాజ్‌కోట్:** టీమ్‌ఇండియా టెస్టు స్టార్ చతేశ్వర్ పుజారా(237బంతుల్లో 66పరుగులు) తన మార్క్ ఇన్నింగ్స్ ఆడడం సహా అర్పిత్ వసవాడ(287బంతుల్లో106పరుగులు) శతకంతో రాణించడంతో రంజీ ట్రోఫీ ఫైనల్లో బెంగాల్‌పై సౌరాష్ట్ర పైచేయి సాధించింది. ఐదు వికెట్లకు 206పరుగుల తొలి ఇన్నింగ్స్ ఓవర్‌నైట్ స్కోరుతో మంగళవారం ఇక్కడ రెండో రోజు ఆటను సౌరాష్ట్ర కొనసాగించగా.. పుజార, అర్పిత్ సుదీర్ఘ బ్యాటింగ్‌తో బెంగాల్ బౌలర్లకు చెమటలు పట్టించారు. దీంతో రోజంతా బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు మరో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 178 పరుగులు చేసింది. 8వికెట్లకు 384 రన్స్ వద్ద సౌరాష్ట్ర రోజును ముగించగా.. క్రీజులో చిరాగ్ జైన్(13 నాటౌట్), ధర్మేంద్ర జడేజా(13నాటౌట్) ఉన్నారు. పుజారా, అర్పిత్ ఆరో వికెట్‌కు 380 బంతుల్లో 142పరుగులు జతచేశారు.





## పాక్ జెర్సీపై ధోనీ పేరు

**లాహోర్:** అభిమానానికి హద్దులు లేవంటారు. అవును క్రికెట్ అంటే పడిచచ్చే ఉపఖండంలోనైతే మరీను. తనదైన ఆటతీరు, నాయకత్వశైలితో రాణించిన ధోనీని అభిమానించే వాళ్లు భారత్‌లోనే కాదు పాకిస్థాన్‌లోనూ ఉన్నారు. సరిహద్దులు వేరైనా..అభిమానానికి అవి అడ్డురావని పాక్‌కు చెందిన షెహజాద్ ఉల్ హసన్ నిరూపించాడు. పీఎస్‌ఎల్‌లో ఇస్లామాబాద్ జట్టుకు మద్దతు పలుకుతున్న షెహజాద్..స్టేడియానికి ధోనీ పేరు ఉన్న పాక్ జెర్సీ ధరించి వచ్చాడు. ఇది ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 'స్టేడియంలో భాయ్..! స్టాండ్స్ పూర్తిగా నిండిపోయాయి. ఇస్లామాబాద్‌కు నా పూర్తి మద్దతు. పీఎస్ఎల్‌లో ధోనీని మిస్ అవుతున్నాం' అంటూ ట్వీట్ చేశాడు.










Call: 72198 21111
www.bajajauto.com

*ఎక్స్-షోరూమ్ ధర తెలంగాణ - పల్సర్ 125 డిస్క్ బ్రేక్ రకం. **సూచించిన అంకె పల్సర్ 125 డిస్క్ బ్రేక్ రకానికి BS4 మరియు BS6 రకాల మధ్యలోగల ధర తేడా. BS4 స్టాక్స్ ఉన్నంత వరకు, ఇతర బజాజ్ మోడల్స్‌కి కూడా ధర తేడా వర్తిస్తుంది. ఎంపికచేసుకున్న మోడల్ ప్రకారం ధర తేడా మారవచ్చు. #పల్సర్ 125కి లెక్కించిన డౌన్ పేమెంట్, మార్చి 31, 2020 వరకు వర్తిస్తుంది. ఇతర బజాజ్ మోడల్స్‌కి కూడా డౌన్ పేమెంట్ దొరుకుతుంది. వర్తించే విధంగా డీసీసీ మరియు ప్రాసెసింగ్ ఫీ అదనం. క్రెడిట్ ప్రమాణాలకు లోబడి. ##అన్ని బజాజ్ బైక్స్ పైన 5 సంవత్సరాల వారంటీ లభ్యం. ఋణ సదుపాయం పూర్తిగా ఋణసదుపాయం అందించేవారి విచక్షణ మేరకు ఉంటుంది. ముందు సూచన ఇవ్వకుండానే ఏదైనా లేదా అన్ని ఆఫర్స్‌ని సవరించే లేదా విరమించుకునే హక్కు బజాజ్ ఆటోకు ఉంటుంది. నియమాలు మరియు నిబంధనలు వర్తిస్తాయి.

Authorised Dealers For Bajaj Auto Ltd.: Karimnagar STANDARD BAJAJ 08782-276545, 9848576545, VENKAT BAJAJ 9703614888, 8008796695 • Mancherial MAHI BAJAJ 08736-259088 ,9912278641 • Adilabad SRR MOTORS 9491249451,9491159452. Authorised Service Centre: JAGITIAL 8522038460, 9949565692, SIRICILLA 8309314141, METPALLY 9866766607, KORUTLA 9440653412, HUZURABAD 9440682444, VEMULAWADA 9866838847, PEDDAPALLY 9849362096, ARMOOR 9866669181, Balkonda 9059412880, Banswada 6305184613, Nandipet 9493021116, BODHAN 9440414119, KAMAREDDY 9849852992, Kamarpally 9010686085, BHEEMGAL 9912334501, RAMAGUDAM 9912278650, JANNARAM 9440004495, BELLAMPALLI 9849686258, KAGAZNAGAR 9491344501, ASIFABAD 9440838208 CHENNUR 9949993645, NIRMAL 9912663515, BHAINSA 8341437171, KHANAPUR 9440229720, KADEM 9440586978, NIRMAL 9491777000, GAJWEL 9848347349, MEDAK 7702014433, SIDDIPET 7702015577